thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 158 | కరీంనగర్ శనివారం, 16 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

న్యూఢిల్లీ : అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది.




# కోటికొక్కడు ..!!

# -శ్రీధర్ బాబు రియల్ హీరో



## -వందమంది ముఖ్యుల్లో మనమంత్రి

## -అనాలటిక్ ఆఫ్ ఇండియా మాగజైన్ రికార్డులో చోటు

## -గ్లోబల్ ఏ ఐ సక్సెస్ ఘనత శ్రీధర్ బాబు దే .!!

చురకలు :హైదరాబాద్ ,కట్టా నరేంద్రాచారి ప్రధాన ప్రతినిధి: అనాలాటిక్స్ ఆఫ్ ఇండియా మాగజైన్ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఒక సర్వే మంత్రి శ్రీధర్ బాబును హీరోగా నిలబెట్టింది .మోస్ట్ ఇన్ ఫ్యూఎన్షియల్ పీపుల్ ఇన్ ఏ ఐ లో అనాల్టిక్స్ ఆఫ్ ఇండియా బుక్ జాబితాలో మంత్రి శ్రీధర్ బాబు పేరు రావడం తెలంగాణకు దక్కిన గౌరవం..మంత్రి బాధ్యతలు చేపట్టిన తొలి నా లనుండే తెలంగాణ రాష్ట్రమును ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీలో రోల్ మోడల్ గా మార్చారు .వివిధ రంగాలకు చెందిన వందకోట్ల నుండి కోటికొక్కడిని గుర్తిచ్చినట్టు వాడపోసి తెలంగాణరాష్టంనుండిశ్రీధర్ బాబు సమయస్ఫూర్తి, ఆయారంగాలపై విశేషమైనాప్రతిభనుచూపినట్టు అనాలాస్టిక్స్ బుక్స్ నిర్ధారించింది.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో గుడ్ గవర్నెన్స్ నూతన ఆవిష్కరణలు సురక్షితమైన డేటా బేస్ చేర్చి ఏఐ ఆధారిత తెలంగాణకు రూపకల్పన చేశారు తన శాఖ పరంగా గ్లోబల్ ఏఐ సమ్మిట్ విజయవంతంగా పూర్తి చేశారు అంతేకాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రోద్భావంతో తెలంగాణలో ఏఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీ స్థాపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు ఇది త్వరలో కార్యరూపం దాల్చనుంది పూర్వపు ఐటీ శాఖ మాత్యులు కేటీ రామారావు కంటే ఐటీ రంగంలో వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను తెలంగాణకు పట్టుకొచ్చారు

హైదరాబాదు లో నూతన ఆవిష్కరణ అయిన ఫ్యూచర్ సిటీ తో పాటు మూసి రివర్స్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ని భాగస్వా మ్యం చేస్తూ భవిష్యత్ తెలంగాణకు బాటలు వేస్తున్నారు.ఈ రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా మారిన శ్రీధర్ బాబు గత ప్రభుత్వం కంటే ఐటీ రంగాన్ని పదునైనా చతురత తో విదేశీ సంస్థలను మెప్పించి, ఒప్పించి హైదరాబాద్ కు రప్పించడంలో శ్రీధర్ బాబు అగ్రబాగాన నిలిచారు. ఇలా అనేకమెరిట్స్ సొంతం చేసుకున్న మంత్రి తాజగా కోటికోక్కాడుగా నిలిచారు.అరుదయిన గౌరవం తో తెలంగాణ ఖ్యాతి దేశ వ్యాపతం చేశారు.హైదరాబాద్ ఐటీ రంగానికి ప్రతేక్య గుర్తింపు వచ్చే విదంగ విశేష కృషి చేస్తూ ఐటీ లో తెలంగాణ తలెత్తు కునే స్థాయికి చేర్చిన ఘనత శ్రీధర్ బాబుకు దక్కిందని అంటున్నారు



## తెలంగాణ రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం.. హాజరైన సీఎం రేవంత్

హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమం జరిగింది.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చిన తేనీటి విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన వారి వద్దకు గవర్నర్, సీఎం వెళ్లి పలకరించారు.



## భారత్ రక్షణకు సుదర్శన్ చక్రం

రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకొంది. భారత్‌ను ఎలాంటి ముప్పు నుంచైనా రక్షించేందుకు వీలుగా మిషన్ సుదర్శన్ చక్రను ప్రధాని మోదీ ప్రకటించారు. వచ్చే పదేళ్లలో దేశీయ సాంకేతికతతో అభివృద్ధి చేయనున్న ఈ వ్యవస్థ కీలక ప్రదేశాలను కాపాడనుంది. ప్రతి పౌరుడు దీని కింద సురక్షితంగా ఉన్నట్లు భావిస్తారని ప్రధాని భరోసా ఇచ్చారు. మహాభారతంలోని శ్రీ కృష్ణుడి స్ఫూర్తితో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో దేశంలోని కీలకమైన మౌలిక వసతులను ముప్పు నుంచి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో సాంకేతికత అభివృద్ధి విదేశాలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గిస్తోందన్నారు. 2008 ముంబయి దాడులు సమీకృత భద్రతా ప్రణాళిక అవసరాలను పెంచాయన్నారు. దేశంపై దాడులు జరిగినప్పుడు మాత్రమే స్పందించేలా కాకుండా.. ముందే సంసిద్ధతతో ఉండాలన్నారు. పదేళ్ల క్రితం రక్షణరంగంలో స్వయంసమృద్ధిపై మన దేశం దృష్టిపెట్టిందని.. ఇప్పుడు దాని ఫలితాలను చూస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రసంగం ముగిసిన అనంతరం ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలలను కలిశారు. సుదర్శన్ చక్రను బహుళ అంచెల భద్రతా వ్యవస్థగా భావిస్తున్నారు. అత్యాధునిక నిఘా, సైబర్, పలు కీలక ప్రదేశాల రక్షణలు ఇందులో ఉండనున్నాయి. దీనిలో ప్రభుత్వ రక్షణ పరిశోధన సంస్థలు, ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యం ఉండనుంది. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని ముందుకుతీసుకెళ్లేలా ఇది ఉండనుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్, హైబ్రీడ్ యుద్ధ తంత్రాలు, వెన్నుపోటు వ్యూహాల అమలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని ప్రకటన రావడం గమనార్హం.



## ఓట్ల చోరీ చేస్తే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచేదా?: కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్: ఓట్ల చోరీకి, భాజపాకు ఏం సంబంధమని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తాము ఓట్ల చోరీ చేస్తే తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచేదా? అని నిలదీశారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలో భాజపా సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుతో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు. " ఓట్ల చోరీ జరిగితే.. ఇండి కూటమికి 230 ఎంపీ సీట్లు వచ్చేవా? భాజపాకు 240 ఎంపీ సీట్లు మాత్రమే ఎందుకు వస్తాయి? ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. అందుకే కాంగ్రెస్ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది" అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

# వందేళ్ల కలను నిజం చేశాం..

# బలహీనవర్గాల కళ్ళల్లో ఆనందం చూశాం!



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇవాళ ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని గోల్కొండలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అంతకు ముందు అయన పోలీసు బలగాలు కవాతు నిర్వహించగా సీఎం గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నేడు మనమంతా అనుభవిస్తోన్న స్వాతంత్ర్య ఫలాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలితాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలు త్యాగం చేసిన మహనీయులకు ఈ సందర్భంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామని తెలిపారు. ప్రజలు, ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా విధాన నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. రైతులు, మహిళలు, యువత భవితకు పెద్దపీట వేశాం. సామాజిక తెలంగాణ ఆవిష్కరణకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. కుల గణనతో బలహీనవర్గాల వందేళ్ల కలను నిజం చేశామని అన్నారు. ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల నిరీక్షణకు తెరదించామని సీఎం వెల్లడించారు. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను 20 నెలల కాలంలోనే దేశానికి రోల్ మోడల్‌గా నిలబెట్టామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు అందుబాటు ధరల్లో నిత్యవసరాలు అందించే ఉద్దేశంతో రేషన్ షాపుల ద్వారా 'సన్న బియ్యం' పంపిణీని ప్రారంభించామని అన్నారు. రూ.13 వేల కోట్ల వ్యయంతో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆత్మగౌరవానికి మరో ప్రతీక అయిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ఏడాది జూలై 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణమాఫీ చేసి ఈ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం రాయని కొత్త చరిత్ర రాశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్నం పెట్టే రైతు అప్పు కోసం ఎవరి దగ్గర చెయ్యి చాచకూడదన్న ఆలోచనతో 'ఇందిరమ్మ రైతు భరోసా' కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం ప్రకటించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పరిమితులు లేకుండా ప్రతి రైతుకు ఈ పథకం కింద సాయం చేశామన్నారు. జూన్ 16న పథకాన్ని ప్రారంభించి కేవలం 9 రోజుల్లో 70,11,184 మంది రైతుల ఖాతాల్లో రూ.తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 1.2 లక్షల మంది రైతులకు కూడా పెట్టుబడి సాయం అందించామని, సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. పదేళ్ల తర్వాత పేదల సొంతింటి కలలకు మళ్లీ రెక్కలు తొడిగామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నేడు గ్రామాల్లో పేదల ఆత్మగౌరవ ప్రతీకలుగా కనిపిస్తున్నాయి. తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. అవన్నీ శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని అందుకు గాను రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.



# మోదీ కానుక..యువత కోసం రూ. 1 లక్ష కోట్ల పథకం

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఢిల్లీలోని ఎర్రకోట బురుజు నుంచి జాతినుద్దేశించి మాట్లాడారు. పలు అంశాలపై సుదీర్ఘంగా ప్రసంగించారు. యువత కోసం రూ. 1 లక్ష కోట్ల పథకం - ప్రధానమంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ పథకం కింద ప్రైవేట్ రంగంలో తొలిసారి ఉద్యోగంలో చేరే వారికి ప్రభుత్వం నుంచి రూ.15 వేలు ఇవ్వనుంది. ఈ పథకం ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా.

**సెమీకండక్టర్ల ఉత్పత్తి..** ఈ ఏడాది చివరి నాటికి తొలి మేడ్-ఇన్-ఇండియా సెమీకండక్టర్ చిప్‌లు మార్కెట్లోకి విడుదలవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఆరు సెమీకండక్టర్ యూనిట్లు ప్రారంభం అయ్యాయని, నాలుగు కొత్త యూనిట్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని చెప్పారు. అణుశక్తి సామర్థ్యాన్ని పదిరెట్లకు పెంచుతామని మోదీ తెలిపారు.

**జీఎస్టీలో సంస్కరణలు..** సంస్కరించిన జీఎస్టీని దీపావళి కానుకగా ఇస్తామన్నారు. జీఎస్టీపై రాష్ట్రాలతో చర్చించి మార్పులు, చేర్పులు చేస్తున్నమని, సామాన్యులపై భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**'పాక్ బెదిరింపులకు బెదరం'...** అణుబాంబుల బెదిరింపులకు భారత్ బెదరదని, శత్రువుకు తగిన సమాధానం ఇస్తామని పరోక్షంగా పాక్‌ను హెచ్చరించారు మోదీ. పహెల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాక్‌కు సింధు జలాలను నిలిపేసిన సంగతి తెలిసిందే. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్, మాజీ విదేశాంగమంత్రి బిలావల్ భుట్టో, పాకిస్థాన్ ప్రధాని షహెబాజ్ షరీఫ్ ..సింధూ జలాలను వదలకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని భారత్‌ను హెచ్చరించిన నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్-పాక్ మధ్య సింధూ జలాల ఒప్పందం వల్ల గత ఏడు దశాబ్దాలుగా భారత రైతులు "ఊహించని నష్టాలను" చవిచూశారని, ఇకపై వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాక్‌కు నీరు వదలడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

**స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి..** స్వాతంత్ర్య సమరయోధులు డా.రాజేంద్ర ప్రసాద్, బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఎస్ రాధాకృష్ణన్ త్యాగాలను మోదీ కొనియాడారు. "నారి శక్తి" సహకారం తక్కువేమీ కాదని అన్నారు. రాజ్యాంగం కోసం ముఖర్జీ ఎంతో త్యాగం చేశారని గుర్తుచేశారు.

**ప్రధాని ప్రసంగం రికార్డుల్లోకి..** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోదీ ఈ సారి 103 నిమిషాలు ప్రసంగించారు. దేశ చరిత్రలో ఏ ప్రధాని కూడా ఇంత సమయం పాటు మాట్లాడలేదు. గతేడాది 98 నిమిషాల తన రికార్డును బద్దలు కొట్టారు. 2016 లో 96 నిమిషాల పాటు ప్రసంగించిన మోదీ 2017 లో 56 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ప్రధాని హోదాలో మోదీ ఎర్రకోట నుంచి వరుసగా 12 సార్లు ప్రసంగించి ఇందిరా గాంధీ రికార్డును బద్దలు కొట్టారు. వరుసగా 17 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలు చేసిన జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత స్థానం మోదీకే దక్కింది.




హైదరాబాద్, ఆగస్టు 15: బనకచర్ల ప్రాజెక్ట్ పై ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. గోల్కొండలో జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

కృష్ణా, గోదావరి నదుల్లో నీటివాటా హక్కుపై రాజీలేదని తేల్చి చెప్పారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా దక్కించుకుంటాం అని అన్నారు. మన అవసరాలు తీరాకే మిగతా రాష్ట్రాలకు నీరు అందిస్తామని అన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు.

**కాళేశ్వరం కూలిపోయింది..** గత ప్రభుత్వం లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని సీఎం అన్నారు. SLBC, పాలమూరు-రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం అని చెప్పారు. తెలంగాణలో చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం అని హామీ ఇచ్చారు. హైదరాబాద్ బ్రాండింగ్ పెంచేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. యువతను డ్రగ్స్‌కు బానిస చేసే కుట్రలు ఛేదించామని... 20 నెలల్లో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. మూసీ పునరుజ్జీవంతోనే హైదరాబాద్ వరదకు పరిష్కారం అని అన్నారు. త్వరలో వరంగల్, ఆదిలాబాద్‌కు కొత్త ఎయిర్‌పోర్టులు వస్తున్నాయని చెప్పారు. త్వరలోనే గ్రూప్-1, 2, 3 నియామకాలు పూర్తి చేస్తామన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ %ఐచీూ%లోనే ఉందని అన్నారు.




విజయవాడ : పంద్రాగస్టు వేడుకల్లో బనకచర్లపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్లతో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. బనకచర్లపై ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని.. సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వాడుకుంటాం అని అన్నారు. ఎగువ రాష్ట్రాల వరద నీటితో నష్టాలనూ భరిస్తున్నామని.. అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరమేంటి? అని పరోక్షంగా తెలంగాణ సర్కార్‌కు ప్రశ్నను సంధించారు. వరదను భరించాలి కానీ ఆ నీటిని వాడుకోవద్దా? అని నిలదీశారు. కాగా రాయలసీమను నీటితో సశ్యశామలంగా చేసేందుకు బనకచర్ల ప్రాజెక్ట్ ను నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే . అయితే దీనికి తెలంగాణ సర్కార్ నో చెప్పడంతో వివాదం రాజుకుంది.

**కఠిన చర్యలు ఉంటాయి..** మహిళలను సోషల్ మీడియాలో వేధించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు సీఎం. రేషన్ బియ్యం రిసైక్లింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేశామన్నారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. రాయలసీమలో సాగునీరు అందించే %ఎచీూ%పై గత ప్రభుత్వ నాటకం ఆడిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తూ 2026 జులై నాటికి నీరు ఇస్తామని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు పోలవరం నుంచి బనకచర్లకు నీరు అందిస్తాం అని ప్రకటన చేశారు. మిగులు జలాలను, వరద నీటిని ఉపయోగించుకుంటామని.. వరదను బరించాలి అయితే వాటిని వాడకూడదు అంటే ఎలా అని ప్రశ్నించారు. 785టిఎంసి నీళ్లు వివిధ రిజర్వాయర్ లలో నిల్వ ఉన్నాయని అన్నారు




గోల్కొండ: అహింసా పద్ధతిలో మహా సంగ్రామాన్ని గెలిచామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రపంచానికి సరికొత్త మార్గం చూపించామని చెప్పారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయపతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. 1947 ఆగస్టు 15న నెహ్రూ చేసిన ప్రసంగం దేశం మొత్తాన్ని ఏకం చేసిందన్నారు. " దేశ భవిష్యత్ మనల్ని పిలుస్తోందని నెహ్రూ చేసిన ప్రసంగం చిరస్మరణీయం. నెహ్రూ స్ఫూర్తిదాయక మాటలతో దేశానికి దిశానిర్దేశం చేశారు. నాటి ప్రధాని నెహ్రూ కేవలం ప్రసంగాలతో సరిపెట్టలేదు. పటిష్ఠ భారత్ కోసం ఎన్నో చర్యలను చేపట్టారు. మహనీయుల స్ఫూర్తితో తెలంగాణను అగ్రపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సాహసోపేత నిర్ణయాలతో సాగుతోంది. ప్రపంచ నగరాలతో పోటీపడే నిర్ణయాలతో ముందడుగు వేస్తున్నాం. మరోవైపు పేదల సంక్షేమంలో సరికొత్త చరిత్ర రాస్తున్నాం. సంక్షేమానికి కేరాఫ్ అంటే కాంగ్రెస్ పాలన. దేశంలో ఎక్కడా లేనివిధంగా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం పథకం కేవలం ఆకలితీర్చే పథకం కాదు. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక. ప్రజాప్రభుత్వం వచ్చాకే పేదల సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రేషన్‌షాపులు పేదవాడి ఆకలితీర్చే భరోసా కేంద్రాలుగా మారాయి.

**ప్రపంచానికే ఆదర్శంగా నిలువుతాం..** ప్రపంచానికే ఆదర్శంగానిలిచేలా, తెలంగాణ, హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో విజినరీ డాక్యుమెంట్ ఏర్పాటు చేశాం. విజనరీ డాక్యుమెంట్ డిసెంబర్ 9న ప్రజల ముందు ఉంచుతాం. భారత్ గేమ్ ఛేంజర్‌గా హైదరాబాద్ నగరం నిలుస్తుంది. 30 ట్రిలియన్ డాలర్ ఎకానమీలో తెలంగాణ అగ్ర భాగస్వామిగా నిలుస్తుంది. జీడీపీలో ప్రస్తుతం 5 శాతం ఉన్న వాటాను 10శాతానికి పెంచుతాం. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. విశ్వ క్రీడల్లో మన ఖ్యాతి మరింత పెరగాల్సిన అవసరం ఉంది. మన యువతకు క్రీడా సదుపాయాల కోసం క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. పోలీసింగ్ వ్యవస్థలో రాష్ట్ర పోలీసులు ముందు వరుసలో నిలవడం గర్వకారణం. డ్రగ్ నియంత్రణలో తెలంగాణ పోలీసులు ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారు. గత ప్రభుత్వం మాకు వారసత్వంగా రూ.8.21 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిపోయింది. ఓ వైపు దానికి వడ్డీలు కడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# తండ్రిని కలిసేందుకు కుటుంబ సభ్యులతో వెళ్లిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు అమెరికా వెళ్లనున్నారు. అక్కడి కళాశాలలో కుమారుడిని చేర్పించనున్నారు.

ఈ మేరకు ఆమె 15 రోజులు అమెరికాలో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కవిత ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. తన కుమారుడికి కేసీఆర్ ఆశీర్వాదం తీసుకోన్నట్టు సమాచారం. కవిత అమెరికా పర్యటనకు దిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ఇప్పటికే అనుమతించింది.

# విధానపరమైన నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలని, అప్పుడే అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. ఇవాళ్టి నుంచి మూడు రోజుల పాటు ఈ ప్రాపర్టీ షో కొనసాగనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. శతాబ్దాలుగా సాగిన హైదరాబాద్ అభివృద్ధిలో ఎంతో మంది పాత్ర ఉందన్నారు. పాలకులు మారినా పాలసీ పెరాలసిస్ లేకపోవడంతో అభివృద్ధి కొనసాగిందని చెప్పారు. " రాష్ట్రాభివృద్ధిని పణంగా పెట్టే ఎలాంటి నిర్ణయాలను ఈ ప్రభుత్వం తీసుకోదు. పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాదు.. లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత నాది. దేశ విదేశాలు తిరుగుతూ పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తున్నాం. స్వదేశీ పెట్టుబడుల విషయంలో కొందరు అపోహలు సృష్టిస్తున్నారు. విదేశీ సంస్థలను ప్రోత్సహించిన మేము.. ఈ దేశ వాసులను ఎందుకు ప్రోత్సహించమో ఆలోచించాలి. నేను మధ్యతరగతి మనస్తత్వం ఉన్న వ్యక్తిగా ఆలోచిస్తాను. ప్రజల సంపద కొల్లగొట్టి విదేశాలకు తరలించి దాచుకునే ఆలోచన నాకు లేదు. గత ప్రభుత్వం అధిక వడ్డీ రేట్లకు భారీగా రుణాలు తెచ్చింది. మేం పాత రుణాలను తక్కువ వడ్డీ రేట్లకు రీషెడ్యూల్ చేయించాం. మెట్రో రైలు విస్తరణ కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాం. మహారాష్ట్రలో 40 విమానాశ్రయాలుంటే.. మనకు ఒక్కటే ఉంది. గత ప్రభుత్వం కొత్త విమానాశ్రయాల గురించి పట్టించుకోలేదు. మేం కేంద్రాన్ని ఎన్నోసార్లు సంప్రదించి రెండు విమానాశ్రయాలు సాధించాం. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్‌కు విమానాశ్రయాలు సాధిస్తాం. రీజినల్ రింగ్‌రోడ్డు, రీజినల్ రింగ్‌రోడ్డు రైలు రింగ్ కోసం కృషి చేస్తున్నాం." అని రేవంత్ తెలిపారు.

# ఫామ్‌హౌస్‌లో సోదాలు.. పోలీసుల అదుపులో 51 మంది విదేశీయులు



మొయినాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం బాకారంలోని ఓ ఫామ్ హౌస్‌లో పోలీసులు దాడులు నిర్వహించారు. ఫామ్‌హౌస్‌లో ఉగాండా, కెన్యాతోపాటు మరో రెండు ఆఫ్రికన్ దేశాలకు చెందిన 51 మందిని గుర్తించారు. అక్కడ జరిగిన పార్టీలో డ్రగ్స్, గంజాయి వాడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సోదాలు నిర్వహించిన పోలీసులు వారందర్నీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.

"ఉగాండాకు చెందిన మమాస్ అనే మహిళ పుట్టిన రోజు పార్టీ నిర్వహించింది. వీసా గడువు ముగిసినప్పటికీ ఆమె ఇక్కడ అక్రమంగా నివసిస్తోంది. ఇప్పటి వరకు 65 బీర్లు, 20 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. ఇమిగ్రేషన్ అధికారులను పిలిపించి వీసాలు సరైనవేవో కాదో చెక్ చేస్తున్నాం. పట్టుబడిన 51 మందిలో 12 మంది విద్యార్థులు ఉన్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల తనిఖీలు పూర్తయిన తర్వాత డ్రగ్స్ టెస్టులు నిర్వహిస్తాం" అని డీసీపీ వెల్లడించారు.




జమ్మూకాశ్మీర్‌లోని చషోటి గ్రామంలో క్లౌడ్ బరస్ట్ పెను విషాదం మిగిల్చిన సంగతి తెలిసిందే. క్లౌబ్ బరస్ట్ కారణంగా పదుల సంఖ్యలో జనం ప్రాణాలు పోగొట్టుకోగా.. దాదాపు 200 మంది గల్లంతు అయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం నాటికి మృతుల సంఖ్య 46 నుంచి 60కి చేరింది. చనిపోయిన వారిలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. సంఘటన జరిగిన ప్రాంతంలో సహాయక చర్యలు ఊపందుకున్నాయి. ఆర్మీ కూడా సహాయక చర్యల్లో భాగమైంది. ఇప్పటి వరకు 160 మందిని రక్షించినట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఉదయం జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాలతో క్లౌడ్ బరస్ట్ విషాదంపై ఫోన్ చేసి మాట్లాడారు. అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైనంత సాయం చేస్తానని ప్రకటించారు. ఈ మేరకు ఒమర్ అబ్దుల్లా తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'ఇప్పుడే ప్రధాని నరేంద్ర మోదీనుంచి నాకు కాల్ వచ్చింది. కిస్త్‌వార్‌లోని పరిస్థితుల గురించి ఆయనకు వివరించి చెప్పాను. అధికారులు తీసుకుంటున్న చర్యలను కూడా వివరించాను. ఆయన మద్దతు, సాయానికి మా ప్రభుత్వం, బాధిత ప్రజలు ఎంతో రుణపడి ఉంటారు' అని పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కిస్త్‌వార్‌లోని మాచైల్ మాత ఆలయానికి వస్తూ ఉంటారు. యాత్రకు వెళ్లే వారికి చషోటి గ్రామమే బేస్ పాయింట్. ఇక్కడ యాత్రికుల కోసం సామూహిక వంటశాలలు ఏర్పాటు చేస్తారు. భక్తులు ఇక్కడే వాహనాలు వదిలి, కాలినడకన మాచైల్ మాత గుడికి వెళతారు. గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మెరుపు వరదలు రావడంతో భక్తుల టెంట్లు, దుకాణాలు, వసతి సౌకర్యాలు, సెక్యూరిటీ అవుట్ పోస్టులన్నీ కొట్టుకుపోయాయి. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.




చుట్టుపక్కల మొత్తం ప్రత్యర్థి దేశాలే.. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంట్.. అయినా.. ఖండాలను దాటి శాంతి చర్చల్లో పాల్గొనేందుకు రష్యా అధినేత పుతిన్ సిద్ధమయ్యారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యేందుకు ఆయన అలాస్కా యాంకరేజ్‌లోని ఎల్మెండోర్ఫ్-రిచర్డ్సన్ సైనిక స్థావరానికి వెళ్లనున్నారు. ఇరు దేశాల సంబంధాల్లో ఇదో కీలక ఘట్టం కానుంది. 2022లో ఉక్రెయిన్ యుద్ధం మొదలైన నాటి నుంచి నాటో దేశాలు తమ గగనతలాలను రష్యా వాడుకోకుండా మూసివేశాయి. అమెరికా, కెనడా, నార్వే, ఐరోపా సమాఖ్య దేశాలు వీటిలో ఉన్నాయి. రష్యా కూడా దాదాపు 30కిపైగా దేశాల విమానాలు తమ గగనతలంలోకి రాకుండా నిషేధం విధించింది. ఇలాంటి పరిస్థితుల్లో పుతిన్ ప్రయాణించాల్సిన విమానం పశ్చిమార్ధగోళం నుంచి ఉన్న మార్గాన్ని పూర్తిగా మర్చిపోవాల్సిందే. దీంతో పుతిన్ విమానం రష్యా-అమెరికా మధ్య ఉన్న బేరింగ్ జలసంధిపై నుంచి ప్రయాణించే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. తమ గగనతలంలోకి రష్యా అధినేత విమానం ప్రవేశించేందుకు అనుమతి ఇచ్చింది. రష్యా మారుమూల ప్రదేశమైన చుకోట్కా ద్వీపకల్పం నుంచి పుతిన్ విమానం రానుంది. బేరింగ్ జలసంధి వద్ద రష్యా-అమెరికా ప్రధాన భూభాగాలు కేవలం 88 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇక అలాస్కాకు చెందిన లిటిల్ డైమెడ్, మాస్కోకు చెందిన బిగ్ డైమెడ్ ద్వీపాల మధ్య దూరం కేవలం మూడు మైళ్లే. కోల్డ్‌వార్ సమయంలో రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచేవ్ ప్రభుత్వం ఈ ప్రదేశాన్ని ఐస్‌కర్టెన్‌గా అభివర్ణించేది. అలాస్కాలో అమెరికా కమాండ్ సెంటర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు, లాజిస్టిక్స్ హబ్స్ ఉన్నాయి. ఉత్తర అమెరికాను ముప్పుల నుంచి హెచ్చరించే 'ది నార్త్ వార్నింగ్ సిస్టమ్' ప్రధాన కేంద్రం ఇక్కడే ఉంది. అమెరికా, కెనడాలు సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. ఇక్కడ అత్యాధునిక యుద్ధవిమానాలైన ఎఫ్-22 రాప్టర్లు ఉన్నాయి. యాంకరేజ్‌లోని ఎల్మెండోర్ఫ్-రిచర్డ్సన్ సైనిక స్థావరంలో దాదాపు 32 వేల మంది ఉన్నారు. దీనిని సందర్శించిన తొలి రష్యా అధ్యక్షుడిగా పుతిన్ రికార్డు సృష్టించనున్నారు.

**ఈ వేదికపై విమర్శలూ వస్తున్నాయి..** అలాస్కా వేదికగా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలన్న ట్రంప్ ఆలోచనపై విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. అలాస్కాను అమెరికాకు అమ్మేసిన అంశాన్ని రష్యా అధినేత లేవనెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు.

భూభాగాలు మారడంలో తప్పు లేదని.. తాము అలాస్కాను అమెరికాకు ఇవ్వగా లేనిది.. ఉక్రెయిన్ భూభాగం మాకు వదులుకోవచ్చుగా అని పుతిన్ వాదించే అవకాశం ఉందని.. బ్రిటన్ మాజీ దౌత్యవేత్త నిగెల్ గౌల్డ్ డెవిస్ స్కైన్యూస్ వద్ద పేర్కొన్నారు.




సిలికాన్ వ్యాలీ టెక్ దిగ్గజాలు ఉద్యోగాల కోతలు కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా భారీగా లే ఆఫ్‌లు విధించగా.. తాజాగా ఒరాకిల్ కూడా అదే బాట పట్టింది. తన క్లౌడ్ విభాగంలో ఉన్నత స్థాయి ఉద్యోగులను తొలుత లక్ష్యంగా చేసుకొని తొలగింపులు చేపట్టింది. సియాటెల్ ఆఫీస్‌లో మొత్తం 161 మందిని తొలగించినట్లు వాషింగ్టన్ రాష్ట్ర ఉద్యోగ భద్రతా విభాగానికి సమర్పించిన ఫైలింగ్‌లో పేర్కొంది. సియాటెల్ ఆఫీస్‌లో ఈ క్లౌడ్ దిగ్గజానికి దాదాపు 400 మంది ఉద్యోగులున్నారు. దీంతో దాని డేటా సెంటర్ల ఆపరేషన్స్ టెక్నీషియన్స్, క్లౌడ్‌బృందాలు, ఏఐ, ఎంఎల్ బృందాల టెక్నికల్ ప్రాజెక్ట్ మేనేజర్లపై లేఆఫ్‌ల ప్రభావం పడింది. ప్రస్తుతం అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ వంటి క్లౌడ్, డేటా సెంటర్ల దిగ్గజాలు ఏఐ మోడల్స్‌పై ఆధారపడటానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయి. పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను నియంత్రించేందుకు వీలుగా ఉద్యోగులను తగ్గించుకొంటున్నాయి. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే 15 వేల మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఆ లేఆఫ్‌ల అనంతరం మిగిలిన ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ బలమైన సందేశం పంపింది. ఏఐలో నైపుణ్యాలను పెంచుకోవడంపై వారు దృష్టిపెట్టాలని సూచించింది. వివిధ డివిజన్లలో 15,000 మంది ఉద్యోగులను సంస్థ విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. 2025లో ఇప్పటివరకు ఈ సంస్థ మొత్తం నాలుగు విడతల్లో ఉద్యోగులను తొలగించింది. ప్రస్తుతం ఒరాకిల్ స్టార్‌గేట్ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉంది. దీని విలువ 500 బిలియన్ డాలర్లుగా అంచనావేశారు. ఇందులో ఓపెన్ ఏఐ, సాఫ్ట్‌బ్యాంక్ వంటి కంపెనీలు కూడా భాగస్వాములు. గతేడాదే ఒరాకిల్ తన ప్రధాన కార్యాలయాన్ని ఆస్టిన్ నుంచి నాష్‌విల్లేకు మార్చినట్లు ప్రకటించింది. భారత్‌లో కూడా టెక్ దిగ్గజాలు కృత్రిమ మేధలో తమ సత్తా చాటేందుకు ఉద్యోగుల సంఖ్యను గణనీయగా తగ్గించుకొని.. ఏఐ వైపు అడుగులు వేస్తున్నాయి. ఇటీవలే టీసీఎస్ 12 వేల మంది ఉద్యోగులను దశల వారీగా తగ్గించుకొంటామని ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 2 శాతానికి సమానం. ఏఐ కారణంగా 4 లక్షల నుంచి 5 లక్షల ఉద్యోగాలు రెండు మూడేళ్లలో పోయే అవకాశం ఉందని రాయిటర్స్ నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే.




## కాల్పుల విరమణ క్రెడిట్ ఇవ్వలేదని భారత్‌పై ట్రంప్ అక్కసు: మాజీ రాయబారి వికాస్ స్వరూప్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ఈ టారిఫ్‌లపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూఢిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. బ్రిక్స్ కూటమిలో భారత్ కూడా సభ్యదేశంగా ఉంది. ఈ కూటమి అమెరికాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించాలనే లక్ష్యంతో ఉందని ఆయన భావిస్తున్నారు. ఇది ఆయనకు నచ్చని అంశం. మరొకటి.. ఉద్రిక్తతల తర్వాత భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇది తానే చేశానని ట్రంప్ పదే పదే ప్రచారం చేసుకుంటున్నారు. అయితే, కాల్పుల విరమణ చర్చల్లో మూడో దేశ ప్రమేయం లేదని న్యూఢిల్లీ వాదిస్తోంది.

**భారత్, పాక్‌తో మంచి సంబంధాలే..** దీనిపై ట్రంప్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పాక్ ఆయన ప్రమేయాన్ని గుర్తించడంతో పాటు.. నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ ప్రతిపాదనలు కూడా చేసింది' అని స్వరూప్ అన్నారు. ఈ సందర్భంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భారత వైఖరిని ఆయన ప్రశంసించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై అమెరికా ఒత్తిళ్లకు లొంగకపోవడం సరైన చర్యేనన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దని ట్రంప్ హెచ్చరించినా భారత్ పట్టించుకోలేదు. దీంతో భారీగా సుంకాలు విధించారు. ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలను 50 శాతానికి పెంచారు. ఆ 25 శాతం అదనపు టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ గడువుకు ముందే యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని న్యూఢిల్లీ చర్చలు జరుపుతోంది.

# సిద్ధి పొందిన తాపసి రామకృష్ణుడు

## - ఆగస్టు 16...రామకృష్ణ పరమహంస వర్ధంతి



స్వామి వివేకానంద గురువు అయిన స్వామి రామకృష్ణ పరమహంస,(గదాధర్ ఛటోపాధ్యాయ) (ఫిబ్రవరి 18, 1836 - ఆగష్టు 16, 1886) విభిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని అనుభవపూర్వకంగా మొట్టమొదటి సారిగా ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయులు. భారతీయ జాతీయతపై రామకృష్ణ పరమహంస ప్రభావం అలేఖ్యం. హిందూ మతం లోని మూఢ నమ్మకాలు అధిక సంప్రాదాయాలను కొంతవరకు తొలగించి, హిందూ మతాన్ని ఇస్లాం, క్రైస్తవ మతాల సవాళ్లకు ధీటుగా నిలబెట్టిన మహనీయుడు రామకృష్ణుడు. అన్ని మతాల సారాన్ని ఆమూలాగ్రంగా ఆస్వాదించడం లక్ష్యంగా అవిరళ కృషి చేసి, సిద్ది పొందిన తాపసి ఆయన. అన్ని మతాలు భగవం తుని చేరడానికి విభిన్న మార్గాలని అనుభవ రీత్యా మొదటి సారి ప్రపంచానికి చాటి చెప్పిన ఆధ్యాత్మిక గురువు. 1836 ఫిబ్రవరి 18న పశ్చిమ బెంగాల్ లోని హుగ్లీ జిల్లాలో కామార్పుకూర్ గ్రామంలో ధార్మిక పేద బ్రాహ్మణులైన క్షుదీరాం, చంద్రమణీ దేవికి జన్మించారు. బాల్యం నుండీ ప్రకృతి ఆరాధకునిగా, సాధు సజ్జన ప్రసంగాలలో ఆసక్తి కనబరుస్తూ, వారికి సేవలందించే వారు. బయట ప్రపంచంతో సంబంధాలను పక్కనపెట్టి ప్రకృతిని ఆస్వాదిస్తూ గడిపేవారు. ఉపనయనం కాగానే మొదటి భిక్ష ఒక శూద్ర యువతి వద్ద పొందుతానని మాటిచ్చి, పట్టుబట్టి, ఎందరు చెప్పినా వినక, యువతికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, సాంప్రదాయ మార్పుకు శ్రీకారం చుట్టారు. 5 ఏళ్ళ శారదా దేవితో ఆయన పెళ్ళి కాగా, శారద... రామకృష్ణుని మొదటి శిష్యురాలుగా మారింది. తాను గురువుల వద్ద నేర్చుకున్న విద్యలన్నీ ఆమెకు నేర్పారు. ఆమె గ్రహణ శక్తికి మెచ్చి ఆమెను త్రిపుర సుందరి శక్తిగా పూజించడము మొదలు పెట్టారు. ఆమెను సాక్షాత్ కాళికాదేవిలా భావించి పూజించారు. ఆమెను కూడా తనంతటి వారిగా తీర్చిదిద్దారు. శారదా రామకృష్ణుల సంబంధము సామాన్య మానవులు అర్థము చేసుకోలేరని భావించేవారు. చాలా కాలము అమెతో గడిపిన తరువాత రామకృష్ణుడు వారి బంధము ఆధ్యాత్మికమైనదని నిర్ణయించారు. తండ్రి మరణానంతరం పెద్దన్న రాంకుమార్ కలకత్తాలో సంస్కృత పాఠశాల నడుపుతూ, పౌరోహిత్యం చేస్తున్న క్రమంలో, రాణి రాషమొణి అనే యువతి దక్షిణేశ్వర్ కాళీమాత గుడి కట్టించగా, రాంకుమార్ పూజారిగా, రామకృష్ణుడు దేవతను అలంకరించే వారు. రాంకుమార్ మరణించాక, ఆయనే పూజారిగా మారారు. గుడిలో ఉన్నది. రాతి విగ్రహమా? లేక సజీవమా తెలుసుకునేందుకు రేయిం బవళ్ళు చేసిన కఠోర ప్రార్ధన ద్వారా అమ్మవారి దర్శన భాగ్యం ఆయనకు కలిగింది. మనిషికి చేసేలాగే విగ్రహానికి సేవలు చేసేవారు. స్వామి రామకృష్ణ పరమహంస తన తంత్ర సాధనలో భాగంగా వివిధ గురువుల మార్గదర్శకత్వం క్రింద వైష్ణవ భక్తి గురించి, అద్వైత వేదాంతం గురించి తెలుసుకున్నారు. అన్ని మతాల పరమ సత్యాన్ని గ్రహించారనే ప్రచారంతో అన్ని మతాల వారూ ఆయన దర్శనానికి వచ్చేవారు. అనేకమంది విదేశీయులు ఆధ్యాత్మికతకు ప్రభావితమై, రామకృష్ణుని అనుసరించారు కూడా. తోతాపురి అనే సాధువు అద్వైతాన్ని బోధించారు. భైరవీ బ్రాహ్మణి అనే ఆమె ఆయనకు భక్తిభావంలో భగవత్ సాక్షాత్కారమును ఉపదేశించారు. తద్వారా మూడు రోజులలోనే నిర్వికల్ప సమాధిని పొందిన మహనీయుడు. జ్ఞానాన్ని సంపాదించడానికి, మానవ ఉనికికి సంబంధించిన అంశాల గురించి తెలుసు కోవాలని పరితపించారు. క్రమంగా ఆయన తన జీవితానికి గల పరమార్ధాన్ని అర్ధం చేసుకున్నారు. తాను ఏమి కోరుకుంటున్నాడో ఆ దిశగా అడుగులు వేసి చివరికి ఫలితం సాధించారు. బెంగాలీ గ్రామీణ కుటుంబంలో జన్మించిన రామకృష్ణ , తర్వాతి కాలంలో భగవత్, ఆత్మసాక్షాత్కారం పొంది, తర్వాత ఇస్లాం క్రైస్తవ మార్గాల సాధన ద్వారా ఫలితం పొందారు. స్వామి వివేకానంద నిజంగా భగవదనుభవం పొందిన వారిని అన్వేషిస్తూ... ఎందరినో కలిసి నిరాశకు లోనై, చివరికి రామకృష్ణులను కలిశారు. "మహాత్మా మీరు భగవంతున్ని చూసారా?" అని ప్రశ్నించి సానుకూల సమాధానం పొందారు. రామకృష్ణులు కేవలం స్పర్శతో ఆధ్యాత్మిక అనుభవాలను ప్రసాదించారు. అలా వివేకానంద ఆయన శిష్యులుగా మారారు. రామకృష్ణుడు తన ప్రత్యక్ష శిష్యులకు సన్యాసము ఇవ్వడము ద్వారా రామకృష్ణ మిషన్ ను స్వయముగా ప్రారంభించగా, స్వామీ వివేకానంద రామకృష్ణుని సందేశాలను పాశ్చాత్య దేశాలకు వ్యాపింప చేశారు. తాము చని పోయే ముందు తమ ఆధ్యాత్మిక శక్తులన్నీ వివేకానందునికి ధారవోసి, 1886 ఆగస్టు 16న మహా సమాధిని పొందారు. స్వార్థం నుండి విడివడితే భగవంతుడిని పొంద వచ్చునని నిరూపించి చూపారు.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# 200 ఏళ్ల 'లార్డ్స్..' ఎన్నో ప్రత్యేకతలు.. మరెన్నో ఘనతలు

ఐదు వన్డే ప్రపంచ కప్ ఫైనల్స్, మూడు టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్స్ జరిగిన ఒకే ఒక వేదిక.. వందల ఏళ్ల కిందటే టెస్టు మ్యాచ్ వేదిక.. అక్కడ సెంచరీ కొడితే బ్యాట్స్ మన్ జన్మ ధన్యం.. ఐదు వికెట్లు తీస్తే బౌలర్ కు గొప్ప ఘనత.. 2002లో ఓ గ్రౌండ్ బాల్కనీలో టీమ్ ఇండియా కెప్టెన్ సౌరభ్ గంగూలీ తన జెర్సీ విప్పి గాల్లోకి తిప్పిన సీన్ గుర్తుందా..? భారత క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మర్చిపోని సీన్ అది. ఇదంతా ప్రఖ్యాత లార్డ్స్ క్రికెట్ మైదానం గురించి. క్రికెట్ పుట్టిల్లు అని ఇంగ్లండ్ గురించి చెబుతారు. ఇంకా వివరంగా చెప్పాలంటే లార్డ్స్ మైదానమే క్రికెట్ పుట్టిల్లు. ఈ స్టేడియంలో మ్యాచ్




జరుగుతుంటే చూడడం ఓ అందమైన అనుభవం. 200 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న లార్డ్స్ గ్రౌండ్ లో గురువారం నుంచి టీమ్ ఇండియా-ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు జరగనుంది. మెరిల్ బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ).. క్రికెట్ రూల్స్ తయారుచేసే ఈ క్లబ్ లార్డ్స్ లోనే ఉంది. లాంగ్ రూమ్ తో కూడిన లార్డ్స్ పెవిలియన్ మరింత స్పెషల్. ఇక్కడకు ఎంసీసీ సభ్యులు, ఆహ్వానితులకే ప్రవేశం. లాంగ్ రూమ్ లో దిగ్గజాల పెయింటింగ్స్ ఉంటాయి. ఆటగాళ్లు గ్రౌండ్ లోకి వస్తున్నప్పుడు, లాంగ్ రూమ్ లోకి వెళ్తున్నప్పుడు ప్రేక్షకులు చప్పట్లు కొడుతూ ఉంటారు. ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ హోరాహోరీగా పోరాడే యాషెస్ కప్ గురించి తెలుసు కదా..? అసలైన యాషెస్ కప్ ఎంసీసీ మ్యూజియంలోనే ఉంది. క్రీడల్లో అత్యంత పురాతనమైన ఎంసీసీ లైబ్రరీలో క్రికెట్ కు సంబంధించిన ఎన్నో ఏళ్ల పత్రికలు, పుస్తకాలు ఉంటాయి.

లార్డ్స్ లో గురువారం నుంచి ఇంగ్లండ్-భారత్ మధ్య మూడో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఐదు టెస్టుల సిరీస్ లో 1-1తో రెండు జట్లు సమంగా ఉన్నాయి. దీంతో మూడో టెస్టు కీలకంగా మారింది. లార్డ్స్ పిచ్ పేస్ బౌలర్లకు బాగా ఉపకరిస్తుంది. గత నెలలో ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మధ్య ప్రపంచ టెస్టు చాంపియన్ షిఫ్ (డబ్ల్యూటీసీ) ఇక్కడే జరిగింది. మరి లార్డ్స్ లో జరిగే మూడో టెస్టులో గెలుపు టీమ్ ఇండియాదా? ఇంగ్లండ్ దా?

# ఆ కూలీలకు 'వజ్రాల' పంట పండింది.. ఒక్కొటి రూ.50 లక్షలు

వారిద్దరూ వ్యవసాయ కూలీలే.. అందులో ఒకరు మహిళ కూడా.. సొంతంగా పొలం పండించుకోలేని వారి పంట పడింది. అదికూడా వజ్రాల పంట కావడం గమనార్హం. ఏపీలోని కర్నూలు జిల్లా తుగ్గలి, తదితర మండలాల్లో తొలకరి వర్షాలతో వజ్రాలు దొరుకుతాయనే పేరుంది. గతంలో ఇలా ఎన్నోసార్లు జరిగింది కూడా. దీనికోసం వేరే జిల్లాలు, ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వాహనాల్లో తరలివచ్చి, రోజుల తరబడి పొలాల్లో నివాసం ఉంటారు. వంటవార్పు అక్కడే చేసుకుంటారు. ఇలా తుగ్గలి మండలం పెండెగల్లు గ్రామంలో తాజాగా ఓ మహిళా కూలీకి 15 క్యారెట్ల వజ్రం దొరికింది. కాగా, దీన్ని కొనేందుకు వ్యాపారి రూ.పది లక్షలు ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే, దొరికిన వజ్రం విలువ 50 లక్షలు ఉంటుందన్న సమాచారంతో ఆ మహిళా కూలీ అమ్మేందుకు నిరాకరించింది. 15 క్యారెట్ల వజ్రం అంటే చాలా ఖరీదైనదే. పెద్దగానూ ఉంటుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్యారెట్ వజ్రం ధర వెయ్యి డాలర్ల నుంచి 20 వేల డాలర్స్లి (రూ.85 వేలు-రూ.17 లక్షలు) అని అంచనా. అదీ 15 క్యారెట్ల వజ్రం మంచి నాణ్యత ఉంటే 15 వేల డాలర్లు నుంచి 3 లక్షల డాలర్లు ఉంటుంది. అ లెక్కన కర్నూలు మహిళా



కూలీకి రూ.12.75 లక్షల నుంచి రూ.2.55 కోట్ల విలువైన వజ్రం దొరికిందని లెక్కగట్టవచ్చు. కాగా, కర్నూలు జిల్లాలోని తుగ్గలి తదితర ప్రాంతాల లాగే మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలోనూ వజ్రాలు దొరుకుతాయి. గతంలో 2.69 క్యారెట్ల వజ్రం రూ.50 లక్షలకు అమ్ముడుపోయింది. ఇప్పుడు అదే పన్నా జిల్లాలో గనిలో పనిచేసేందుకు వెళ్తే.. కార్మికుడికి వజ్రం దొరికింది. అయితే, దానిని మెరుస్తున్న రాయిగా తొలుత చేతిలోకి తీసుకున్న కార్మికుడికి జాక్‌పాట్ తగిలిట్లు అయింది. పన్నాలో గిరిజన కార్మికుడు మాధవ్.. కృష్ణ కల్యాణ్ పట్టి గనిలో పని చేస్తుంటాడు. ఇతడికే రూ.40 లక్షల పైగా విలువైన వజ్రం దొరికింది. ఒక్కరోజులోనే మాధవ్ లక్షాధికారి అయ్యాడు. పన్నా జిల్లా బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ఉంటుంది. వజ్రాలకు ప్రసిద్ధి. 12 లక్షల క్యారెట్ల వజ్రాల నిల్వలు ఉన్నాయని అంచనా. ఈ నిక్షేపాలను వెలికితీసే కార్మికుల్లో ఒకడే మాధవ్. ఇతడికి దొరికిన వజ్రం 11.95 క్యారెట్ల బరువుది. చాలా స్వచ్ఛంగా, అత్యంత విలువైనదని అధికారులు గుర్తించారు. ఇక మాధవ్.. నిబంధనల ప్రకారం పన్నా డైమండ్ కార్యాలయంలో డిపాజిట్ చేశాడు. తర్వాత నాణ్యత, పరిమాణం ఆధారంగా దాని విలువను అంచనా వేసి, వేలం నిర్వహిస్తారు. వేలంలో వచ్చిన మొత్తంలో.. 12.5 శాతం రాయల్టీ పోగా మిగతా డబ్బును వజ్రం దొరికినవారికి ఇస్తారు. మరి మాధవ్‌కు ఎంత వస్తాయో?

చురకలు

## సంపాదకీయం

### కేజ్రీవాల్ బీజేపీ నెత్తిన పాలు పోస్తారా ?

బీహార్ లో మరి కొద్ది నెలలలో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని అక్కడ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి భావిస్తోంది. ఈసారి గెలుపు బీజేపీకి చాలా ముఖ్యం. బీహార్ లో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు ఉన్నాయి. అలాగే ఉత్తరాదిన బీహార్ చాలా కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక ప్రతిపక్షం పాగా వేస్తే 2029 లోక్ సభ ఎన్నికల నాటికి వారి రాజకీయ విస్తరణకు బాటలు పడతాయని బీజేపీ ఆలోచిస్తోంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లో అవకాశమే ఇవ్వకూడదని పట్టుదలతో పనిచేస్తోంది. బీజేపీ జేడీయూ ఘట బంధన్ బీహార్ లో బలంగా ఉందని నమ్ముతోంది. మరో వైపు చూస్తే జన సూరజ్ పార్టీతో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే బరిలో ఉంటున్నారు. ఆయన పార్టీ పోటీ వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందని కూడా లెక్క వేసుకుంటోంది. అయితే ప్రతీ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేస్తోంది. ఆ విధంగా ఆ పార్టీ ఇండియా కూటమి ఓట్లను లాగేసుకుంటోంది. దాంతో కూటమికి అది ఇబ్బందిగా మారి ఎన్డీయే భారీగా రాజకీయ లాభం పొందుతోంది. బీహార్ లో చూస్తే ఎక్కువ ముస్లిం డామినేషన్ అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. మరి ఈసారి కూడా మజ్లిస్ సొంతంగా పోటీకి దిగుతుందా అంటే అలా కాదు అని ఆ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు. బీజేపీని ఓడించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. అందువల్ల తాము కూటమితో పొత్తులకు వెళ్తామని అంటున్నారు. తమకు బలం ఉన్న సీట్లను ఇండియా కూటమి ఇస్తే కనుక కలసి పోటీ చేసి బీహార్ లో ఎన్ డీయే ప్రభుత్వం రానీయకుండా చేస్తామని శపథమే చేస్తున్నారు. మహారాష్ట్రతో పాటు చాలా చోట్ల మజ్లిస్ ఒంటరి పోరు బీజేపీకి కలసి వచ్చింది. ఈసారి మాత్రం అసదుద్దీన్ కొత్త వ్యూహం అనుసరిస్తామని చెప్పడంతో బీహార్ లో బీజేపీకి ఇబ్బందే అని అంతా అనుకుంటున్నారు. అయితే అదే సమయంలో ఆప్ బీజేపీకి అనుకోని వరాన్ని ఇస్తున్నట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. బీహార్ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ తాజాగా ప్రకటించారు. బీహార్ లో కాంగ్రెస్ తో కానీ ఇండియా కూటమితో కానీ తమకు ఎటువంటి పొత్తులు ఉండవని ఆయన తెగేసి చెబుతున్నారు. దాంతో బీజేపీ నెత్తిన పాలు పోయడానికేనా ఆప్ అధినేత ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు అన్నది చర్చకు వస్తోంది. నిజానికి ఆప్ చాలా కాలం నుంచే ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో కూడా పొత్తులు లేకుండా పోటీకి దిగి కోరి ఓటమిని తెచ్చుకుంది. అయినా సరే తమది అదే రూట్ అంటోంది. గుజరాత్ లో కూడా తాము ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతోంది. ఆప్ కి కోపం ఏమిటి అంటే ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ తమ విజయావకాశాలను దెబ్బ తీసింది అని. అందుకే కాంగ్రెస్ శిబిరంలో తాము చేరేది లేదని చెబుతోంది. ఈ విధంగా ఆప్ తీసుకున్న నిర్ణయంతో బీహార్ లో రాజకీయ పరిణామాలు మారుతాయా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఒక వైపు పీకే మరో వైపు ఆప్ ఇలా రెండు పార్టీలు వీలైనంత దాకా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలిస్తే కనుక మరోసారి బీహార్ లో అధికారం తమకు దక్కుతుందని బీజేపీ లెక్క వేస్తోంది. మరో వైపు మజ్లీస్ తో ఇండియా కూటమి పొత్తు కూడా అంత సులువు కాదని భావిస్తోంది. ఆ పార్టీ అడిగే సీట్లను కనుక కేటాయించకపోతే ఒంటరి పోరుకే మజ్లిస్ కూడా దిగుతుందని భావిస్తోంది. ఇలా విపక్షంలో చీలికలు బలహీనతలే బీహార్ కుర్చీని పదిలంగా తమకు అప్పగిస్తాయని బీజేపీ భావిస్తోందిట. బీజేపీయేతర రాజకీయ పార్టీలలో ఐక్యత ఇపుడు అంతటా కనిపించడం లేదు. కాంగ్రెస్ అందరినీ కలుపుకుని పోయే విషయంలో భేషజాలకు పోతోంది. అది కూడా బీజేపీకి అంది వచ్చిన అవకాశంగా మారుతోంది అని అంటున్నారు. ఈసారి కూడా బీహార్ లో ఓటమి చెందితే లాలూ పార్టీతో పాటు కాంగ్రెస్ కూడా రాజకీయంగా మరిన్ని ఇబ్బందులు చూడాల్సి వస్తుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## అజాత శత్రువు అటల్ జీ" - ఆగస్టు 16... వాజ్ పేయి వర్ధంతి



రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పెయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణుక్యుడు. పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. హీటెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను ధీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజపేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజపేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మొరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడైనాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతిశాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనాడు. వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940-44 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజపేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయ మేర్పడింది. 1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ తో కలిసి పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు. ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీన్దయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజపేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజపేయి, స్వతంత్రంగా గౌరవప్రథమైన రాజకీయవేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజపేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేసాడు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు. 1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజపేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాడు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజపేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోక్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీ-లాహోర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే - జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజెక్టులు చేపట్టాడు. 2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2005 డిసెంబర్ నెలలో వాజపేయి క్రియాశీల రాజకీయాలనుండి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించి, "ఇకనుండి లాల్ కృష్ణ అద్వానీ, ప్రమోద్ మహాజన్‌లు భారతీయ జనతా పార్టీకి రామలక్ష్మణుల వంటివారు" అని ప్రకటించాడు. భారతదేశ రాజ్యసభలో అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ తన ప్రసంగంలో వాజపేయిని రాజకీయ భీష్మునిగా అభివర్ణించాడు. అటల్ బిహారీ వాజ్‌పేయిని ఆయన శత్రువులు కూడా విమర్శించరు. 'అజాత శత్రువు, సర్వప్రియుడు, సర్వమాన్య' లాంటి ఉపమానాలను ఆయన పేరుతో జోడిస్తారు. అనారోగ్య కారణాలతో అటల్ జీ 2018 ఆగష్టు 16న మృతి చెందారు. అటల్ జీ జన్మదినమైన డిసెంబర్ 25 ను భారత ప్రభుత్వం సుపరిపాలనా దినంగా ప్రకటించింది.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

## పుంభావ సరస్వతి వానమామలై - ఆగస్టు 16... వానమామలై వరదాచార్యులు జయంతి



తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంథస్థం చేయడం విశేషమే మరి. వానమామలై (1914-1984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో వైఖానస బ్రాహ్మణుల పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబములో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి ఎల్... సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించు కున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, వానమామలై జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకే చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా. ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు. 1968లో పోతన చరిత్రము గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం,1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు. అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంచితులైనారు. తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో (తెలంగాణ) నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు. "పోతన చరిత్రము" వ్రాసి "అభినవ పోతన"గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు, ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుఱ్ఱకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది "పోతన చరిత్రము". మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే. అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు "అభినవ పోతన" బిరుదునిచ్చి సత్కరించింది. ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాత ముత్తాతల ఊరైన చెన్నూరు లోనే. 'వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు.

మంథెనవాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు. ఇతని శతజయంతి ఉత్సవాలు 18-8-2011 నుండి 18-8-2012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పదిసార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తి తోనే కడదాకా జీవించి,1984, అక్టోబరు 30నఈ లోకాన్ని వీడి వెళ్ళారు.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

## అలుపెరుగని పోరాట యోధుడు గౌతు లచ్చన్న - ఆగస్టు 16...సర్దార్ గౌతు లచ్చన్న జయంతి



భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది. గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 - ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు. తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాధం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహమూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929-30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామమంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు. ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు. 1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు. 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

**రామకిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# రైతు వెన్నంటి.. సేవల్లో మేటి

జగిత్యాల : పంటలపై పరిశోధన.. వంగడాల రూపకల్పన.. క్షేత్ర స్థాయి అవగాహన.. ఇలా బహుముఖ సేవలతో జగిత్యాల మండలం పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) నాలుగు దశాబ్దాలుగా అన్నదాత సేవలో తరిస్తోంది. 1986 జులై 9న నాటి సీఎం ఎన్టీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన పరిశోధన స్థానం నేడు 40వ వసంతంలోకి అడుగు పెడుతోంది.

పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిధిలో మొదట ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలుండేవి. అనంతరం వరంగల్‌లో ఆర్ఏఆర్ఎస్‌ను ఏర్పాటు చేసి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మెదక్ జిల్లాలను చేర్చారు. ప్రస్తుతం పొలాస పరిధిలో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని మొత్తం 10 జిల్లాల్లో పరిశోధన, విస్తరణ కార్యకలాపాలు సాగుతున్నాయి. 15 జిల్లాలకు ఇక్కడి నుంచే ప్రతి వారం రెండు సార్లు వాతావరణ బులెటిన్లు అందిస్తున్నారు. వ్యవసాయ అధికారులకు నిరంతర శిక్షణ, రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**భావి శాస్త్రవేత్తలను తీర్చిదిద్దుతూ..**

పొలాస పరిధిలో కరీంనగర్, కూనారం, ముథోల్, ఆదిలాబాద్, రుద్రూరులలో పరిశోధన స్థానాలు, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, జమ్మికుంట, రుద్రూరు, బెల్లంపల్లిల్లో ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలు, పొలాస, జమ్మికుంట, రుద్రూరుల్లో వ్యవసాయ



పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. పొలాసలో డిగ్రీ, పీజీ కళాశాలలు అనుబంధంగా కొనసాగుతున్నాయి. వరి, నువ్వుల్లో కొత్త వంగడాల రూపకల్పన, ఇతర పంటల్లో యాజమాన్యం, చీడపీడల నివారణ, నీటిపారుదల, ఎరువుల వాడకంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు.

**సృష్టించిన వంగడాలు**

వరిలో పొలాసప్రభ, జగిత్యాల సన్నాలు, జగిత్యాల సాంబ, మానేరు సోన, జగిత్యాల మశూరి, కరీంనగర్ సాంబ, ప్రాణహిత, అంజన, ప్రత్యుమ్న, బతుకమ్మ, జగిత్యాల రైస్-1, జగిత్యాల వరి-2, జగిత్యాల వరి-3 రకాలను విడుదల చేశారు. పసుపులో సుగుణ, సుదర్శన, వేరుశనగలో జేసీసీ88, జగిత్యాల పల్లి-1, నువ్వుల్లో స్వేతా తిల్, రాజేశ్వరి, హిమ, చందన, జగిత్యాల తిల్-1, జగిత్యాల తిల్-2 రకాలను ఆవిష్కరించారు. రైతులు వరిలో సంకర రకాలపై మక్కువ చూపడంతో జేజీహెచ్131, జేజీహెచ్141 రకాలను శాస్త్రవేత్తలు రూపొందించారు. వరి, నువ్వుల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన మరిన్ని కొత్త రకాలు రైతుల క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల్లో ఉన్నాయి.

**దృష్టి సారిస్తే మేలు**

భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రకటించిన మేరకు పొలాసలో ఆవాల పరిశోధన కేంద్రం, న్యూక్లియస్ విత్తన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. పరిశోధన స్థానం ఆవరణలో నిర్మించిన ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించాలి. మొత్తం 34 మంది శాస్త్రవేత్తలకు గాను 13 మంది మాత్రమే పని చేస్తుండగా శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి.హరితగృహం, ఆధునిక ల్యాబ్‌ల ద్వారా వంగడాల రూపకల్పన సమయాన్ని 12-13 సంవత్సరాల నుంచి ఆరేడు సంవత్సరాలకు కుదించాలి.ఆధునిక యంత్రాల తయారీ, సంకర రకం విత్తనాల రూపకల్పన, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతుల క్షేత్రాలకు చేరేలా విస్తరణ కార్యక్రమాలను అమలు చేస్తే పరిశోధన స్థానం సేవలు మరింత విస్తృతమవుతాయి.

# కబ్జా చేసినా కన్నెత్తి చూడరు

గంగాధర : ఉమ్మడి జిల్లాలో పలువురు వరదకాలువ స్థలాలను సైతం ఆక్రమించి సాగు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కాలువలు కుంచించుకుపోతున్నాయి. కొందరి నిర్వాకంతో చాలామంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని వందలాది గ్రామాల మీదుగా 137 కి.మీ మేర వరదకాలువ విస్తరించి ఉంది. ఇరువైపులా దారులకు వంద మీటర్ల చొప్పున స్థలాన్ని వదిలిపెట్టగా.. దానిపక్కనే గత ప్రభుత్వం ఒక టీఎంసీ నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. అయితే చాలా గ్రామాల్లో వరదకాలువకు సంబంధించి మట్టి, రాళ్లను అక్రమార్కులు తవ్వుకొని తరలిస్తుండగా.. ఖాళీగా ఏర్పడిన స్థలాలను సమీపంలోని కొందరు తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అంతకుముందే నష్టపరిహారం పొందినవారు సర్కారు భూములను కబ్జా చేశారు.

**పైపులైన్ల స్థలాన్ని సైతం..**

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, రాజన్న



సిరిసిల్ల జిల్లాల్లో ఆయా గ్రామాల చెరువులు నింపేందుకు 60 కి.మీ పొడవునా 40 మీటర్ల వెడల్పుతో రెండు పైపులైన్లు వేశారు. ఎల్లంపల్లి నుంచి ధర్మారం మండలం నందిమేడారం చెరువులోకి 11 కి.మీ, అక్కడి నుంచి గంగాధర, నారాయణపూర్ జలాశయాల్లోకి 25.50 కి.మీ, ఇక్కడి నుంచి 11 కి.మీ దూరంలో ఉన్న కొడిమ్యాలకు రెండు వరుసల పైపులైన్లు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ఆయా గ్రామాల్లో పైపులైన్ల పైభాగంలో మట్టి తవ్వి పంటలు సాగు చేస్తున్నారు. కొందరైతే అక్రమ నిర్మాణాలు చేశారు.

**అదనంగా రైతు భరోసా**

కొన్ని చోట్లయితే రెవెన్యూ రికార్డుల్లో వివరాలు సరిచేయక రైతు భరోసా సాయం కూడా పొందుతున్నారు. కాలువ స్థలాన్ని ఆక్రమించి వరినార్లు పోశారు. కాలువల దారులను దున్ని పంటలు వేస్తుండడంతో అటువైపు అధికారుల వాహనాలే కాకుండా రైతులు తమ ట్రాక్టర్లను తోలుకుపోవడం ఇబ్బందిగా మారింది. దారులు లేక రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రజావాణిలో అధికారులకు కొందరు రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

# బతుకుల్లోకి.. ముతక మెతుకులు



సూర్యాపేట : వాతావరణ మార్పులు, అనారోగ్య సమస్యలతో జనం ఆహారపు అలవాట్లలో మార్పును కోరుకుంటున్నారు. శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు అందించే తెల్ల బియ్యానికి బదులు బ్రౌన్ రైస్‌పై మక్కువ పెంచుకుంటున్నారు. పట్టణ ప్రజలకు పోటీగా పల్లెవాసులు కూడా పూర్వకాలపు పద్ధతిలో దంపుడు బియ్యం తినడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా క్రమంగా వారి సంఖ్య పెరుగుతోంది. అందులో ఆరోగ్యానికి బలాన్ని చేకూర్చే పోషకాలుంటాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

**ఏటా 60 టన్నుల బియ్యం:** ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు ఏటా సుమారు 60 టన్నుల బ్రౌన్ రైస్ మరాడిస్తారు. ఇందులో మిర్యాలగూడలోని మిల్లర్లు అత్యధికంగా 50 టన్నులు, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని మిల్లర్లు మిగిలిన 10 టన్నులు మిల్లాడిస్తూ ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. స్వయంగా మిల్లుల వద్దకు వెళ్లి వడ్లను మరాడించుకుంటున్న రైతులున్నారు. సూపర్‌మార్కెట్లో కొనుగోలు చేస్తున్న వారు కూడా ఉంటున్నారు.ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారు వాటి స్థాయిలు అదుపులో ఉండేలా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అనారోగ్యానికి గురికావొద్దని భావించి దంపుడు బియ్యం తినడానికి ఆసక్తి చూపుతున్నారు. వారి ఆహార పట్టికలో ఈ ఆహారాన్ని చేర్చుకున్నారు.

**పోషకాలను దూరం చేసుకుంటున్నాం**

ప్రశాంతి, పోషకాహార నిపుణులు

డబుల్ పాలిష్ బియ్యం మెరుస్తుంటాయి. కానీ వాటితో వండిన అన్నం తినడం వల్ల పోషకాలు దూరమవుతున్నాయని ప్రజలు గ్రహించడం లేదు. దంపుడు బియ్యం తినడం వల్ల శరీరానికి అవసరమైన బీ కాంప్లెక్స్ విటమిన్లు అందుతాయి. బరువు పెరగుదల ఉండదు. అరుగుదల నెమ్మదిగా ఉండటంతో మధుమేహం అదుపులో ఉంటుంది. సేంద్రియ పద్ధతిలో పండించిన ధాన్యాన్ని బ్రౌన్ రైస్‌గా తీసుకుంటే బీ కాంప్లెక్స్ విటమిన్లతో పాటు సూక్ష్మపోషకాలు కూడా అందుతాయి.

**కరోనా సమయం నుంచి తింటున్నారు**

బండారు దయాకర్, రైస్ మిల్ యజమాని,తుంగతుర్తి

కరోనా కాలం నుంచి ఇంటిల్లిపాది బ్రౌన్ రైస్ తినడం ప్రారంభించారు. బియ్యం పట్టించినప్పుడల్లా చాలా తక్కువగా పాలిష్ చేసి పక్కన పెట్టుకుంటున్నారు. పాలిష్ ఎక్కువగా పెట్టడం వల్ల అందులోని పోషకాలు బయటకు వెళ్తాయనే అవగాహన పెరిగింది. ఏటా 30 మంది రైతులు బ్రౌన్ రైస్ పట్టించుకుంటున్నారు.

# పాలేరుకు పోటెత్తిన వరద



కూసుమంచి : పరీవాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షంతో పాలేరు ఏరు పొంగి ప్రవహిస్తోంది. 22.15 అడుగులున్న నీటిమట్టం 23.15 అడుగులకు చేరడంతో జలాశయం ఆటోమేటిక్ ఫాలింగ్ గేట్ల ద్వారా నీరు దిగువకు ప్రవహిస్తోంది. పాలేరు ఏరు, కోమటికుంట వాగు, రాతిబంధం వాగు ద్వారా జలాశయానికి భారీగా వరద చేరుతోంది. రాత్రి 8 గంటలకు 24.25 అడుగులకు నీటిమట్టం చేరింది. అదే సమయంలో వరద చేరిక 18,503 క్యూసెక్కులు ఉంది. గేట్లు, అలుగుల ద్వారా దిగువకు 13,600 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. **మరింత పెరిగే అవకాశం: ఎస్ఈ**

జలాశయానికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు అంచనా వేశారు. వరంగల్, జనగామ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో బుధవారం తెల్లవారుజాము వరకు 25వేల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందన్నారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా 3,500 క్యూసెక్కుల నీరు పాలేరు జలాశయానికి చేరుతుండగా, నీటి విడుదల సామర్థ్యాన్ని తగ్గించేందుకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ రవికుమార్, ఈఈ అనన్య, డీఈఈలు మధు, రత్నకుమారి, ఏవో ఆర్.వాణి తదితరులు వరద పరిస్థితిని పరిశీలించారు. ఖమ్మం గ్రామీణం ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్ జలాశయం ఫాలింగ్ గేట్ల వద్ద వరద సరళిని గమనించారు.

**700 ఎకరాల్లో ముంపు: డీఏఓ** భారీ వర్షం, వరదల కారణంగా కూసుమంచి మండలంలో 700 ఎకరాల్లో వరి, పత్తి పంటలు ముంపునకు గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశామని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) పుల్లయ్య తెలిపారు. కూసుమంచి, నేలపట్ల, తురకగూడెం, నర్సింహులగూడెం, జీళ్లచెర్వు గ్రామాల్లో నీట మునిగిన, కోతకు గురైన పొలాలు, పత్తి క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఏఓ ఆర్.వాణి, ఏఈఓ రవీందర్ పాల్గొన్నారు.

**కూసుమంచిలో కుండపోత**

జిల్లాలోనే అత్యధిక వర్షపాతం 10.3 సెం.మీ.గా నమోదు

కూసుమంచి మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం 40 నిమిషాలపాటు ఏకధాటిగా పడింది. ఉరుములు, మెరుపులతో జనం భయాందోళనకు గురయ్యారు. తెల్లారేసరికి వాగులు, పొంగి ప్రవహించాయి. జిల్లాలో అత్యధికంగా కూసుమంచి మండలంలో 10.3 సెం.మీ. వర్షం కురిసింది. కూసుమంచిలోని అతిపెద్ద చెరువు గంగాదేవితోపాటు అన్ని గ్రామాల్లో చెరువులు అలుగు పారాయి. జీళ్లచెర్వులోని చెరువు వీధి, ఎస్సీకాలనీ, కూసుమంచి బీసీ కాలనీలో వరద పోటెత్తి జనజీవనానికి ఇబ్బందిగా మారింది. కూసుమంచి, తురకగూడెం, నర్సింహులగూడెం, కిష్టాపురం ప్రాంతాల్లో అనేక పొలాలు చెరువులను తలపించాయి. పత్తి క్షేత్రాలు నీటమునిగాయి. కొద్ది రోజుల క్రితమే నాటుపెట్టిన వందలాది ఎకరాల్లో వరి మునిపోయింది. కొన్నిచోట్ల ఇసుక మేట వేసింది. గంగాదేవి చెరువు అలుగు పారడంతో కూసుమంచి నుంచి కిష్టాపురం, పోచారం, బీరోలు ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కోమటికుంట వాగుప్రవాహంతో నర్సింహులగూడెం నుంచి కొత్తూరు వెళ్లే మార్గంలో రాకపోకలు స్తంభించాయి. ఫాలింగ్ గేట్ల ద్వారా ఏట్లోకి భారీగా వరద నీరు ప్రహించింది.

# సౌర సొబగులు.. స్వీయ అడుగులు

కొత్తగూడెం: ఎన్నటికీ తరగని సౌరశక్తి వనరులను సద్వినియోగం చేసుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలను సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. నానాటికీ పెరుగుతున్న విద్యుత్తు అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి సవాల్‌గా మారుతోంది. ఛార్జీల భారం తడిసి మోపెడవుతోంది. డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ భారాన్ని తగ్గించుకోవటానికి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవాలని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌరఫలకల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

**20 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్తు** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు క్యాటగిరీ-2 కింద విద్యుత్తు అందుతోంది. యూనిట్‌కు రూ.6 నుంచి రూ.8వరకు డిస్కంలకు చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక కార్యాలయానికి 5కిలోవాట్ల సౌర ఫలకలు అమర్చితే.. సుమారు రూ.2.50 లక్షల ఖర్చవుతుంది. నెలకొల్పిన సౌర ప్లాంట్ నుంచి ఏడాదికి 7వేల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఏటా రూ.56వేల ఆదాయం (క్యాటగిరీ-2 కింద యూనిట్‌కు రూ.8 అనుకుంటే) సమకూరుతుంది. ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి సొమ్ము 4-5ఏళ్లలో తీరుతుంది. సౌరఫలకల జీవితకాలం 25ఏళ్లు అనుకుంటే.. 20ఏళ్లపాటు ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా విద్యుత్తు అందించవచ్చు. డిస్కంలకు బిల్లులు చెల్లించాల్సిన



భారం ఉండదు.

**ఇదీ ప్రయోజనం..**

ఉభయ జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు 9,307 విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. కలెక్టరేట్ నుంచి గ్రామపంచాయతీల వరకు విద్యుత్తు వినియోగం పెరుగుతోంది. కరెంటు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. సౌర విద్యుత్తు విధానం అమలైతే ప్రభుత్వకార్యాలయాలకు బిల్లుల మోత.. డిస్కంలకు బకాయిల భారం తగ్గనుంది. ఉభయ జిల్లాల్లో 44 మండలాల్లో 1,042 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులను కలెక్టర్లు ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే చేపట్టనున్నాం. సోలార్ విద్యుదుత్పత్తికి అనువైన ప్రాంతాలను గుర్తించి డిస్కం ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం.అజయ్‌కుమార్, మేనేజర్ టీజీ రెడ్కో

# సైకిల్ సవారీ.. ప్రకృతి దారి

ఖమ్మం : మానవ తప్పిదాలతో ప్రకృతికి తీవ్ర ముప్పు ఏర్పడింది. విచక్షణారహితంగా చెట్లను నరకటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. వేసవిలో వర్షాలు, వర్షాకాలంలో ఎండలు, శీతాకాలంలో చలి లేకపోవటం ఇప్పుడు ఆశ్చర్యం కలిగించే అంశలయ్యాయి. ఈ నేపథ్యంలో పలువురు వైద్యులు, అటవీ శాఖ అధికారులు, పోలీసులు, ఔత్సాహిక అధికారులు కలిసి ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'ఖమ్మం సైక్లింగ్ క్లబ్'ను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొలికొండ మహేంద్రకుమార్, ఉపాధ్యక్షుడిగా కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ అధికారి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. ఏడాది క్రితం దీన్ని ప్రారంభించనప్పటికీ ఈ నెల 6న అధికారికంగా రిజిస్టర్ చేయించారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ చేతుల మీదుగా లోగో ఆవిష్కరింపచేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఈ క్లబ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో మరింత విస్తరించే ప్రయత్నాలు చేస్తున్నారు.

**చేపడుతున్న కార్యక్రమాలు**

పర్యావరణ పరిరక్షణ, సామాజిక అడవుల ప్రాధాన్యంపై అవగాహన. పొలాల్లో వరి కయ్యలను కాల్చకుండా రైతులకు వివరించటం.

పెట్రోలు, డీజిల్ అధిక వినియోగంతో వెల్లడయ్యే కర్బన ఉద్గారాల ప్రభావం తెలియజేయటం.ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచేందుకు



విద్యార్థులు, యువతను చైతన్యపరచటం.జాతీయ రహదారుల వెంట తప్పని సరిగా మొక్కలు నాటించటం.నిత్యం కనిష్ఠంగా 30 కి.మీ. క్లబ్‌లో మొత్తం 15మంది సభ్యులున్నారు. వీరు నిత్యం సైకిళ్లపై వివిధ ప్రాంతాల్లో సవారీ చేస్తుంటారు. రోజుకు కనీసం 30 నుంచి 100 కి.మీ. దూరం ప్రయాణిస్తారు. కొంతమంది ఒక్కోసారి ఏకబిగిన 300 నుంచి 1200 కి.మీ. దూరం ప్రయాణించిన వారు ఉండటం విశేషం. ఇటీవల ఖమ్మం నుంచి పదిమంది సభ్యులు సైకిల్‌పై హైదరాబాద్ వరకు 200 కి.మీ. ప్రయాణించి హైదరాబాద్ అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.


సభ్యులు గోపి, రామారావు, నాగరాజు.. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, రంపచోడవరం నుంచి లంబసింగి వరకు చేరుకున్నారు. తిరిగి అక్కడి నుంచి నర్సీపట్నం, రాజమండ్రి, విజయవాడ, సూర్యాపేట మీదుగా 1200 కి.మీ. ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నారు.సాధారణ రోజుల్లో సభ్యులు ఉదయం, సాయత్రం వేళల్లో తప్పనిసరిగా కనీసం 30 నుంచి 100 కి.మీ. వరకు రైడ్ చేస్తుంటారు. ఉదాహరణకు కోటేశ్వరరావు అనే ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ వారంలో కొన్నిరోజులు ఖమ్మం నుంచి ఉదయం 6గంటలకు సైకిల్‌పై బయలుదేరి కొత్తగూడేనికి 8.30 గంటలకు చేరుకుంటారు. గంటసేపు విశ్రాంతి అనంతరం కార్యాలయానికి వెళతారు. తిరుగు ప్రయాణం కూడా సైకిల్‌పై ఉంటుంది.సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం అలవడుతుంది. మధుమేహం, బీపీ, ఊబకాయం, మోకాళ్ల నొప్పులు రావు. పెట్రోలు, డీజిలు వాడక కాలుష్యం తగ్గిపోతుంది. మహేంద్రకుమార్, వైద్యుడు

# నిరంతర ప్రక్రియ.. నిరీక్షణకు తెర

కొత్తగూడెం: నిరుపేదల ఏళ్ల నిరీక్షణకు తెరపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అర్హులకు రేషన్‌కార్డులు మంజూరవుతున్నాయి. ఇప్పటికే ఉభయ జిల్లాల్లో 64 వేలకు పైగా కొత్త రేషన్‌కార్డులకు పౌరసరఫరాల శాఖ ఆమోదం తెలిపింది. 'ప్రజాపాలన'తో పాటు ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలిస్తున్న అధికారులు అర్హులను గుర్తిస్తున్నారు. అర్హత కలిగిన వారికి రేషన్‌కార్డులు అందిస్తామని చెబుతున్నారు.

**29,649 మంజూరు పత్రాలు పంపిణీ**

ఖమ్మం జిల్లాలో 19,690, భద్రాద్రి జిల్లాల్లో 9,959 రేషన్‌కార్డులకు సంబంధించి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో కొంతమంది అర్హుల పేర్లు జూన్‌లోనే కీ రిజిస్టర్‌లో నమోదవటంతో మూడు నెలల రేషన్ బియ్యం సైతం పొందారు. జూన్ తర్వాత కీ రిజిస్టర్‌లో చేరిన వారికి సెప్టెంబర్ నుంచి సన్నబియ్యం అందుతుందని అధికారులు స్పష్టం చేశారు. మంజూరు పత్రాలు రానివారు మీసేవ, ఆన్‌లైన్ సెంటర్లను సంప్రదించవచ్చునని సూచిస్తున్నారు.



**అందనున్న సంక్షేమ పథకాలు**

ఏళ్ల తరబడి నూతన రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ నిలిచిపోవటంతో అనేక మంది అర్హులు రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ సహాయం, ఇతర సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఆరోగ్యశ్రీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, గ్యాస్‌బండ రాయితీ తదితరాలకు అర్హతలు ఉన్నా.. రేషన్‌కార్డులు చేతికి అందకపోవటంతో ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ సర్కారు కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు, ఉన్నవాటిలో సభ్యులను చేర్చే కార్యక్రమం చేపట్టడంతో అర్హుల ఆశలకు జీవం పోసినట్లయ్యింది. ఈ ఒక్క ఏడాదిలోనే ఉభయ జిల్లాల్లో 64వేల కొత్త కార్డుల మంజూరుకు ఆమోదం లభించటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నాం. జూన్ తర్వాత కొత్తగా కార్డులు పొందిన వారికి సెప్టెంబరు నుంచి సన్నబియ్యం అందుతుంది. రుక్మిణీదేవి, డీఎస్ఓ, భద్రాద్రి కొత్తగూడెం

చురకలు



## పట్టణ హరితం.. పట్టని ఫలితం

కోరుట్ల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో లక్ష్యాలు ఘనంగా ఉంటున్నా అమలు అంతంతమాత్రంగానే ఉంటోంది. పట్టణాల్లో పచ్చదనం పెంపునకు రూ.లక్షలు వెచ్చించి నర్సరీలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. ప్రధాన రహదారులు, కాలనీ రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లో, పాఠశాలలు, కార్యాలయాల్లో స్థలాలు గుర్తిస్తున్నారు. లక్ష్యం పూర్తి చేసినట్లు లెక్కల్లో చూపుతున్నా క్షేత్ర స్థాయిలో మొక్కలు కనిపించడం లేదు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అయిదు పురపాలికల పరిధిలో 7.73 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈసారైనా జాగ్రత్తలు తీసుకుంటేనే పట్టణాల్లో పచ్చదనం వెల్లివిరియనుంది.

**నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ**

బల్దియా అధికారులు అయిదేళ్లుగా పట్టణ ప్రగతి నర్సరీలు ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. ప్రభుత్వ, ఖాళీ స్థలాలు, ఇళ్లలో నాటేందుకు పూలు, పండ్ల మొక్కల అవసరంపై ముందస్తుగా అంచనాలు వేసి నర్సరీల్లో నాటుతున్నారు. ఇందుకోసం పట్టణ ప్రగతి నిధులతో శాశ్వత పట్టణ నర్సరీలు ఏర్పాటు చేశారు. ఏటా



నవంబరులోనే మొక్కలు నాటి నీడ వసతి కల్పించారు. మొక్కల పెంపకానికి నాణ్యమైన మట్టిని, విత్తనాలు తెప్పించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. మొక్కలు త్వరగా పెరిగేందుకు సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూలు, పండ్లు, నీడనిచ్చేవి 15-20 రకాల మొక్కలు పెంచుతూ ఒక్కోటి మీటరు పొడవు ఎదిగేలా సంరక్షిస్తున్నారు.

**సామాజిక స్పృహ కరవు** పట్టణాల్లో దాదాపు అంతర్గత రహదారులన్నింటిపైనా సిమెంటు, తారు నిర్మాణాలే ఉన్నాయి. సీసీ రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాల్సి ఉండగా నామమాత్రంగా నాటి సంరక్షణ మరిచిపోవడంతో కొన్ని వారాలకే కనిపించకుండా పోతున్నాయి. సీసీ రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు పురపాలికల ఆధ్వర్యంలో కొంతమేర మట్టి దారిని వదిలిపెడుతుండగా ఇళ్ల యజమానులు సిమెంటుతో పూర్తిగా చదును చేసుకుంటున్నారు. ఇళ్ల ముందు మొక్కలు నాటితే ఆకులు రాలతాయని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతింటున్నాయని స్థానికులు తొలగిస్తున్నారు. రోడ్ల పక్కన విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటి ఏపుగా పెరిగిన తర్వాత కొట్టివేస్తున్నారు. గృహావరణల్లో నాటడానికి ఇంటింటికీ 3-4 మొక్కలు పంపిణీ చేస్తున్నా సంరక్షణపై ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. సంరక్షణ కరవైంది.

## నిధులు ఇచ్చినా ప్రగతి అంతంతే!

సిరిసిల్ల : "ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో 2021-22లో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు రూ.కోటి మంజూరు చేశారు. దీనిలో కొంతమేరకు ఉపాధి హామీలో చేశారు. రన్నింగ్ ట్రాక్, గ్యాలరీ తదితర పనులు అసంపూర్తి దశలో ఉన్నాయి."

"చొప్పదండి, సిరిసిల్ల నియోజకవర్గాలకు 2023-24లో ఎంపీ లాడ్స్ కింద రూ.1.94 కోట్లతో 49 పనులు మంజూరయ్యాయి. వీటిలో మూడు మాత్రమే పూర్తయ్యాయి. ఆరు వివిధ దశలో ఉన్నాయి. 40 పనులు ప్రారంభం కాలేదు. పూర్తయినవాటికి గుత్తేదారులకు రూ.27.24 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి."

జిల్లాలో పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీ ల్యాడ్స్) పనుల ప్రగతి అంతంత మాత్రంగా ఉంది. ఏటా నిధుల కేటాయింపు జరుగుతున్నా.. గుత్తేదారులు వాటిని పూర్తి చేయడంలోనే జాప్యం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇటీవల మరిమడ్ల ఏకలవ్య రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఆర్టికల్ 275లో భాగంగా 'మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్' (మోటా) నుంచి రూ.5.14 కోట్లతో చేపట్టే అధ్యాపకుల వసతిగృహాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. వసతి గృహ సమస్యలను అధ్యాపకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటికి తన ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో వాటిని సద్వినియోగం చేసుకోవడంలో



వెనుకబాటు తప్పడం లేదు.

**అభివృద్ధిపై ఆశలు**

ఎంపీ ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తారు. వీటిలో జిల్లాకు జరిగే కేటాయింపుల్లో నిరాశే ఎదురవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లాకు మంజూరైన నిధుల్లో ఇంకా స్పష్టత రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో భాజపా కార్యకర్తలు ఎంపీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపైనే ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రతిపక్షంలో ఉండటంతో ఈ సమస్య ఉంది. భాజపాకు బలమైన క్యాడర్ ఉండటంతో అభివృద్ధి మార్కును చూపించుకోవాలని ఎంపీ నిధులకు డిమాండ్ ఏర్పడుతోంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అంతర్గత రహదారుల నిర్మాణాలకు ఈ నిధులను ఎక్కువగా వెచ్చించే అవకాశం ఉంది. పనులు పూర్తయి బిల్లులు సమర్పించిన వాటికి వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

**అదనపు నిధుల కేటాయింపు**

మంజూరైన పనులు కలెక్టర్ పర్యవేక్షణలో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తున్నాం. ఎంపీ ల్యాడ్స్‌తోపాటు, సీఎస్ఆర్, ఉపాధి హామీలో అదనపు నిధులు కేటాయించేలా ప్రణాళికలు చేస్తున్నాం. జిల్లాలోని ప్రతి గ్రామానికి ఏటా రూ.5 లక్షలతో అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. బండి సంజయ్, ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి

# పంచాయతీ.. కనిపించని ప్రగతి




పెద్దపల్లి : జిల్లాలో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాలకుల నిర్లక్ష్యం, నిధుల లేమి ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అద్దె భవనాలు, ప్రభుత్వ బడులు, చెట్ల నీడలో పల్లెపాలన సాగే పరిస్థితి నెలకొంది. ఉపాధిహామీలో పంచాయతీల పక్కా భవన నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ ఫలితం లేదు. దీంతో మూడేళ్లుగా ప్రగతి ఎక్కడికక్కడే నిలిచిపోయింది. సకాలంలో పనులు మొదలుపెట్టకపోవడంతో పనులన్నీ రద్దవుతున్నాయి. దీంతో మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇవన్నీ వచ్చే మార్చినాటికి పూర్తయితేనే సొంత గూడు కల నెరవేరనుంది.

**కారణాలు ఇవే..**

ఉపాధిహామీలో ప్రతి పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. కొన్ని చోట్ల భవనాలకు స్థలం ఉన్నప్పటికీ అనువైన ప్రాంతం కాకపోవడం. మరికొన్ని చోట్ల గ్రామకంఠం, సర్కారు ఆధీనంలోని స్థలమైనప్పటికీ కబ్జాకు గురికావడం. బిల్లుల చెల్లింపులో జాప్యం, గుత్తేదారులు ముందుకు రావడం లేదు.

ప్రగతి అధోగతిజిల్లాలో మూడేళ్ల క్రితం 98 పంచాయతీలకు నిధులు రూ.19.60 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 74 చోట్ల పనులు ప్రారంభించగా 39 పూర్తయ్యాయి. 35 వివిధ దశలో ప్రగతి ఉండగా పలు కారణాలతో మరో 24 పనులు ప్రారంభించలేదు. గతేడాది పాత వాటిని కలుపుకుని మరో 11 కొత్తగా ఎంపిక చేసి మొత్తం 35 భవనాలకు ప్రతిపాదనలు రూపొందించగా నిధులు కేటాయించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు పల్లెల్లో పాలకవర్గాలు లేకపోవడంతో ప్రగతి పనులను పట్టించుకునేవారు కరవయ్యారు. సర్పంచులు ఉంటే పనులు వేగిరం అయ్యేవి. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పాలన కొనసాగడంతో ప్రగతి ముందుకెళ్లడం లేదు. సొంత భవనాలు లేకపోవడంతో పంచాయతీ రికార్డులకు భద్రత కరవైంది.

**వేగం పెంచుతున్నాం**

పంచాయతీ భవనాల ప్రగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. పనులు మొదలు పెట్టని వాటి కారణాలు తెలుసుకుంటున్నాం. భవనాల నిర్మాణంలో వేగం పెంచుతున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు చేస్తున్నాం. గిరీష్‌బాబు, పంచాయతీరాజ్ ఈఈ

# సారమెరిగి సాగు.. అన్నదాత బాగు



జగిత్యాల : నేలలో ఉండే సారంపై అవగాహన లేకపోవడంతో పంటల్లో రసాయన ఎరువుల వాడకం విచ్చలవిడిగా పెరిగింది. నేలలో ఉండే పోషకాలు తెలుసుకుంటే ఇలాంటి పరిస్థితులను అధిగమించే అవకాశం ఉంది.

**నత్రజని అధిక వాడకంతో కాలుష్యం**

మొక్క ఎదగడానికి 17 రకాల పోషకాలు అవసరం. భూసార పరీక్షలతోనే ఏవి ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తుంది. పీహెచ్ స్థాయి(ఆమ్ల/క్షార గుణాలు), ఎలక్ట్రో కండక్టివిటీ(ఈసీ) లవణాల మోతాదు, అన్ని రకాల పోషకాల లభ్యత తెలుస్తుంది. ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వాడితే మొక్కలు ఏపుగా పెరుగుతాయి. చీడపీడలు తగ్గి దిగుబడులు పెరుగుతాయి. రైతులు నత్రజని, భాస్వరాలను సిఫారసు కన్నా ఎక్కువగా వాడుతున్నారు. మన నేలల్లో భాస్వరం అధికంగా ఉండగా నత్రజనిని అధికంగా వాడుతుండటంతో గాలి, నేల, నీరు, పంట ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి.

**పకడ్బందీ చర్యలతోనే ఫలితం**

భూసార పరీక్ష ఫలితాలతో కూడిన కార్డు చూపిస్తేనే ఎరువులకు విక్రయించాలన్న కేంద్ర నిర్ణయం పకడ్బందీగా అమలు కావాలంటే ప్రతి రైతు భూమిలోనూ పరీక్షలు జరపాలి.

రైతువేదికలకు అందజేసిన భూసార కిట్లు వినియోగించేలా నిధులు మంజూరు చేయాలి. పరిశోధనా స్థానాలు, వ్యవసాయ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నందున రైతులు వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవాలి. నమూనాలు సేకరించిన తర్వాత చాలా రోజులకు ఫలితాలు వస్తుండటంతో భూసార పరీక్షలపై రైతులకు ఆసక్తి ఉండటం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం కరీంనగర్‌లో మాత్రమే మట్టి నమూనాలు పరీక్షిస్తున్నారు. జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల సహా ప్రధాన పట్టణాల్లో అందుబాటులోకి తేవాలి.

**పరీక్షలు చేస్తున్నారా?**

ఉమ్మడి జిల్లాలో ఏటా 9-17 వేల వరకు మట్టి నమూనాలు పరీక్షిస్తున్నారు. 16.50 లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలు పండిస్తుండగా అన్ని సంవత్సరాలకు కలిపి ఇప్పటివరకు కేవలం 49 శాతం భూములకే పరీక్షలు జరిపారు. ప్రతి 2.5 ఎకరాలకు ఒక నమూనా సేకరించాలి. ప్రతి మూడేళ్లకు ఒకసారి పరీక్ష నిర్వహించాల్సి ఉండగా లక్షల ఎకరాల్లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా చేయలేదు. దీంతో రైతులు సారం తెలియకుండానే ఎరువులు వాడుతున్నారు.

**పెట్టుబడి వ్యయం తగ్గుతుంది**

భూసార పరీక్షలతో నేలలోని పోషకాల శాతాన్ని తెలుసుకుంటే అవసరం మేరకే ఎరువులు వాడే వీలుంటుంది. తద్వారా నేల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. సమతుల ఎరువుల వాడకంతో చీడపీడలు అదుపులో ఉంటాయి. దిగుబడులు స్థిరంగా రావడంతో పాటు కాలుష్యం తగ్గుతుంది.

డాక్టర్ ఎస్.హరీశ్‌కుమార్‌శర్మ, సహ పరిశోధన సంచాలకులు

# ఏడు శాతం లోటు వర్షపాతం



ఎల్లారెడ్డిపేట: మెట్ట ప్రాంతమైన జిల్లాలో వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై కొద్దిపాటి జల్లులు తప్ప భారీగా వానలు కురిసిన దాఖలాలు ఈ ఏడాదిలో కనిపించ లేదు. వ్యవసాయానికి ఆయువుపట్టుగా ఉండే చెరువులు, కుంటల్లో నీటిమట్టం పెరగకపోగా భూగర్భజల మట్టాల్లో వృద్ధి కూడా అంతంతమాత్రంగానే ఉంది. 600లకుపైగా ఉన్న చెరువుల్లో నాలుగైదుకు మించి పూర్తిస్థాయి జలకళను సంతరించుకోలేదు. ఆయా ప్రాంతాల్లో వర్షాలను నమ్ముకొని సాగుచేసిన వరికి సరిపడా సాగునీరు అందడం లేదు. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి తదితర మండలాల్లో ఇప్పటికే బోరుబావుల నుంచి జలధార తగ్గిపోయింది. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు రాబోయే యాసంగి సీజన్‌పైనా తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

**తప్పని ఆందోళన**

జిల్లాలో ఈ నెల 12 వరకు 434.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 404.4 మిల్లీమీటర్లకు పరిమితమైంది. ఈ లెక్కన 7 శాతం లోటు వర్షాలు కురిశాయి. గతేడాది ఇదే తేదీనాటికి 509.6 మిల్లీమీటర్లు కురిసింది. ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాల్లో సాధారణ కంటే ఎక్కువ వర్షాలు కురవగా రుద్రంగి, బోయినపల్లి, వేములవాడ మండలాల్లో తక్కువగా పడ్డాయి. మిగతా 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

భూగర్భజల మట్టాల వృద్ధిలోనూ ఆశించిన పురోగతి కనిపించడం లేదు. జులైలో జిల్లా సగటున 9.35 మీటర్లలో భూగర్భజలాలు లభిస్తుండగా జూన్‌తో పోల్చితే జులై నాటికి సగటున కేవలం 1.18 మీటర్లు పెరిగాయి. మేతో సరిచూస్తే 1.66 మీటర్లు పెరగగా గతేడాది జులైతో చూస్తే 0.94 మీటర్లు పెరిగినట్లు తెలుస్తోంది.

18.50 మీటర్ల లోతుతో వేములవాడ అర్బన్ మండలంలో భూగర్భజల మట్టాలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు నమోదు కాకుంటే పంటలకు సాగునీటి కొరత ఏర్పడే అవకాశాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

## గనుల మూత.. విస్తరణపై ఆశ

గోదావరిఖని: సింగరేణిలో ఏడు గనులు వచ్చే ఐదేళ్లలో మూతపడనున్నాయి. వీటి ద్వారా 14 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లోటు ఏర్పడనుంది. 6,511 మంది ఉద్యోగులను ఇతర గనుల్లో సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. 2030-31 నాటికి గనులు మూతపడనుండటంతో సింగరేణి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. కొత్త గనులు దక్కించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో పాల్గొనాల్సి ఉండగా.. ప్రస్తుతం సింగరేణి ఆధీనంలో ఉన్న ఏడు గనులను విస్తరించే దిశగా ప్రణాళికలు రూపొందించింది. భూగర్భ బొగ్గుగనుల ద్వారా ఇప్పటివరకు ఉత్పత్తి చేపట్టగా.. వాటిని ఉపరితల గనులుగా విస్తరించి మిగిలిపోయిన బొగ్గును వెలికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లో బొగ్గు నిక్షేపాలు పుష్కలంగా ఉన్నప్పటికీ వాటిని తవ్వేందుకు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో పాల్గొనాల్సి రావటం సమస్యగా మారింది. నేరుగా కొత్త గనులు కేటాయించాలని ప్రభుత్వాన్ని యాజమాన్యం కోరుతుండగా.. ఎంఎండీఆర్ చట్టం తీసుకురావడంతో



దాని ప్రకారం దేశంలో ఎక్కడ గనిని దక్కించుకోవాలన్న వేలం ద్వారానే పొందాల్సి ఉంటుంది.

**ఏడుకు.. ఏడు**

సింగరేణి సంస్థ విస్తరణ గనులపై ఆశలు పెట్టుకుంది. ప్రస్తుతం భూగర్భ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి వెలికితీసిన చోటనే ఉపరితల గనులుగా విస్తరించేందుకు ప్రణాళికలు వేసింది. వీటిని రానున్న కాలంలో ప్రారంభించుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టింది. కొత్తగా విస్తరించనున్న ఆరు ఉపరితల, ఒక భూగర్భ గని ద్వారా 23 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రస్తుతం మూసివేసే గనుల్లో పనిచేసే ఉద్యోగులను వీటిలో సర్దుబాటు చేయనున్నారు. ఈ గనుల్లో 6,511 మందిని సర్దుబాటు చేయడంతో పాటు బొగ్గు ఉత్పత్తి పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## సారథి.. కొత్త వారధి

నీలగిరి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడించి వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు రవాణాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. రవాణాశాఖ సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న సీఎఫ్ఎస్టీ(సిటిజన్ ఫ్రెండ్లీ సర్వీస్ ఇన్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్) పోర్టల్ తొలగించి దానిస్థానంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సారథి పోర్టల్ ద్వారా సేవలు అందించనున్నారు. త్వరలోనే వాహన్ పోర్టల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే ఈ సేవలను హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. వీటిని పరిశీలించిన అధికారులు ఈనెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



**ప్రయోజనాలివే..**

నూతనంగా అమలు చేస్తున్న సారథి పోర్టల్‌లో లైసెన్స్‌ల డాటా భద్రపరుస్తారు. డ్రైవింగ్ లైసెన్స్ అడ్రస్ మార్పును సులభంగా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. లెర్నింగ్ లైసెన్స్‌లను ఇంటి నుంచే పొందవచ్చు. లైసెన్స్ రెన్యూవల్ సులభంగా చేసుకోవడానికి వీలు కల్పించారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ అంతా వాహన్ పోర్టల్‌లో అధికారికంగా నమోదు అవుతుంది. వాహనం కొన్న వెంటనే డీలర్ వద్దే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.

**15 నుంచి అమలుకు శ్రీకారం**

సారథి పోర్టల్‌ను 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు అన్ని ఆర్టీఏ కార్యాలయాల్లోని సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. దీనికి అవసరమైన పరికరాలను కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నారు. 15 నుంచే లెర్నింగ్, శాశ్వత లైసెన్స్‌లు ముందుగా ఇచ్చేందుకు సమాయత్తమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, యాదాద్రి భువనగిరిలోని ఆర్టీవో కార్యాలయాల్లో అవసరమైన ఆధునిక సాంకేతిక పరికరాలను బిగించారు.

## దంపుడు 'ముద్ద' వైపు.. దండిగా..!

సూర్యాపేట : వాతావరణ మార్పులు, అనారోగ్య సమస్యలతో జనం ఆహారపు అలవాట్లలో మార్పును కోరుకుంటున్నారు. శరీరానికి ఆరోగ్య ప్రయోజనాలు అందించే తెల్ల బియ్యానికి బదులు బ్రౌన్ రైస్‌పై మక్కువ పెంచుకుంటున్నారు. పట్టణ ప్రజలకు పోటీగా పల్లెవాసులు కూడా పూర్వకాలపు పద్ధతిలో దంపుడు బియ్యం తినడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా క్రమంగా వారి సంఖ్య పెరుగుతోంది. అందులో ఆరోగ్యానికి బలాన్ని చేకూర్చే పోషకాలుంటాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఏటా 60 టన్నుల బియ్యం: ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మిల్లర్లు ఏటా సుమారు 60 టన్నుల బ్రౌన్ రైస్ మరాడిస్తారు. ఇందులో మిర్యాలగూడలోని మిల్లర్లు అత్యధికంగా 50 టన్నులు, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని మిల్లర్లు మిగిలిన 10 టన్నులు మిల్లాడిస్తూ ఉమ్మడి జిల్లాతో పాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. స్వయంగా మిల్లుల వద్దకు వెళ్లి వడ్లను మరాడించుకుంటున్న రైతులున్నారు. సూపర్‌మార్కెట్లో కొనుగోలు చేస్తున్న వారు కూడా ఉంటున్నారు.

ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారు వాటి స్థాయిలు అదుపులో ఉండేలా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అనారోగ్యానికి గురికావొద్దని భావించి దంపుడు బియ్యం తినడానికి ఆసక్తి చూపుతున్నారు. వారి ఆహార పట్టికలో ఈ ఆహారాన్ని చేర్చుకున్నారు.

చురకలు

శనివారం 16 ఆగష్టు 2025

# గుట్టుగా మట్టి దందా!

హుజూరాబాద్ : హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామపరిధిలోని మాలకుంటలో మట్టిని అక్రమంగా తవ్వుతున్నారు. స్థానికంగా పలు నిర్మాణ పనులకు సంబంధించిన గుత్తేదారు, కొందరు గ్రామస్థులు కలిసి కుంటతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాలను పొక్లెయిన్లతో తోడుతున్నారు. దీన్ని ఆసరాగా మలుచుకుని మరికొందరు దళారులు టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పట్టణాల్లోని నిర్మాణాలకు విక్రయాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. వందల ట్రిప్పులు నిత్యం తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు అక్రమ తవ్వకాలు ఆపటం లేదు. వెలుగు పూటనే మట్టి తోడుతుండటంతో ఇందులో అధికారుల పాత్ర కూడా ఉందనే విమర్శలు వస్తున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**రాత్రింబవళ్లు తవ్వకాలు**

రాత్రింబవళ్లు మట్టి తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు చెబుతున్నారు. మట్టి కోసం కుంటలను, ప్రభుత్వ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన తవ్వటంతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. రైతుల పొలాల్లోకి విద్యుత్తు సరఫరాకు మాలకుంటలోంచే సుమారు 20కి పైగా స్తంభాలు



వేశారు. ఆయా ప్రదేశాలను కూడా అక్రమార్కులు వదలటం లేదు. స్తంభాల చుట్టూ మట్టిని తోడుతున్నారు. వర్షాలు కురిసి కుంట నిండితే విద్యుత్తు స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయంతో పాటు ప్రాణాలకు కూడా ప్రమాదమే. భీమదేవరపల్లి-హుజూరాబాద్ ప్రధాన రహదారి వెంట మట్టిని తరలిస్తుండటంతో రోడ్డంతా బురదమయంగా మారింది. వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు.

**స్పందించని అధికారులు**

కాట్రపల్లి గ్రామం నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని.. రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారుల అండతోనే స్థానిక గుత్తేదారు, ఇందిరమ్మ లబ్ధిదారులు మట్టిని తోడుతున్నట్లు ఆరోపిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కనకయ్యపే వివరణ కోరగా.. తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిశీలించి సంబంధితశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

# సేవల విస్తృతి.. అన్నదాతల ప్రగతి

సిరిసిల్ల,: ఏ రంగంలోనైనా ఐకమత్యమే బలమన్నది అందరికీ తెలిసిన సత్యం. దీనిని వ్యవసాయంలోని రైతులను ఒకటి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఎంపిక చేసిన పీఏసీఎస్ (ప్రాథమిక సహకార సంఘాలు)లను ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తిదారుల సంఘం)గా మార్చనున్నారు. మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రాష్ట్రంలో ఎంపిక చేసిన ఎఫ్‌పీవోల నిర్వహణకు అవసరమయ్యే తొలివిడత నిధులను ఆయా సంఘాలకు అందజేశారు. ఉమ్మడి జిల్లాలో 1921లో కేడీసీసీబీని స్థాపించారు. దీని పరిధిలో 126 పీఏసీఎస్‌లు వీటిలో 3.97 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పనితీరు, సామర్థ్యాన్ని బట్టి జిల్లాలవారీగా పీఏసీఎస్‌లను వడపోశారు. అందులో 41 ఎఫ్‌పీవోలను అనుమతించారు.

**ఇవీ ప్రయోజనాలు**

పీఏసీఎస్‌లో సభ్యులు ఎఫ్‌పీవోల్లోనూ చేరవచ్చు. సహకార సంఘాల్లో ఉన్నట్లు ఎన్నికల నిర్వహణ ఉండదు. కాకపోతే అక్కడ సభ్యత్వ రుసుము బదులు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇలా పెట్టుబడులన్నీ కలిపి ఒక ఎఫ్‌పీవో షేర్ క్యాపిటల్ రూ.15 లక్షలుగా ఉండాలి. దీనికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రూ.15 లక్షల నుంచి రూ.2





కోట్ల వరకు రుణం అందిస్తుంది.

వీటితో ఆయా ఎఫ్‌పీవోల సభ్యులు పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కొనుగోలు వాటి విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకుటారు. ఇవేకాదు.. పంట ఉత్పత్తుల విక్రయాలు.. ఆహార అనుబంధ పరిశ్రమల స్థాపించడంతోపాటు సొంతంగా వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటూ విస్తరించే అవకాశం ఉంది.కొత్తగా ఏర్పాటు చేసుకునే ఎఫ్‌పీవోల మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చుకింద ఎన్‌సీడీసీ రూ.18 లక్షలు అందజేస్తుంది. దీనిలో మొదటి విడతలో ఒక్కో సంఘానికి రూ.3.16 లక్షల చొప్పున ఇచ్చారు. దీంతో కార్యాలయం ఏర్పాటుతో పాటు అందులో రికార్డుల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్‌ల నియామకంతోపాటు సభ్యులకు సిబ్బంది శిక్షణ కార్యక్రమాలకు వినియోగించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 41 సంఘాలకు నిర్వహణ నిధులు మంజూరయ్యాయి. సిరిసిల్లలో ఇల్లంతకుంట, వేములవాడ, నాంపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, చందుర్తి మండలం సనుగుల ఉన్నాయి. కోనరావుపేట మండలం మామిడిపల్లి, శ్రీరాములపల్లి, నాగారంలో 2000 సంవత్సరంలోనే మూడు ఎఫ్‌పీవోలు ఏర్పడ్డాయి. వీటిలో 1,559 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. మామిడిపల్లిలో తొలుత 40 మంది సభ్యులు 360 ఎకరాలతో ఎకరానికి రూ.వెయ్యి చొప్పున సభ్యత్వంతో రూ.3.60 లక్షలతో ఏర్పడింది. ప్రస్తుతం 529 మంది సభ్యులతో సంఘం టర్నోవర్ రూ.1.20 కోట్లకు చేరుకుంది.

# కాచుకో.. కాసులు నింపుకో



హైదరాబాద్: అనుమతుల్లేని.. అదనపు అంతస్తుల నిర్మాణాలు అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నాయి. ఇలాంటి వాటిపై పలువురు కార్పొరేటర్లు, అధికారులు, ఇతర వ్యక్తులు ఫిర్యాదు చేయడం, యజమానుల నుంచి డబ్బు వసూలు చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఎక్కడ నిర్మాణాలు జరుగుతున్నాయో అని కాచుకు కూర్చుంటున్నారు. తరువాత వెళ్లి కాసులు వసూలు చేస్తున్నారు. 2026 ఫిబ్రవరితో జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు పూర్తవనుండగా మిగిలిన ఆరు నెలల్లో.. అందినకాడికి దండుకోవాలని కొందరు కార్పొరేటర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**నగరాభివృద్ధికి అడ్డు**

మరోవైపు అక్రమ నిర్మాణాలు నగరాభివృద్ధికి అడ్డుగా మారుతున్నాయి. ఇష్టానుసారం పుట్టుకొస్తున్న కట్టడాలతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ధ్వంసమవుతోంది. రహదారులు సరిపోవట్లేదు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు చేస్తున్నా నగర జీవన ప్రమాణాలు మెరుగుపడట్లేదు. అక్రమ నిర్మాణాలపై దాఖలవుతున్న కోర్టు కేసులను వేగంగా పరిష్కరించే టౌన్ ప్లానింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటు, సమస్యను పునాదిలోనే అడ్డుకోగల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతోనే (ఎస్‌టీఎఫ్) వీటికి అడ్డుకట్టపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ట్రైబ్యునల్ ఏర్పాటుకు చర్యలు**

టౌన్‌ప్లానింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో ఎవరెవరు ఉండాలి, ఛైర్మన్ నియామకం వంటి ప్రక్రియ పురోగతిలో ఉంది. మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**కుప్పలుగా కేసులు**

బల్దియాలోని అన్ని విభాగాలకు సంబంధించిన కోర్టు కేసుల్లో 90శాతం టౌన్‌ప్లానింగ్ విభాగానివే. గత 15 ఏళ్లకు సంబంధించి 16 వేల కేసులు పెండింగులో ఉన్నాయి. న్యాయస్థానాలకు సరైన వివరాలు ఇవ్వకపోవడం, సమయానికి కౌంటరు దాఖలు చేయకపోవడం వంటి కారణాలతో ఈ సమస్య నెలకొంది. ఇదేంటని అడిగితే.. నగరంలో 150 డివిజన్లు ఉన్నాయని, అరకొర సిబ్బందితో కౌంటర్లు దాఖలు చేయలేకపోతున్నట్టు అధికారులు చెబుతున్నారు. సెక్షన్ అధికారులు, టీపీవోలు, ఏసీపీలు అరకొరగా ఉన్నారని, కొన్నిసార్లు కూల్చివేతలకు యంత్రాలు, సిబ్బందిని కూడా సమకూరడం లేదని వాపోతున్నారు.

**కనిపించని ఎస్టీఎఫ్**

గ్రేటర్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను (ఎస్‌టీఎఫ్) నియమిస్తూ జి.ఓ.నం.200ను విడుదల చేశారు. జీహెచ్ఎంసీ కింద పని చేసిన ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులు, సిబ్బంది, యంత్రాలను ఎస్‌టీఎఫ్ సేవలకు ఉపయోగించుకోవాలని సూచించారు. తరువాత ఈవీడీఎం విభాగం జీహెచ్ఎంసీ నుంచి విడిపోయి హైడ్రాగా మారింది. ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్ అధికారులే అక్రమ నిర్మాణాలకు నోటీసులిస్తున్నారు.

**గ్రేటర్ పరిధిలో**

ఏటా మంజూరయ్యే నిర్మాణ అనుమతులు: 15-16 వేలు
అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలు: 15-20 వేలు
అక్రమ నిర్మాణాలపై పెండింగ్ కేసులు: 16 వేలు
అత్యధికంగా 1,500 కేసులు పెండింగులో ఉన్న ప్రాంతం: ఖైరతాబాద్ సర్కిల్
ఫిర్యాదులు ఎక్కువగా వచ్చే సర్కిళ్లు: శేరిలింగంపల్లి, చందానగర్, ఎల్బీనగర్, జూబ్లీహిల్స్, ఉప్పల్

# అనుబంధాలపై సామాజిక దాడి



గోదావరిఖని: ఇవి వివిధ ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు.. సామాజిక మాధ్యమాల్లో ఏర్పడిన పరిచయాలు ప్రేమలు, వివాహేతర సంబంధాలకు దారితీస్తున్నాయి. తాము చేస్తున్నది తప్పు అన్న భావన లేకుండా అంతమొందిస్తూ మానవ సంబంధాలను తెంచుకుంటున్నారు. అనుబంధాలు, బంధుత్వాలు, మానవత్వం మరిచి విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారు.

ఒకే కుటుంబంలో పుట్టి పెరిగిన వారిలో కూడా బంధాల విలువ లేకుండా పోతోంది. చరవాణి వినియోగం ఎక్కువ కావడంతో పూర్తిస్థాయిలో అందులోనే మునిగిపోతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఏర్పడే పరిచయాలే సర్వస్వంగా మారిపోతున్నాయి. కనీస ముఖ పరిచయం లేని వారి కోసం కుటుంబసభ్యులను దూరం చేసుకుంటున్నారు. ప్రస్తుత యువత పెద్దలను పట్టించుకోకుండా తమకు తాముగా నిర్ణయాలు తీసుకొని సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నారు.

సామాజిక మాధ్యమంలో ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. భర్త లేని సమయంలో ప్రియుడు ఇంటికి రాగా ఆ కుటుంబంలో చిచ్చుపెట్టింది. భార్యాభర్తలు దూరం కావడానికి కారణమైంది. ప్రేమకు అడ్డువస్తుందనే కారణంతో కనిపెంచిన తల్లిని కుమార్తె హత్య చేయించింది. వెన్నంటి ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకున్న తల్లినే అంతమొందించే స్థాయికి చేరింది. సామాజిక మాధ్యమంలో ఏర్పడిన పరిచయమే కారణంగా తేలింది.

సామాజిక మాధ్యమంలో రీల్స్ చేయవద్దని చెప్పినా వినడం లేదని కన్న కుమార్తెను తండ్రి తుపాకీతో కాల్చి చంపారు. ఈ సంఘటన ఇటీవల వెలుగుచూసింది.

**కలిగే అనర్థాలు**

మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి
ఆత్మగౌరవాన్ని ప్రభావితం చేస్తుంది
వ్యసనంగా మారుతుంది
నకిలీ వ్యక్తులతో మోసపోయే ప్రమాదం

**క్రూరత్వానికి దారి తీస్తుంది**

మానవ బంధాలపై ప్రభావం - ఎల్.రాజయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, సీనియర్ సిటిజన్

సామాజిక మాధ్యమం మానవ బంధాలను దూరం చేస్తోంది. ఒకప్పుడు పెద్దలు బాగోగులు చూసేవారు. భవిష్యత్తుకు మార్గం చూపేవారు. ప్రస్తుతం ఎవరికి వారే పెద్ద అనుకుంటున్నారు. సామాజిక మాధ్యమాలనే విశ్వసిస్తున్నారు. అందులో పరిచయమైన వ్యక్తుల మాటలు వింటున్నారు. ఎదుటి వారి మాయమాటలకు మోసపోయి అనర్థాలకు పాల్పడుతున్నారు. దీని నుంచి బయటపడితేనే బంధాలు, నిలబడతాయి. **ప్రాథమిక స్థాయిలోనే పరిహరించాలి: కరుణాకర్, డీసీపీ, పెద్దపల్లి** సామాజిక మాధ్యమంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి సందేశం వచ్చిందంటే దానికి స్పందించాల్సిన అవసరం లేదు. ఒకవేళ తెలిసిన వ్యక్తి అయినా పంపించే సందేశాల్లో తేడా ఉంటే వెంటనే బ్లాక్ చేయాలి. లేదంటే స్వీయ రక్షణతో పాటు కుటుంబం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంటుంది. ముందే గుర్తించి దూరంగా ఉంటే అనర్థాలకు దారి తీసే అవకాశం ఉండదు. కొన్ని కొన్ని సందర్భాల్లో తెలిసి కూడా స్పందిస్తుంటారు. చాలా తెలివిగా సమాధానం చెబుతున్నామనుకుం టారు. కాని ఎదుటి వ్యక్తి మనల్ని ప్రభావితం చేస్తున్నాడన్న విషయాన్ని గమనించరు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. సామాజిక మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండటం మంచిది.

# అసరా అందేదెన్నడో?

జగిత్యాల : పీఎఫ్ ఖాతాలో 2014 ఫిబ్రవరి 28 వరకు నమోదైనవారికే జీవనభృతి పింఛన్లను అందిస్తుండటంతో.. వేలాదిమంది బీడీ కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారు. కటాఫ్ తేదీ తరువాత పీఎఫ్ కార్డు వచ్చినా.. ప్రభుత్వం పింఛన్‌కు పరిగణలోకి తీసుకోలేదు. మరోవైపు 2022 ఆగస్టులో కేవలం నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా.. ఇప్పటికి ఆ జిల్లాలో అమల్లోకి రాకపోగా ఇతర ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. గత భారాస రెండుసార్లు అధికారంలోకి వచ్చినా.. కటాఫ్ తేదీని ఎత్తివేయలేదు. తాము ఎత్తివేస్తామన్న కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాదిన్నర గడచినా.. చర్యలు తీసుకోలేదు. దీంతో అర్హులైన వేలాదిమంది ప్రభుత్వ ఆసరాకు దూరమయ్యారు.

పింఛనులో జగిత్యాల రెండో స్థానం

ఆసరా పింఛను పొందుతున్న బీడీ కార్మికుల సంఖ్య రీత్యా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉండగా.. రాజన్న సిరిసిల్ల నాలుగో స్థానంలో ఉంది. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్పల్లి, వేములవాడ, రాయికల్ తదితర ప్రాంతాల్లో బీడీ పరిశ్రమ ఆధారంగా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా 45 వరకు బీడీ సంస్థలున్నాయి. ప్రస్తుతం బీడీలకు మార్కెట్లో గిరాకీ తగ్గడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితోపాటుగా ఇతర కార్మికులకు పింఛను మంజూరివ్వాలని, తయారీకి తగినట్లు తునికాకు సరఫరా, ప్రధాని ఆవాస్ యోజనద్వారా ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల రాయితీ, ఈఎస్ఐ కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్య సేవలందించాలని కార్మికులు కోరుతున్నారు.

నాలుగు జిల్లాల్లో మొత్తం బీడీ కార్మికులు: 2,01,427
బీడీ పరిశ్రమపై ఆధారపడిన టేకేదార్లు, ఇతరులు: 47,594
పింఛన్లు రావాల్సినవారు: 54,675

# శిథిలం.. జర పదిలం

వేములవాడ : వేములవాడ పట్టణంలో శిథిలావస్థకు చేరిన పాత భవనాలు భయపెడుతున్నాయి. జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఇవి ఉండడంతో ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి కూల్చివేయాలని పురపాలక అధికారులకు విన్నవించినా నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు 22వ వార్డులో ఒక శిథిల భవనం కుప్పకూలింది సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి నష్టం సంభవించలేదు. అధికారులు శిథిల భవనాలను కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ఇవిగో ఆనవాళ్లు**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో పురాతన బురుజుపై భారీ వృక్షాల పెరుగుదలతో ప్రమాదకరంగా మారింది. నైజాం కాలంలోని ఆ రాతి నిర్మాణంలో చెట్లు మరింత ఏపుగా పెరిగితే వాటి వేర్లు మరింత లోతుకు వెళ్లే అవకాశాలున్నాయని స్థానికులు తెలిపారు. చెట్ల వేర్ల వల్ల బురుజులోని కట్టడంలోని రాళ్లు పెకిలిపోయి, పూర్తిగా



కూలిపోయే వీలుందని చెబుతున్నారు. బురుజు చుట్టూ ఇళ్లు, పక్కనే పాఠశాలలున్నాయి. ప్రమాదం చోటుచేసుకోకముందే బురుజుపై పెరిగిన వృక్షాలను తొలగించి, మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. సిరిసిల్ల పట్టణంలోని తహసీల్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆధార్ నమోదు కేంద్రం ఏ క్షణంలో కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తహసీల్ కార్యాలయం పక్కనే ఉద్యోగుల భవిష్యత్తు నిధి కార్యాలయం ఉండేది. ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరుకున్నా.. ప్రభుత్వ కార్యాలయంగా నిర్వహిస్తున్నారు.

కోనరావుపేట మండలంలో కొలనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థలో కొనసాగుతోంది. భవనం గోడలు, శ్లాబు పగుళు బారాయి. భవనం శ్లాబు, గోడలు పెచ్చులూడి కిందపడగా ఇనుప చువ్వలు తెలిపి ప్రమాదకరంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల శిథిల నిర్మాణాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వర్షాలు కురిస్తే అవి కూలిపోయి నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది. వానాకాలం నేపథ్యంలో ఇటువంటి నిర్మాణాలను గుర్తించి తొలగింపజేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.సిరిసిల్ల అర్బన్, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట

# దోమల బాధ ఇంతింత కాదయా

సిరిసిల్ల : పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీల్లో చెత్త చెదారంతో నిండిపోయి అధ్వానంగా మారాయి. వర్షాకాలం కావడంతో ఎక్కడ పడితే అక్కడ నీరు నిల్వ ఉంటుంది. దోమల నియంత్రణకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బంది పడుతున్నారు. జానావాసాల మధ్య పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం కాగానే ఆరుబటయ నిలబడలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ప్రజలకు దోమలు కుట్టి రోగాల బారిన పడుతూ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

**39 వార్డులు.. పది ఫాగింగ్ మిషన్లు**

సిరిసిల్ల పట్టణంలో మొత్తం 39 వార్డులు ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంతో పాటు విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అంతంత మాత్రమే ఉండటం, డ్రైనేజీల్లో చెత్తను తొలగించకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

39 వార్డులకు కేవలం పది ఫాగింగ్ యంత్రాలును వారానికి రెండు సార్లు వార్డుల చొప్పున ఫాగింగ్ చేస్తున్నామని అధికారులు చెప్తున్నప్పటికీ ఫాగింగ్ మాత్రం చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

దోమల నివారణకి ప్రతి ఏటా ఫాగింగ్, స్ప్రేయింగ్, నివారణ మందులు, యంత్రాల మరమ్మతులకు, డీజిల్ తదితర వాటికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నప్పటికీ దోమల బెడద నుంచి పట్టణ వాసులకు బాధలు తప్పడం లేదు.

దోమల నియంత్రణకు అధికారులు క్షేత్ర స్థాయిలో కార్యాచరణ చేపట్టడం లేదని, తూతూ మంత్రంగా ఫాగింగ్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



వాతావరణంలో మార్పుల వల్ల ఇప్పటికే ప్రజలు జ్వరాల బారిన పడుతూ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. మరోవైపు దోమకాటుకు గురై డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తదితరాలు సోకే ప్రమాదం ఉన్నందున అధికారులు దోమల నియంత్రణ ఇప్పటికైనా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం: రవీందర్, సిరిసిల్ల

పూర్తి స్థాయిలో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ ఉంటోంది. వర్షాకాలం కావడంతో మరింత నీరు చేరి దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి ఇళ్లలోకి వస్తున్నాయి. వార్డుల్లో ఫాగింగ్ చేపట్టడంతోపాటు పకడ్బందీ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలి.

**అవగాహన కల్పిస్తున్నాం: ఖదీర్ పాష, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్**

ప్రతి వార్డులో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తున్నాం. డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ చల్లుతున్నాం. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

# నాడు రూ.40 కోట్లు.. నేడు రూ.29 కోట్లే

శ్రీకాళహస్తి: ఎక్కడైనా రోజులు గడిచే కొద్దీ నిర్మాణ వ్యయం పెరగడం సర్వసాధారణం. కాని శ్రీకాళహస్తి విషయానికి వస్తే వైకాపా హయాంలో రూ.40 కోట్లతో అంచనాలు సిద్ధం చేసిన రోడ్డు పనులను కూటమి ప్రభుత్వం రూ.29 కోట్లతోనే చేపడుతుండటం విశేషం. ఏడాది గడిచాక పనులు ప్రారంభించినా ఏకమొత్తంగా రూ.11 కోట్లు వ్యత్యాసం ఉండటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. శ్రీ శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని జలవినాయకుని ఆలయం వద్ద ఉన్న వంతెన నుంచి బైపాస్ వంతెనను కలుపుతూ 'శివం టు శివం' రోడ్డు ఏర్పాటు చేయాలని తెదేపా హయాంలో అప్పటి ట్రస్టు బోర్డు తీర్మానం చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఐదేళ్లు ఈ రోడ్డు ఏర్పాటుపై హామీలిస్తూ వచ్చింది. ఎన్నికలకు ముందు టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసింది.

**రూ.11 కోట్ల వ్యత్యాసం..:** సన్నిధివీధిలోని జల వినాయకుని ఆలయం నుంచి సువర్ణముఖి నదిని ఆనుకుని కుడి వైపు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. 2.75 కిలోమీటర్లు పొడవు ఉన్న ఈ పనులకు వైకాపా హయాంలో రూ.40 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. దీనిపై తెదేపా అప్పుడే అభ్యంతరం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అదే పనులను రూ.29 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు



నిర్వహించి పనులు ప్రారంభించారు. పనుల నిర్వహణలో ఇంత వ్యత్యాసం ఎందుకన్నది ఇప్పటికీ చర్చనీయాంశమే.

**రోడ్డుతో.. సౌలభ్యాలు అనేకం..:** శివం టు శివం రోడ్డు పనులతో ఎన్నో సౌలభ్యాలు చేకూరనున్నాయి. ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యకు చరమగీతం పాడనున్నారు. అంతేకాకుండా ఆలయానికి వచ్చే భక్తులు పట్టణంలోకి ప్రవేశించకుండానే నేరుగా ఆలయానికి రావడం, దర్శనం పూర్తయ్యాక మళ్లీ ప్రధాన రహదారుల్లో కలిసే విధంగా పనులు చేపడుతున్నారు. అలాగే పట్టణంలోని చతుర్మాడ వీధుల్లో విశేష ఉత్సవాలు, భారీ కార్యక్రమాల నిర్వహణ సమయంలో ట్రాఫిక్ మళ్లింపు సులభతరంగా ఉండే అవకాశముంది. సువర్ణముఖి నదీ అదనపు జలాలు చెంబేడు కాల్వకు మళ్లింపు చేసే ప్రదేశంలో కాంక్రీటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇన్ని ప్రయోజనాలు కలిగిన శివం టు శివం రోడ్డును మరింత పకడ్బందీగా, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా పనులు చేపడుతున్నట్లు పాలకులు, అధికారులు చెబుతున్నారు.

# మత్తు మాయలో.. మృత్యు మార్గంలో

విజయనగరం : గతేడాది పెద్దచెరువు రోడ్డులో 19 ఏళ్ల యువకుడు, 15 ఏళ్ల బాలుడు డివైడర్‌ను ఢీకొని మృతిచెందారు. మార్గమధ్యలో ఇద్దరూ మద్యం తాగి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. వారం తరువాత పూల్‌బాగ్ కాలనీ సమీపంలో 17 ఏళ్ల బాలుడు బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి తాటి చెట్ల మధ్యలోకి దూరి ప్రాణాలు కోల్పోయాడు. మత్తు కారణంగా ఈ ఘటన జరిగినట్లు తేల్చారు. బొండపల్లి రోడ్డులో 32 ఏళ్ల యువకుడు బైక్‌తో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పూటుగా మద్యం తాగిన అతడిని వైద్యులు కాపాడలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలామంది మద్యం, గంజాయి మత్తులో ప్రాణాలు కోల్పోతున్నట్లు ఇటీవల పోలీసులు తెలిపారు. మృతుల్లో 15 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వారు ఎక్కువగా ఉంటున్నారని గుర్తించారు. నేరుగా ముందున్న వాహనాలు, చెట్లు, డివైడర్లను ఢీకొనడమో లేదా ఇతర ప్రయాణికులను క్షతగాత్రులుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. ఎన్ని దాడులు చేస్తున్నా రోజురోజుకూ కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

**తరచూ ప్రమాదాలు..** రెండు జిల్లాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో 25 శాతం వరకు మత్తులో ఉన్నవారి వల్లే చోటుచేసుకుంటున్నాయని పోలీసుశాఖ పేర్కొంటోంది. కొందరు గంజాయి, మద్యం తాగిన తరువాత శిరస్త్రాణాలు సైతం ధరించడం లేదని, ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ఇతర ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నట్లు గుర్తించింది. ఈ ఏడాది 255 ప్రమాదాల్లో 62 మంది మృతిచెందారు.

**అందుబాటులో కేంద్రాలు..**

తాగుడుకు దూరం కావాలనుకునే వారికి మహారాజా ప్రభుత్వాసుపత్రి, పార్వతీపురంలోని జిల్లా వైద్యాలయాల్లోని మత్తు వ్యసనపరుల విముక్తి కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఒక్కోచోట పది పడకల చొప్పున అందుబాటులో ఉన్నాయి. వైద్యులు, కౌన్సెలర్లు, ఇతర సిబ్బందిని నియమించారు. బాధితుడితో పాటు అవసరం మేరకు అతడి కుటుంబ సభ్యులకు సైతం కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 758 మంది చికిత్స పొందారు.

**భారీగా జరిమానాలు..**

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడినా, బహిరంగ, నిషేధిత ప్రాంతాల్లో తాగినా పోలీసులు వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కోర్టులకు తరలిస్తుండడంతో రూ.10 వేల చొప్పున జరిమానాలు విధిస్తున్నారు. ఈ ఏడాది 366 మందికి రూ.36.60 లక్షల జరిమానా పడింది. ఇటీవల నగరానికి చెందిన 10 మంది రూ.1.60 లక్షలు చెల్లించారు. వీరంతా 15 నుంచి 35 ఏళ్ల లోపు వారే.

**మెదడుపై ప్రభావం..**

'మద్యం తాగి వాహనం నడపడం గుండెకు మంచిది కాదు. మెదడుపై నేరుగా ప్రభావం పడుతుంది. ఈక్రమంలో పట్టు కోల్పోతారు. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువ. ఒకవేళ మద్యానికి బానిసైతే వైద్యులను సంప్రదించాలి' అని ప్రముఖ జనరల్ ఫిజీషియన్, ఎన్‌సీడీ సెల్ వైద్యుడు డా.మురళీకృష్ణ చెప్పారు. మందుబాబుల విషయంలో రాజీ పడడం లేదని, పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

# పంథా మారిన పరీక్ష



అనంతపురం : పాఠశాలల్లో నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చింది. దీంతో పరీక్షల పంథా మారింది. కొత్త విధానంతో సోమవారం నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ప్రశ్న, సమాధాన ప్రతాలు గతానికి భిన్నంగా రూపకల్పన జరిగింది. ప్రశ్నలు నేరుగా అడగకుండా మెలిక పద్ధతిలో ఉన్నాయి. సమాధానాలకు పత్రాలు కాకుండా ప్రత్యేక పుస్తకాన్నే తయారు చేశారు. కొత్త విధానంతో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. నూతన విధానంలో సత్ఫలితాల సాధనకు విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనప్పుడే సాధ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఏడాదంతా ఒకే పుస్తకంలో..**

కొత్త పద్ధతిలో ఒకే పుస్తకంలోనే ఏడాదిలో జరిగే పరీక్షలన్నీ రాయాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి విధిగా హాజరవ్వాలి. సమాధాన పత్రాల్లో ఎక్కడా కొట్టివేతలు ఉండకూడదు. పరీక్ష పత్రాలను దిద్దాక పక్కన పడేయకుండా భద్రపరిచే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. విద్యార్థులు సాధించిన మార్కులను నమోదు చేస్తారు. మొదటి, తర్వాత పరీక్ష ఫలితాన్ని బట్టి బోధనలో నాణ్యత, విద్యార్థి సామర్థ్యాల అంచనాకు సులువు అవుతుంది. బోధన ప్రశ్నలకు పాఠ్యాంశాలపై భిన్న కోణాల్లో విశ్లేషించే లోతైన అవగాహన ఉంటేనే సమాధానానికి సులువవుతుంది. దీంతో అందరూ ఒకేరకమైన సమాధానానికి అవకాశం లేదు. తద్వారా మాస్ కాపీయింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది. ఫలితంగా సామర్థ్యం కలిగిన పిల్లల ప్రత్యేకత, వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించేందుకు దోహదపడుతుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం పాఠశాలలు: 3,855

విద్యార్థులు: 3,60,000

**తార్కిక విధానాన్ని పెంచేలా బోధన**

– ధనుంజయ, గణిత ఉపాధ్యాయుడు, కదిరి

కొత్త పద్ధతి పరీక్షల్లో ఫలితాలకు పాఠ్యాంశాలను విద్యార్థి ఆకళింపు చేసుకునేలా బోధన జరగాలి. తార్కిక విధానాన్ని పెంపొందించేలా పిల్లలను తయారు చేయాలి. విద్యార్థి భిన్నకోణాల్లో తనను తాను ప్రశ్నించుకోవటంతో ఉత్పన్నమయ్యే కొత్త ఆలోచనలు పరిష్కారం దిశగా సాగుతాయి. తద్వారా బట్టీ విధానానికి చెల్లుచీటీ పడుతుంది. స్వీయ సామర్థ్యాలతో ఫలితాల సాధన సులువవుతుంది.

# పన్నుల సొమ్ము.. గుత్తేదారుల పాలు




హిందూపురం: ప్రజలను నుంచి వసూలు చేసే పన్నుల సొమ్మును స్థానిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు గుత్తేదారుల పరం చేస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పనుల నాణ్యత మాట దేవుడెరుగు... కనీసం టెండర్లు పిలవడం, పనుల కేటాయింపుల్లోనూ నిబంధనలు పాటించలేదు. ఇష్టారాజ్యంగా నిర్వహణ పేరుతో ఖర్చు పెట్టేశారు. గతంలో జరిగిన తప్పిదాలను కూటమి ప్రభుత్వంలోనూ సరిదిద్దకపోగా అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. ఆడిటింగ్ చేసే అధికారులు చెప్పే అభ్యంతరాలను బేఖాతరు చేస్తున్నారు. చివరకు కాగ్ అధికారులు చేసే ఆడిటింగ్‌లో తప్పిదాలు బయట పడుతున్నాయి. సరిదిద్దుకోవాలని కాగ్ చెబుతున్నా లెక్క చేయడం లేదు.

**అడుగడుగునా ఉల్లంఘనలే..**

ఏదైనా పనికి టెండర్ పిలిచినప్పుడు ఒక్క గుత్తేదారు మాత్రమే దాఖలు చేస్తే అతను చివరకు లెస్‌కు టెండర్ వేసినా ఆమోదించరాదు. హిందూపురం పురపాలికలో గుత్తేదారు పని విలువకు ఎక్సెస్‌గా 4.99 శాతం వేస్తున్నా వాటిని ఆమోదించి పనులు కట్టబెడుతున్నారు. వైకాపా హయాంలో ప్రతి పనికి అధిక టెండర్ వేయడం రివాజుగా సాగింది. గొల్లపల్లి తాగునీటి పథకం నిర్వహణ పేరుతో పెద్ద ఎత్తున నిధులను ఖర్చు పెట్టారు. ఇటీవల హిందూపురంలో మినీ డంపింగ్ యార్డుల చుట్టూ ప్రహరీ నిర్మాణాలకు ఒక గుత్తేదారు ముందుకు వచ్చినా పనులు కట్టబెట్టారు. ఒకే రకమైన పనులను విభజించరాదు. పని విలువ ఎక్కువ అయితే ఉన్నతాధికారుల ఆమోదానికి పంపాల్సి వస్తుందని స్థానిక ఇంజినీరింగ్ అధికారులు ఒకే పనిని విభజిస్తున్నారు. హిందూపురంలో ఇటీవల తాగునీటి సరఫరాకు సంబంధించి దాదాపు రూ.5 కోట్లు విలువైన పనులకు టెండర్లు పిలిచారు. అన్ని నీటి సరఫరాకు సంబంధించినవే అయినా 33 పనులుగా విభజించడం గమనార్హం.

**క్షుణ్ణంగా పరిశీలించాకే ఆమోదం**

–మల్లికార్జున, హిందూపురం మున్సిపల్ కమిషనర్

పనుల్లో నాణ్యత ఉండాలని, నిబంధనలు పాటించేలా చూడాలని ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పనులను చేయవద్దని సిబ్బందిని ఇప్పటికే ఆదేశించాం. గత అధికారుల హయాంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని సూచించా. ప్రతి టెండర్, బిల్లును క్షుణ్ణంగా పరిశీలించాలని మున్సిపల్ ఆడిటింగ్ విభాగ అధికారికి ఆదేశాలు ఇచ్చాం.

# ఇంటిని మరపించే వసతి లోగిలి



అనంతపురం : వసతి గృహాలు అనగానే పాడుబడిన భవనాలు, రంగులు వెలసిన గోడలు, వేలాడుతున్న తీగలు, మరుగుదొడ్లు లేక పాట్లు.. ఇలా ఎన్నో అసౌకర్యాల నిలయాలు. ఐదేళ్ల వైకాపా హయాంలో నాడు-నేడుతో సౌకర్యాలు కల్పిస్తామని ఆర్భాటం చేసి కనీసం మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ కూడా అందివ్వని దయనీయ స్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టి ఇంటిని మురిపించే విధంగా సౌకర్యాలు కల్పించారు. ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయి.

**రూ.9.25 కోట్లతో పనులు**

వసతి గృహాల్లో విద్య మౌలిక సదుపాయల కల్పన ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించి మొదట అత్యవసరం అయిన పనులను గుర్తించారు. అనంతపురం జిల్లాలోని 62 సాంఘిక, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో రూ.9.25 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు. మరుగుదొడ్ల నిర్మాణం, రంగులు, వైరింగ్, స్లాబు మరమ్మతులు, షెడ్లు, మురుగు వ్యవస్థ, తాగునీరు, తలుపులు, కిటికీలు తదితర సౌకర్యాలు కల్పించి ఆహ్లాదంగా మార్చారు. బీసీ, సాంఘిక సంక్షేమంలో 106 ఉంటే 86 వసతి గృహాల్లో ప్రవేశాలు పెరిగాయి.

**ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది..**

అనంతపురంలోని సాంఘిక సంక్షేమ నంబరు-2 వసతి గృహాల్లో గత సంవత్సరం 121 మంది ఉండగా ఈ సంవత్సరం 147 మంది ప్రవేశాలు పొందారు. నంబరు-4వసతి గృహంలో గత సంవత్సరం 104 మంది ప్రవేశాలు పొందితే ఈ సంవత్సరం 132 మంది చేరారు. ఈ రెండు వసతి గృహాల్లో రూ.38.50 లక్షలతో పలు రకాల సౌకర్యాలు కల్పించి ఆహ్లాదంగా తీర్చిదిద్దారు.

**మూడింట్లోనే 182 మంది**

అనంతపురంలోని గిల్డ్ ఆఫ్ సర్వీసు బాలికల వసతి గృహ ప్రాంగణంలో సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల, బీసీ సంక్షేమ పాఠశాల వసతిగృహాలు ఉన్నాయి. మూడు వసతి గృహాల్లో రూ.40 లక్షల వరకు వెచ్చించి పలు సౌకర్యాలు బాలికలకు కల్పించారు. గత సంవత్సరం కంటే 182 మంది అధికంగా చేరారు. మూడు వసతి గృహాల్లో సీట్లు కావాలని ఒత్తిడి పెరగడంతో ప్రవేశాలు లేవని బోర్డులు ఏర్పాటు చేశారు.

# అక్రమార్కుల 'పాక'పాచిక

విశాఖపట్నం : విశాఖలో కబ్జాలకు సరికొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. వైకాపా హయాంలో ఈ తరహా భూ దందాకు బీజం పడింది. 13వ వార్డు దారపాలెం, ఫైనాపిల్ కాలనీ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయి. సర్వే నెంబరు 15/12 లో ఉన్న 3.07 ఎకరాల్లో గత ఐదేళ్లలో రూ.కోట్ల విలువైన ఎకరా భూమిపైగా కబ్జాకు గురైంది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు ఇదే తరహా కబ్జాలకు అడుగులు వేస్తున్నారు. ఇటీవల యోగాంధ్ర నిర్వహణలో అధికారులు నిమగ్నమైన వేళ కొన్ని నిర్మాణాలు ఆగమేఘాలపై పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

**నాయకులు, రౌడీషీటర్లదే హవా:** పోరంబోకు స్థలంలో మొదట పశువుల కోసం ఎండుగడ్డి వేసి, అక్కడే వాటిని కట్టేస్తారు. కొన్ని రోజుల తర్వాత పశువుల రక్షణ పేరుతో పాకలు వేస్తారు. ఆ స్థలం ఇతరుల నుంచి కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించి చక్రం తిప్పుతున్నారన్న విమర్శలున్నాయి. ఆపై జీవీఎంసీ సిబ్బందితో లాలూచీ పడి పన్ను వేయించడం, ఆపై విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేయడం చకచకా జరిగిపోతున్నాయి. తరువాత కొన్ని రోజులకే రక్షణ గోడ నిర్మాణం చేపడతారు. ఎవరైనా ప్రశ్నిస్తే బీఆర్టీఎస్ రహదారిలో స్థలం



పోగొట్టుకున్నామని, ప్రతిగా ఇక్కడ స్థలం ఇచ్చారంటూ చెప్పుకొస్తుండటం గమనార్హం. ఈ వ్యవహారంలో నాయకులతోపాటు, కొందరు రౌడీషీటర్లు పావులు కదుపుతున్నారు. ఓ రౌడీషీటర్ ఆధ్వర్యంలో ఇటీవల కొన్ని నిర్మాణాలు సాగడంపై చర్చనీయాంశమైంది.

**అధికారుల 'భూ'చాట!:** ఇక్కడ విచిత్రం ఏమిటంటే కొందరు అధికారులే ప్రభుత్వ భూములు ఎలా కబ్జా చెయ్యాలో, ఆక్రమణదారులు ఏ విధంగా రక్షణ వలయంలో ఉండాలో సూచనలిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఆక్రమణదారులు భవన నిర్మాణం చేసేవరకు అటువైపు కన్నెత్తి చూడరు. ఫిర్యాదులొస్తే హడావుడి చేసి ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతి చేతులు దులిపేసుకుంటున్నారు. సృష్టించిన నకిలీ పత్రాలను వాస్తవమైనవా? నకిలీవా? అని అధికారులు తీరుబడిగా తేల్చేలోగా భవనాలు పూర్తిచేస్తున్నారు. ఈ భవనాలు కొన్ని చేతులు మారగా, మరికొందరు అద్దెలకిచ్చుకుంటున్నారు.

# దస్త్రాల్లో పేదలు.. పొలాల్లో పెత్తందార్లు

బొబ్బిలి : పేదల బతుకు తెరువు కోసం గతంలో ప్రభుత్వం అందజేసిన డి.పట్టా భూములు చేతులు మారుతున్నాయి. భూముల ధరలు పెరుగుదలతో లబ్ధిదారులను మోసగించి.. కారుచౌకగా వారి నుంచి లాగేస్తున్నారు. రెవెన్యూ అధికారుల సహకారంతోనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. దస్త్రాల్లో లబ్ధిదారులే ఉన్నా వందేళ్ల లీజు పేరుతో పత్రాలు సృష్టించి పెత్తందార్లు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ అవసరాలకు ఈ భూములు సేకరిస్తే కొనుగోలు చేసిన వారికే లబ్ధి చేకూరుతోంది.

**ఇదీ పలుచోట్ల పరిస్థితి**

బొబ్బిలి పట్టణం మల్లంపేట, గున్నతోటవలస, గొల్లపల్లి, రామన్నదొరవలస, పుల్లేరువలస, పారిశ్రామికవాడ ప్రాంతం, విజయపురి ప్రాంతాల్లోని వందల ఎకరాలు బడాబాబుల చేతుల్లో ఉన్నాయి. గతంలో ఓ నాయకుడు రామన్నదొరవలస వద్ద గిరిజనుల డి.పట్టా భూములను కొనుగోలు చేసి జగనన్న కాలనీకి విక్రయించారు. రూ.లక్షలు లాభం పొందాడు. సీబీసీఐడీ అధికారులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు నిర్వహించారు. అధికారుల అండదండలతోనే ఇదంతా సాగింది. తెర్లాం మండలంలోని లోచర్ల, ఆమిటి, వెలగవలస, ఎం.ఆర్ అగ్రహారం తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల డి.పట్టా భూములను విశాఖకు చెందిన ఓ వైద్యుడు కొనుగోలు చేశారు. కొన్నాళ్లు సాగు చేశాక వివాదంలోకి వెళ్లడంతో స్థలాన్ని ఖాళీగా ఉంచారు.

భూబందరవలస రెవెన్యూలో పేదలకు ఇచ్చిన భూములను తెలంగాణకు చెందిన భూస్వామి కొనుగోలు చేసి, దర్జాగా పంటలు పండించుకుంటున్నాడు.

డొంగురువలస రెవెన్యూలో డి.పట్టాలు పేదల పేరున ఉన్నప్పటికీ భూములు మాత్రం పెత్తందార్ల చేతిలో ఉన్నాయి.

చింతాడ సమీపంలోని డి.పట్టా భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు కొనుగోలు చేశాడు. ప్లాట్లు వేయడానికి



చదును చేసిన తర్వాత రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

రామభద్రపురం మండలం కొండకెంగువ, ఎనుబరువు, రావివలస గ్రామాల్లో డి.పట్టాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

బొబ్బిలి మండలం కొయ్యకొండవలస గిరిజనులకు చాలా ఏళ్ల కిందట ఇచ్చిన భూములను సాలూరు మండలం బాగువలసకు చెందిన ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారు. ఫిర్యాదు అందడంతో గతేడాది నవంబరులో తహసీల్దారు శ్రీను, వీఆర్వోలు స్వాధీనం చేసుకుని లబ్ధిదారులకు అప్పగించారు.

**రెవెన్యూ సిబ్బంది సహకారంతో..**

కొంతమంది పెత్తందారులు వీఆర్‌వోలను చేతిలో పెట్టుకుని గుట్టుగా బేరాలు సాగిస్తున్నారు. అన్ని కుదిరిన తర్వాత పలుకుబడితో పక్కనే ఉన్న జిరాయితీ నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

**దృష్టి సారించాం..**

డి.పట్టా భూముల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. జగనన్న కాలనీలోని ఖాళీ భూమిలో ఇటీవల కొందరు నీలగిరి మొక్కలు వేస్తుంటే అడ్డుకున్నాం. డి.పట్టా క్రయవిక్రయాలు చెల్లవు. వీటిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం. రామ్మోహనరావు, ఆర్డీవో

# పేదల బియ్యం బొక్కేస్తున్నారు!



అనంతపురం : అర్బన్‌లో కొందరు సిండికేట్‌గా మారి రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. స్థానిక నాయకులకు ప్రతినెలా కమీషన్లు అందిస్తున్నారు. అధికారులు సైతం అక్రమ రవాణాను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో ప్రజాప్రతినిధి అండతో స్థానిక నాయకులు రేషన్‌బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నారు. గుంతకల్లు, గుత్తి, పామిడి ప్రాంతాల్లో కిలో రూ.15 నుంచి రూ.18 చొప్పున కొనుగోలు చేసి ఒక చోటుకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో రాత్రిపూట జాతీయ రహదారి మీదుగానే కర్ణాటకలోని తూముకూరుకు తరలిస్తున్నారు. తాడిపత్రి పరిధిలో ఐదుగురు స్థానిక నాయకులు ఇంటింటికీ ఆటోలను పంపించి కిలో రూ.20 చొప్పున సేకరిస్తున్నారు. కొన్నిచోట్ల నేరుగా రేషన్ డీలర్ల నుంచే నొక్కేస్తున్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లిలోని రైసుమిల్లులకు తరలిస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. పేదల ఇళ్ల వద్దకు వెళ్లి బియ్యం సేకరించేందుకు ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేసుకున్నారు. అవకాశమున్న చోట నేరుగా చౌకదుకాణాల నుంచే బియ్యాన్ని నొక్కేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని ఒకచోటకు చేర్చి కర్ణాటకలోని మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ పాలిష్ చేసి.. పలు రకాల బ్రాండ్ల పేరుతో తిరిగి ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం నడిపేందుకు అక్రమార్కులంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. అన్ని ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించుకుని బియ్యం సేకరిస్తున్నారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారి మీదుగానే యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతుండటం గమనార్హం.

**కిలో రూ.20**

అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం ప్రాంతాల్లో ఆటోల ద్వారా కిలో రూ.18 నుంచి రూ.20 చొప్పున రేషన్ బియ్యాన్ని సేకరిస్తుండటం గమనార్హం. ఏజెంట్లకు కిలోకు రూ.3 కమీషన్ ఇస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని నియోజకవర్గాల వారీగా రహస్య ప్రాంతాల్లో డంప్ చేసి రాత్రి సమయాల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. కడప జిల్లా పులివెందులలో ప్రాంతంలో సేకరించిన బియ్యాన్ని ముదిగుబ్బ మీదుగా కర్ణాటకకు తీసుకెళ్తున్నారు. విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పట్టుకుంటున్నా అక్రమరవాణాకు అడ్డుకట్ట పట్టడం లేదు.

**స్థానిక మిల్లుల్లోనూ..**

ప్రస్తుతం కర్ణాటకలోనూ రేషన్ బియ్యం పంపిణీ చేపట్టడంతో కొంతమేర డిమాండ్ తగ్గింది. ఇటీవల కాలంలో స్థానిక రైసు మిల్లులకే విక్రయిస్తున్నారు. యాడికిలోని మిల్లులో వందల టన్నుల బియ్యం దొరకడమే ఇందుకు నిదర్శనం. రూ.20 చొప్పున సేకరించి రూ.25కు అమ్ముతున్నారు. పాలిష్ చేసి అమ్మితే అధిక లాభాలు వస్తాయనే ఉద్దేశంతో కొందరు మిల్లుల యజమానులు సైతం అక్రమార్కులకు వంత పాడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో ఇలా..విజిలెన్స్ కేసులు: 51

పట్టుబడిన రేషన్ బియ్యం: 1,926 క్వింటాళ్లు

# తెరముందు సైనికులు.. కథ నడిపేది ధనికులు!!

విశాఖపట్నం: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాటం చేసి వచ్చిన జవాన్ల సేవకు గుర్తుగా ఇచ్చిన భూములపై వైకాపా నాయకులు కన్నేశారు. మాజీ సైనికులకు ఇచ్చిన విలువైన భూములను కొట్టేయడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు వెలుగులోకి వచ్చిన ఉదంతాలే చెబుతున్నాయి. పలువురు నేతల అక్రమ వ్యూహాలకు అధికారులు కూడా సహకరించినట్లు స్పష్టమవుతోంది.

**భూములు కేటాయింపు ఎలా అంటే:** జవాన్లు పదవీ విరమణ పొందిన తర్వాత మూడేళ్లలోపు భూమి కోసం దరఖాస్తు చేసుకోవాలి. మాజీ జవాన్లు తమ మండల పరిధిలో భూమి గుర్తించి, ఆ వివరాలతో జిల్లా సైనిక బోర్డు నుంచి కలెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. సంబంధిత తహసీల్దార్ ద్వారా విచారణ చేసి.. ఎసైన్‌మెంట్ కమిటీలో పెట్టి ఆ భూమి కేటాయిస్తారు. కేటాయించిన భూమి సాగులో ఉండి పదేళ్ల తర్వాత నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందిన తర్వాత అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. సిపాయి నుంచి హవల్దార్ స్థాయి వారే భూమి కేటాయింపులకు అర్హులు. సుబేదార్ నుంచి పైస్థాయిలో పనిచేసిన ఆర్మీ అధికారులకు మన రాష్ట్రంలో ప్రభుత్వ భూములు కేటాయించరు.

**అర్హత లేకపోయినా:** ఎండాడ గ్రామం పరిధిలో 5.10 ఎకరాల భూమి జూనియర్ కమీషన్డ్ అధికారి (జేసీవో) హోదాలో పనిచేసిన మాజీ సైనిక ఉద్యోగికి కేటాయించినట్లు పత్రాలు చూపడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. నిబంధనల ప్రకారం అర్హతలేకపోయినా ఆర్మీలో జేసీవో స్థాయి అధికారికి 1971లో భూమి ఇచ్చినట్లు అధికారులు చూపించడం గమనార్హం.

నగరానికి సుదూరంలో ఉన్న అనంతపురం జిల్లాకు చెందిన బాలిరెడ్డి అనే జవానుకు విశాఖలో భూములు కేటాయించడం మరో విచిత్రం.



అయితే... గతంలో ఈ భూములను రికార్డుల్లోకి ఎక్కించి సీతారామయ్య వారసులు పండ్ల తోటలు సాగు చేస్తున్నారు.

బాలిరెడ్డి వారసులు జోజిరెడ్డి, సాగు చేస్తున్న సీతారామయ్య వారసులు శంకర్రావు ఈ భూమి కోసం కోర్టును ఆశ్రయించారు. ఆ తరువాత పరిణామాలు చకచకా మారిపోయాయి. జోజిరెడ్డికి అప్పట్లో వైకాపాలో ఉన్న నేత అండగా నిలిచారు. అనంతరం బాలిరెడ్డికి చెందిన భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ 2024 మార్చి 14న ఉత్తర్వులు వచ్చాయి. తరువాత శంకర్రావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించేలా చేసి, ఈ ఏడాది ఫిబ్రవరి 18న పూర్తిగా గుప్పిట్లోకి తీసుకున్నారు. గతంలో వైకాపాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన ఓ నాయకుడు ప్రస్తుతం కూటమిలో చేరారు. కీలక పదవిలో ఉన్న ఆ నేత ఈ మొత్తం పరిణామాల్లో చక్రం తిప్పారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ భూమి విలువ దాదాపు రూ. 250 కోట్ల వరకూ ఉంటుందని సమాచారం.


మాజీ మంత్రి కుమారుడి గుప్పిట్లోకి: కొమ్మాది వద్ద పరదేశీపాలెం పరిధిలో 1955లో ఇచ్చిన డిపట్టాలు రద్దు చేశాక మాజీ సైనికుల పేరుతో భారీ కుంభకోణానికి తెరతీశారు. కొంత కాలం క్రితం... 'నా భర్తకు ప్రభుత్వం పరదేశీపాలెం వద్ద 4.89 ఎకరాలు కేటాయించింది. ఆయన మరణించినందున భూమి విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వాలి' అంటూ విశాఖ అప్పుఘర్‌కు చెందిన ఒకరి నుంచి కలెక్టర్‌కు విన్నపం అందింది. వాస్తవానికి ఆ సైనికుడి పేరుతో అక్కడ భూమి కేటాయించలేదని ఆరోపణలున్నాయి. ఈ వినతిపై అధికారులు ఆగమేఘాలపై డి.పట్టా, టైటిల్‌డీడ్, పాసుపుస్తకం ఇచ్చేశారు. ఆ భూమి విక్రయించుకునేందుకు నిరభ్యంతర పత్రం ఇచ్చేశారు. వెంటనే వైకాపాకు చెందిన మాజీ మంత్రి కుమారుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం. వైకాపా హయాంలో ఈ స్థలం విలువ పెరిగేలా జీవీఎంసీ నిధులతో తారు రోడ్డు నిర్మించారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధం

శ్రీకాళహస్తి: స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్డులను ముద్రిస్తున్నారు. ఇప్పటికే కార్డుల ముద్రణ 90 శాతం మేర పూర్తి చేశారు. గత వైకాపా ప్రభుత్వం కార్డులను ఆ పార్టీ రంగులతో ముద్రించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నూతన సాంకేతికతతో స్మార్ట్ కార్డులకు శ్రీకారం చుట్టింది. క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు తరహాలో కొత్తవి ఉంటాయి. ఎలాంటి పార్టీ గుర్తు, రంగులు లేకుండా ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నం లబ్ధిదారుడి ఫొటో, చౌక దుకాణం నంబరు ఉంటాయి. వెనుకవైపు కుటుంబ సభ్యుల వివరాలు ముద్రిస్తారు.

**కొత్త కార్డులకు భారీగానే దరఖాస్తులు**

జిల్లాలో 1063 డిపోల పరిధిలో 5,37,038 మంది కార్డుదారులు ఉన్నారు. రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, కొత్తకార్డుల మంజూరుకు మే 7న సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. వీటిలో



కొత్త రేషన్ కార్డులకు 3501 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2వేలకు పైగా ఆమోదం లభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. గత ప్రభుత్వం చివరి మూడేళ్లు కార్డులు మంజూరు చేయలేదు. దీంతో వేల సంఖ్యలో లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేకపోయారు. కార్డుల్లో చనిపోయిన వారి పేర్ల తొలగింపు, పిల్లల పేర్లు చేర్పు, చిరునామా మార్పులు వంటి వాటికి ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం నుంచి రాగానే అందిస్తాం: ప్రభుత్వ నుంచి కొత్త రేషన్ కార్డులు రాగానే లబ్ధిదారులకు అందిస్తాం. ఏటీఎం కార్డు తరహాలో ఉన్న కారణంగా లబ్ధిదారులకు వెసులుబాటు కలుగుతుంది. కొత్త కార్డులకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.మూర్తి, డీఎస్ఓ

# అవయవదాతలు.. అభయ ప్రదాతలే



అనంతపురం : అమ్మ జన్మనిస్తే.. అవయవదానం ద్వారా పునర్జన్మను ఇవ్వొచ్చు. మరణించినా మరొకరిలో జీవించే వరం అవయవదానంతోనే సిద్ధిస్తుంది. ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయదాన దినోత్సవంగా జరుపుకొంటాం. ఇప్పుడిప్పుడు అవగాహన పెంచుకుంటున్న కొందరు అవయవదానానికి ముందుకొస్తుండటం అభినందనీయం

బుక్కరాయసముద్రంకు చెందిన జగదీశ్ 2023లో రోడ్డు ప్రమాదంలో జీవన్మృతుడయ్యాడు. గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులను తొలగించి గ్రీన్‌ఛానల్ ద్వారా తరలించారు. అతని అవయవాలను నలుగురికి అమర్చి వారి జీవితాల్లో వెలుగునింపారు.

అనంతపురం సాయినగర్ వాసి నర్మదమ్మ ఇటీవల ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె కళ్లను ఎల్వీప్రసాద్ ఆసుపత్రికి దానం చేశారు.

**70 మంది వీలునామా**

18ఏళ్లు నిండి ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ అవయవదానం చేయవచ్చు. మరణానంతరం మృతదేహాన్ని తీసుకోవచ్చనే వీలునామా రాసి ఇవ్వాలి. కుటుంబసభ్యుల అంగీకారం తప్పనిసరి. ఉమ్మడి అనంత జిల్లాలో ఇప్పటివరకు 70 మంది దేహదానానికి వీలునామా రాశారు.

శరీరదానానికి వీలునామా రాసిన వ్యక్తి మృతి చెందిన వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలోని మెడికల్ కళాశాలకు, సేవా సంఘం సభ్యులకు గానీ సమాచారం అందించాలి. 6 గంటల్లోపే అయితే కళ్లను ఇతరులకు అందజేయడానికి అవకాశం ఉంటుంది.

పరిగి మండలం కొడిగినహళ్లి పంచాయతీ సుబ్బరాయనపల్లికి చెందిన శ్రీనాథ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కొంతకాలం క్రితం ప్రమాదంలో బ్రెటయిన్‌డెడ్‌కు గురయ్యాడు. స్థానిక దేహదాతల సంఘం ప్రతినిధులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో దేహదానానికి అంగీకరించారు.

**3వేల అంగీకారపత్రాలు..**

– డా. పరదేశీనాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అనంతపురం వివిధ కళాశాలల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో 40కిపైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. 3వేల మందికిపైగా అవయవ దానానికి అంగీకారం తెలిపిన పత్రాలను ఏపీ జీవన్‌దాన్ ట్రస్టుకు అందజేశాం.


# ఉన్నత చదువులకు అండగా విద్యాలక్ష్మి

శ్రీకాళహస్తి:పేద, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్య చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విద్యాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ఆర్థిక, ఉన్నత విద్య, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలు, ఇండియన్ బ్యాంకు అసోసియేషన్ (ఏబీఏ) సంయుక్తంగా విద్యాలక్ష్మి పోర్టల్ రూపొందించాయి. దీనిలో 38 బ్యాంకులు నమోదయ్యాయి. 86 రకాల విద్యారుణాలు అందిస్తూ విద్యార్థుల కలలు సాకారం చేస్తున్నాయి.

ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఉన్నత విద్యాభ్యాసానికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించని వారికి ఈ పథకం ద్వారా రుణాలు మంజూరు చేసి వారి ఉన్నత విద్యను పూర్తి చేయడానికి బ్యాంకులు సమాయత్తం అవుతున్నాయి. ఇంజినీరింగ్, వైద్యం, ఛార్టెడ్ అకౌంటెంట్, మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎం.ఎస్., ఐఐటీ, వృత్తి విద్యా, విమానయాన కోర్సులు, యూజీసీ, ఏఐసీటీఈ, ఎంసీఐ, ఇతర ప్రభుత్వ అధీకృత సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకునే వారికి రుణాలు ఇస్తారు. జిల్లావ్యాప్తంగా 126 బ్యాంకులు ఉన్నాయి. పాయకరావుపేట, నర్సీపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం, సబ్బవరం, పెందుర్తి తదితర ప్రాంతాల్లో బ్యాంకర్లు ఈ పథకం కింద విద్యార్థులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేయడానికి ముందుకు వస్తున్నారు.

**నిబంధనలు ఇలా...**

పీఎం విద్యాలక్ష్మి ద్వారా మొత్తం 86 రకాల విద్యారుణాలు మంజూరు చేస్తున్నారు. దేశంలో పేరున్న 860 విద్యా సంస్థల్లో ప్రవేశం పొందిన



వారికి ఎలాంటి సెక్యూరిటీ, గ్యారంటీలు లేకుండా రుణాలు అందిస్తారు. యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు అందించే కోర్సులకు సైతం కొన్ని షరతులపై రుణాలు ఇస్తారు. విదేశాల్లో చదువుకునే వారు మాత్రం తప్పనిసరిగా సెక్యూరిటీ చూపించాలి.

విద్యాలక్ష్మి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో తక్కువ వడ్డీతో రుణం మంజూరు చేస్తారు. చదువుకు అయ్యే ఖర్చులతోపాటు ట్యూషన్ ఫీజు, వసతి, రవాణా ఖర్చులను కలిపి రుణం పొందే అవకాశం ఉంటుంది. ఎలాంటి ప్రాసెసింగ్ ఛార్జీలు వసూలు చేయరు.

రుణం పొందడానికి దరఖాస్తు ఇలా..మూడు పద్ధతుల్లో విద్యా రుణానికి దరఖాస్తు చేసుకోవచ్చు. %www.vidyalakshmi.co.in% వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబరు, ఈ మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం సీఈఎల్ఏఎఫ్ దరఖాస్తు పూర్తి చేయాలి. దీంతో పాటు ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. అర్హులైన విద్యార్థులకు మూడు విభాగాల్లో రుణాలు అందిస్తారు. మొదటి విభాగంలో రూ. 4 లక్షలలోపు, రెండో విభాగంలో రూ. 5 లక్షలు, మూడో విభాగంలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ రుణాన్ని మంజూరు చేస్తారు.

# నమ్మిన బంట్లు.. నకిలీల 'సృష్టి!

పాయకరావుపేట : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రం'లో జరిగిన నకిలీ సరోగసీ, పిల్లల అక్రమ రవాణా కేసులో కీలక పరిణామాలు విశాఖ కేంద్రంగా సాగాయి. హైదరాబాద్‌లో కౌన్సెలింగ్, ఇతర ప్రక్రియలు పూర్తి చేస్తే, డెలివరీలు, పిల్లల సంరక్షణ, అప్పగింత వంటి పరిణామాలన్నీ విశాఖలోనే జరిగినట్టు పోలీసు వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ కేసును మరింత లోతుగా విచారించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. **ప్రత్యేక వైద్య బృందం:** ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న డాక్టర్ నమ్రత విశాఖలో లేనప్పటికీ తనకంటూ ఓ వైద్య బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మొత్తం అరెస్టయిన వారిలో విశాఖకు చెందిన ఏడుగురు ఉన్నారని పోలీసులు వెల్లడించారు. వారిలో ప్రసూతి వైద్యురాలు డాక్టర్ పి.ఉషాదేవి ప్రసవాలను, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ ఏ.విద్యుల్లత పుట్టిన పిల్లల ఆరోగ్య స్థితిని పర్యవేక్షించేవారు. డాక్టర్ వాసుపల్లి రవి మత్తు వైద్య సేవలు అందించేవారు. నగరంలోని సృష్టి కేంద్రం మేనేజర్‌గా సీహెచ్.కల్యాణి, జూనియర్ ఎంబ్రాలజిస్టుగా బి.రమ్య సేవలు అందించారు. సబ్ ఏజెంట్లగా కొనసాగిన కె.రత్నం, కె.మీనాక్షి ఉన్నారు.

**మరికొందరిపై అనుమానాలు**

ఈ కేసులో మరికొందరి పాత్రపై అనుమానాలు ఉన్నాయని పోలీసు




వర్గాలు చెబుతున్నాయి. సిట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో లోతైన విచారణ జరిగితే.. మరికొందరు అరెస్టు అవుతారు. విశాఖకు చెందిన కొందరు వైద్యులు, మధ్యవర్తుల పాత్రపై పోలీసులు అనుమానిస్తున్నారు.

**'ఏ-1'పై క్రిమినల్ కేసులు..**

'ఏ-1'గా ఉన్న డాక్టర్ నమ్రతపై 2020లో మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌లో నాలుగు క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. వాటిల్లో మూడు 'ఛైల్డ్ ట్రాఫికింగ్' కేసులే. 2010లో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. 2018 నుంచి సృష్టి సంతాన సాఫల్యం కేంద్రం విశాఖలో సేవలు అందిస్తోంది. అయిదేళ్ల పాటు జడ్పీ రోడ్డులోని ఓ భవనంలో కొనసాగింది. ఆ తర్వాత పక్కనే ఉన్న మరో భవనంలోకి కేంద్రాన్ని మార్చి, ప్రచార బోర్డు మాత్రం ఏర్పాటు చేయలేదు. పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నా... జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆ కేంద్రం వైపు దృష్టి సారించలేదు. ఏటా ప్రైవేటు ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలను తనిఖీ చేసి లైసెన్స్‌లు తనిఖీ చేయాల్సిన జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతోనే అక్రమాలు కొనసాగాయి.

# పొలం పనులు.. పాము కాట్లు

పాయకరావుపేట : వారం రోజుల క్రితం సీతారాంపురానికి చెందిన పి.గోవింద్ గడ్డివాము నుంచి గడ్డి తీస్తుండగా కట్లపాము కాటేసింది. హుటాహుటిన తుని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడకు తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నారు. నక్కపల్లి మండలం జానకయ్యపేటకు చెందిన జి.అప్పలరాజును చేనులోనే పాము కాటేసింది. నక్కపల్లి మండలంలోని మనబాలవానిపాలెంకు చెందిన రెండేళ్ల బాలుడు పాము కాటు బారిన పడ్డారు.

ఖరీఫ్ పనుల ఆరంభమైందంటే పాము కాట్ల బారిన పడే రైతులు, కూలీల సంఖ్య పెరుగుతుంది. రాత్రింబవళ్లు పొలాల్లో పని చేసే వీరికి పాము కాటు ప్రాణాంతకంగా మారుతోంది. దేశంలో 240 జాతుల పాములుంటే వాటిలో 10 జాతులకు చెందిన 52 రకాల పాములు మాత్రం విషపూరితమైనవి. గడ్డివాములు, పంట పొలాలు, చెరువులు, కాలువ గట్లు, పశువుల పాకలు, గుబురుగా ఉండే పచ్చికలు, చల్లటి



ప్రదేశాల్లో ఎక్కువగా సంచరిస్తాయి. వర్షాకాలంలో సర్పాలు గుడ్లను పొదుగుతాయి. ఈ సమయంలో కోపంతోనూ, చిరాకుగానూ ఉంటాయి. అందుకే ఖరీఫ్ పొలం పనుల సమయంలో ఎక్కువగా పాముకాటు బాధితులు ఉంటారు. తాచు, కట్ల, నాగు పాములు కాటు ప్రాణాంతకంగా గుర్తించాలి. సర్పాలకు చెవులుండవు, భూమిపై ఏర్పడే ప్రకంపనల ద్వారానే గుర్తిస్తాయి. అతి స్వల్పమైన వేడిని సైతం గుర్తిస్తాయి. వేడి రక్తం ప్రవహించే మనిషి, జంతువులను తేలిగ్గా పసిగడతాయి.

**పాము కనిపిస్తే..**రాత్రివేళ పొలాలకు వెళ్లే వారు, గడ్డివాముల వద్ద, రాళ్లగుట్టల పరిసరాల్లో తిరిగేవారు టార్చిలైటు దగ్గర ఉంచుకోవాలి. పశువుల పాకలు, ఇంటి పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పాము ఎదురైతే తప్పించుకునేందుకు ప్రయత్నించాలి. ధైర్యమే అసలైన మందు: పాము కాటుకు గురైతే ధైర్యంగా ఉండాలి. కరిచిన భాగాన్ని కదిలించకూడదు. సకాలంలో ఆసుపత్రికి తీసుకువస్తే యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయం నుంచి గట్టెక్కించవచ్చు. కాటువేసిన భాగానికి కొద్దిగా పైన వస్త్రంతో లేదా తాడుతో కట్టాలి. ప్రతి 15 నిమిషాలకోసారి దాన్ని వదులు చేసి మళ్లీ బిగించాలి. నాటువైద్యం జోలికి వెళ్లవద్దు. వీలైనంత తక్కువ సమయంలో ఆసుపత్రికి తరలించాలి. ఆందోళనకు గురి కాకూడదు.డి.సుభాష్, వైద్యులు, పాయకరావుపేట పీహెచ్‌సీ

# కొబ్బరి కొండెక్కింది!

హిందూపురం : ఏ గుడికి వెళ్లినా భక్తులు టెంకాయ తీసుకెళ్తారు.. ఏ రుచికరమైన వంట చేయాలన్నా కొబ్బరి వాడకం తప్పనిసరి.. అలాంటి కొబ్బరి ధర నేడు ఆకాశాన్నంటింది. మార్కెట్లో ఇన్నాళ్లు రూ.20 ఉన్న కొబ్బరి కాయ నేడు రీటైల్ వ్యాపారులు రూ.50కి విక్రయిస్తున్నారు. కొన్ని మాసాల కింద కిలో ఎండుకొబ్బరి రూ.80 ఉండగా నేడు రూ.400కు చేరడంతో వినియోగదారులు కొనలేక లబోదిబోమ ంటున్నారు.

**యళ్లనీరు ఎంత పనిచేసింది..!**

కర్ణాటక ప్రాంతం టిప్పూటూరు, మాండ్య, సమీప ప్రాంతాలైన మధుగిరి, శిర, కునిగల్, అమరాపురం తదితర ప్రాంతాల్లో అధికంగా కొబ్బరి తోటలు ఉన్నాయి. ఇక్కడి నుంచి కొబ్బరికాయలు రాష్ట్రానికి సరఫరా చేస్తున్నారు. అయితే కర్ణాటక ప్రాంతంలో గత వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో కొబ్బరి నీళ్ల (యళ్లనీరు) వినియోగం పెరిగింది. దీంతో వీటి ధర కూడా పెరగటంతో రైతులు ఎక్కువ కాయలను కొబ్బరినీళ్ల వ్యాపారులకే విక్రయించారు. దీనివలన చెట్టులో



కాయ పూర్తిస్థాయిలో సిద్ధం కాక ముందే వాటిని చెట్టునుంచి తొలగించటంతో చెట్టు తెగుల బారినపడింది. దీని ప్రభావంతో దిగుబడి తగ్గింది. డిమాండ్ మేరకు కాయల సరఫరా లేనందున ప్రస్తుతం మార్కెట్లో ధరలు పెరిగాయి.

**శ్రావణ మాసంలో పెరిగే అవకాశం:** ప్రస్తుతం ఆషాఢ మాసంలోనే కొబ్బరి కాయల ధరలు ఈ విధంగా ఉంటే శ్రావణమాసంలో మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతి సోమ, శనివారాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యక్రమాలు అధిక సంఖ్యలో జరుగుతాయి. ఆ సమయంలో వాటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు

# కొలువుల కోర్సులకు జై

విశాఖపట్నం : పాలిటెక్నిక్‌కళాశాలల్లో తొలి ఏడాది ప్రవేశాలకు (జులై 16)వరకే గడువున్న నేపథ్యంలో ఆయా బ్రాంచిలను ఎంపిక చేసుకున్న వారంతా కళాశాలల్లో చేరారు. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. 'కెమికల్' బ్రాంచిలకు ఆదరణ కనిపించింది. ట్రిపుల్‌ఈ, మెకానికల్ బ్రాంచిల వైపూ విద్యార్థులు మొగ్గు చూపారు. భవిష్యత్తును ఊహించి విద్యార్థులు ఆచితూచి ఎంపిక చేసుకున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు.



**అందుకే ప్రాధాన్యం:** ఏ బ్రాంచి తీసుకుంటే త్వరగా ఉద్యోగం వస్తుందో వాటికే విద్యార్థులు ప్రాధాన్యం ఇచ్చారు. కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలోని నాలుగు బ్రాంచిల్లో సీట్లు భర్తీ అయ్యాయి. చాలా తక్కువ మిగిలాయి. ఇక్కడ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎప్పటికప్పుడు లభిస్తుండడంతో ఈ ఏడాది సైతం మంచి డిమాండ్ ఏర్పడింది. అలాగే ట్రిపుల్‌ఈ, మెకానికల్ బ్రాంచిలకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిమాండ్ కనిపించింది. ఆ బ్రాంచిలు కావలసిన వారు ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు రాని పక్షంలో 'ప్రైవేటు'లో చేరారు. ఇటీవల పాలిటెక్నిక్ విద్యకు డిమాండ్ పెరగడం, చదివిన విద్యార్థుల్లో అత్యధికులకు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు వస్తుండడంతో అందరి చూపు ఇటే నిలిచింది. పదోతరగతి అనంతరం పాలిటెక్నిక్ పూర్తి చేసిన తరువాత 19 ఏళ్లకే పలు కంపెనీల్లో విద్యార్థులు కొలువులు సాధిస్తున్నారు. ఈ పరిస్థితే వీరిని ఇటు వైపు తీసుకొచ్చింది. కొందరు విద్యార్థులు ఉన్నత విద్య లక్ష్యంగా బీటెక్ కోర్సుల వైపు వెళుతున్నారు.

# నక్కినా చిక్కేలా..!

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల కట్టడికి సాంకేతికత అందిపుచ్చుకోవాలని అధికారులు నిర్ణయించారు. పలు ప్రదేశాల్లో దాదాపు 340 నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. ముక్కంటి భక్తులను మోసగించడం, వారి వెంట దర్శనాలకు వెళ్లడం, అధికారుల కళ్లుగప్పి దర్శనాలకు తీసుకెళ్లడం తదితర వాటిపై తరచూ విమర్శలు వస్తున్నాయి. రద్దీ రోజుల్లో ఈ తరహా ఘటనలు మరింత ఎక్కువనే చెప్పాలి. వీటికి దశల వారీగా చెక్ పెట్టేందుకు వీలుగా నిఘా కెమెరాల్లోని సీసీ ఫుటేజీల పరిశీలనకు ప్రత్యేకించి ఉద్యోగులను నియమించారు. ప్రవేశ ద్వారాలు, మహద్వారం, స్వామి, అమ్మవార్ల ఆలయాల వద్ద నిఘా కెమెరాల్లోని ఐదు రోజుల ఫుటేజీలను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. అధికారులకు కన్పించకుండా నక్కి భక్త బృందాలకు దర్శనాలు చేయించిన ఐదుగురు భద్రతా సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. విధి నిర్వహణలో ఉన్న కొందరు సిబ్బంది కూడా దళారులకు సహకారం అందిస్తున్నారన్న భావనతో ఇప్పటికే పలువురిని గుర్తించారు. వీరిపైనా త్వరలో చర్యలు తీసుకునే అవకాశముంది.

**ఇకపై కేసులు!**ఇప్పటి వరకు దళారులను గుర్తించి పోలీసులకు అప్పగించడం.. వారు కౌన్సెలింగ్‌తో సరిపెడుతున్నారు. ఇకపై అలా కాకుండా అనధికారికంగా భక్తుల బృందాలను తీసుకెళ్లే దళారులపై గట్టిగా చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం సీసీ ఫుటేజీల్లో గుర్తించిన దళారులపై కేసులు పెట్టాలని నిర్ణయించారు. భక్తులను మోసగించడం, తక్కువ టికెట్లు తీసుకుని ఎక్కువ మందిని దర్శనాలకు తీసుకెళ్లడంబీ స్వామి, అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేయిస్తామని డబ్బులు తీసుకోనే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఇవన్నీ ఆచరణలోకి వస్తే వీలైనంత మేర దళారులు తగ్గుముఖం పట్టే అవకాశముంది.

# అక్కడే మందు.. ఆనక చిందు!



అనకాపల్లి: జిల్లాలో మద్యం దుకాణాలు బార్లుగా మారాయి. నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎక్సైజ్ శాఖ సమీక్షల్లో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ఆదేశిస్తున్నా అధికారులకు పట్టడం లేదు. దీనిని అలుసుగా తీసుకుని దుకాణదారులు అమ్మకాలు పెంచుకునేందుకు నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారు. అనకాపల్లి జిల్లాలో సుమారు 132 మద్యం దుకాణాలుండగా.. కొన్నిచోట్ల అక్కడే తాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**నిబంధనల ప్రకారం దుకాణాల్లో కేవలం** మద్యం విక్రయాలు మాత్రమే సాగాలి. షాపుల వద్ద తాగకూడదు. కేవలం బార్లకే పర్మిట్ రూమ్‌లను ఎక్సైజ్ శాఖ అనుమతిస్తుంది. కానీ.. మద్యం షాపుల్లోనే అనధికారికంగా పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తున్నారు. అంతా బహిరంగంగా సాగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేయడం లేదు. చట్ట విరుద్ధంగా సాగే వ్యవహారాలపై కఠినంగా ఉండాల్సిన పోలీసులు కూడా కిమ్మనడం లేదు. నెలనెలా మామూళ్లు ముడుతుండటంతోనే నోరు మెదపడం లేదనే విమర్శలు ఉన్నాయి.

**షాపుల వెనకే తతంగం**: లంకెలపాలెం కూడలి సమీపంలో ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద కొద్దిపాటి ఖాళీ స్థలం ఉంది. అందులోనే మందుబాబులు కోసం నిల్చుని తాగేలా బల్లలు ఏర్పాటు చేశారు. రోడ్డు వైపు నుంచి చూస్తే విక్రయాలు మాత్రం జరుగుతున్నట్లు కనిపిస్తుంది. వెనుకకు వెళ్లి చూస్తే. మద్యం తాగుతూ.. మత్తులో జోగుతూ కనిపిస్తారు.

నక్కపల్లి, ఉపమాక పరిధిలో మూడు, వేంపాడులో ఒకటి మద్యం దుకాణాలున్నాయి. వాటి చుట్టుపక్కల చిల్లర దుకాణాలు పెట్టుకుని.. అక్కడే తాగుతున్నారు. ఆయా దుకాణాలు చుట్టూ పాన్‌షాపులు పెట్టుకున్నవారు ప్రతి నెలా మద్యం దుకాణ యజమానికి తలో కొంత మొత్తం చెల్లిస్తున్నారు.

రాంబిల్లి మండలంలోనూ ఊరికి దూరంగా చాలా దుకాణాలున్నాయి. అక్కడే మందుబాబులు తాగేసి చిందులేస్తున్నారు.

పట్టణాల్లోనూ బహిరంగమే: అనకాపల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట వంటి పట్టణాల్లోనూ ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగుతున్న దృశ్యాలు కనిపిస్తాయి. అయినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అనకాపల్లి నెహ్రూచౌక్ సమీపంలోని ఓ మద్యం దుకాణం వద్ద పలువురు నిత్యం మద్యం తాగి రోడ్డు మధ్యలో దొర్లుతున్నారు. పట్టపగలే ఇలా చేస్తున్నా.. పోలీసులు సరిగా నియంత్రించ లేకపోతున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల వద్ద తాగడం నిషేధం. అలా కాకుండా ప్రత్యేక సదుపాయాలు కల్పించి.. దుకాణ పరిసరాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటాం. రాత్రి వేళల్లో రోడ్లపై తాగి.. అల్లరి చేస్తే కేసులు పెడతాం. వి.సుధీర్, జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి

# కప్పేస్తున్నా కదలరు!



ఎస్.రాయవరం : స్థిరాస్తి వ్యాపారుల మాయాజాలానికి జలవనరులు కనుమరుగవుతున్నాయి. పదిమందికి ఉపయోగపడే పంట కాలువ రూపురేఖలు లేకుండా పోతున్నా సంబంధిత అధికారులు కొరడా ఝుళిపించడం మాని కళ్లప్పగించి చూస్తుండిపోతున్నారు. ఎస్.రాయవరం మండలం పెదగుమ్మలూరు రెవెన్యూ పరిధిలో స్థిరాస్తి వ్యాపారులు పంట కాలువను లేఅవుట్ రోడ్డుగా మార్చేందుకు యత్నిస్తున్నారు. పెదగుమ్మలూరు రెవెన్యూ పరిధిలో కొండలను ఆనుకుని 2.97 ఎకరాల్లో పంటకాలువ ఉంది. దీనిద్వారా నీరు శివాలయం వద్దనున్న చెరువులోకి చేరుతుంది. సర్వే నంబర్ 181లో 0.45 ఎకరాలు, 183లో 0.20 ఎకరాలు, 173లో 0.87 ఎకరాలు, 174లో 0.44 ఎకరాలు, 178లో 1.01 ఎకరాల్లో ఈ కాలువ ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. సెటిల్‌మెంట్ ఫేర్ అడంగల్‌లోనూ (ఎస్ఎఫ్ఏ) గోర్జి, పంటకాలువగా నమోదైంది. దీనిని ఆనుకుని మూడేళ్ల క్రితం నలుగురు వ్యక్తులు సుమారు 30 ఎకరాల భూముల్లో భారీ లేఅవుట్ వేశారు. అడ్డురోడ్డుకు అతి సమీపంలో ఈ భూములు ఉండటంతో ఎకరా రూ. 5 కోట్ల వరకు విక్రయిస్తున్నారు. కానీ ఈ లేఅవుట్ వెళ్లేందుకు మార్గం లేదు. దీంతో స్థిరాస్తి వ్యాపారులు ఈ కాలువను చదును చేసి, పక్కనున్న జిరాయితీ భూముల్లో కలిపేసుకోవడానికి రెండేళ్ల క్రితమే ప్రయత్నాలు మొదలెట్టారు. ముందుగా సర్వే నంబర్ 181, 183లో గ్రావెల్ రోడ్డు, రెండువైపులా డ్రైన్ల నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై అభ్యంతరాలు రావడంతో అప్పుడు పనులు నిలిపేశారు. మళ్లీ ఇప్పుడు కాలువ మొత్తం కప్పేసి పక్కా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అడ్డురోడ్డు-నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకుని ఇంత దర్జాగా ఆక్రమణలు సాగుతున్నా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పంట కాలువ లేకపోవడంతో వర్షపు నీరు సమీపంలోని నివాసాలను, పొలాలను ముంచెత్తుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**పనులు నిలిపివేయించాం...** పెదగుమ్మలూరు పంటకాలువ, గోర్జి ఆక్రమించి డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో వెంటనే వీఆర్వోను పంపించి పనులు నిలిపివేయించాం. పంటకాలువను జిరాయితీ భూమిలో కలిపేసినట్లు గుర్తించాం. తిరిగి కాలువ తవ్వించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆక్రమణ ఆగకపోతే పోలీసులకు ఫిర్యాదు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

జి.రమేష్‌బాబు, ఎస్.రాయవరం తహసీల్దార్

చర్యలు తీసుకుంటాం.. పెదగుమ్మలూరు కాలువ 20 అడుగులు ఉండాలి. ఆక్రమణ విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. కాలువను కప్పేసినట్లు గుర్తించాం. రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేసి, హద్దులు నిర్ణయించి, కాలువను తవ్విస్తాం. జలవనరును ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. అమీనాబాను, జలవనరుల శాఖ ఏఈ

# సమస్యల నిలయం.. సరస్వతి క్షేత్రం

కొత్తపల్లి: రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి క్షేత్రంగా వెలసిల్లుతున్న కొలనుభారతి ఆలయం సమస్యలకు నిలయంగా మారింది. గతంలో తెదేపా హయాంలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టి గోపురం వరకు పనులు పూర్తి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా చొరవ తీసుకోకపోవడంతో పనులన్నీ మధ్యలోనే నిలిచాయి. ఇటీవల కొత్తపల్లి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే జయసూర్య.. ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని, ఆలయ నిర్మాణానికి హామీ ఇచ్చారు.



**అసంపూర్తిగా పనులు**

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివపురం గ్రామంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల మధ్య చారుఘోషిణి నది ఒడ్డున సరస్వతి ఆలయం ఉంది. తెలుగు, ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది భక్తులు వస్తుంటారు. కానీ, సరైన మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. తొమ్మిదేళ్ల క్రితం ఆలయ నిర్మాణానికి తెదేపా ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. గోపురం వరకు పనులు పూర్తయ్యాయి. తర్వాత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతోనే ఆలయ అభివృద్ధి కుంటుపడిందని భక్తులు ఆరోపిస్తున్నారు. దాదాపు దశాబ్దం కావస్తున్నా పనులు పూర్తి కాకపోవడంపై ఆందోళన చెందుతున్నారు.

**వసతుల్లేక సతమతం**

ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరు కళతప్పింది. గతంలో కార్తికమాసం, శ్రావణమాసం, శివరాత్రి వేళల్లో కోనేరులో భక్తులు స్నానాలు చేసి సర్వసతి దేవిని దర్శించుకునే వారు. ప్రస్తుతం నీరు లేకపోవడంతో స్నానాలు చేయలేని దుస్థితి నెలకొంది.

ఆలయంలో కనీస వసతులు లేవు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విశ్రాంతి గదుల్లేవు. ఆలయ ప్రాంగణంలోని మూడు శౌచాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. క్షేత్రానికి బీటీ రహదారి లేదు. రెండు వారాల క్రితం కురిసిన వర్షానికి దారంతా గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మూడు సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేయించాలని భక్తులు కోరుతున్నారు.

# కొలువు లక్ష్యం.. ఎన్‌సీసీతో సులభం

దేవీచౌక్ : ఆ యువతీయువకులు డిగ్రీ పూర్తవ్వగానే కొలువు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నారు. అందుకోసం ఎన్‌సీసీని మంచి వేదికగా భావించారు. అందులో చేరి జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదువుతున్న వీరంతా విశేషంగా రాణిస్తున్నారు. ఈ ఏడాది ఆర్డీసీకి ఒకరు, థలసైనిక్ క్యాంపునకు ఇద్దరు, రాక్ క్లైంబింగ్‌కు ఒకరు, ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్‌కు ఇద్దరు, ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపునకు ఏడుగురు ఎంపికయ్యారు. సెప్టెంబరులో జరిగే ఇంటర్ గ్రూప్ థలశైనిక్ క్యాంపునకు ఏడుగురు ఎంపికయ్యారు. ఈనెల 4న జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ ఎయిర్ కమాండర్ నరసింగ్ సైలాని చేతులమీదుగా ప్రవీణ్‌కుమార్, కవిత ఉత్తమ క్యాడెట్స్ మెడల్స్ అందుకున్నారు. జూన్ 22 నుంచి జులై 1 వరకు జరిగిన శిబిరంలో కళాశాల క్యాడెట్లు డ్రిల్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, సోలో సింగింగ్ అంశాల్లో ప్రథమ, కోకోలో ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా తమ లక్ష్యాల గురించి చెప్పారిలా..

**ఆర్మీలో చేరాలని..**



ఆర్మీలో చేరాలనే కల నెరవేర్చుకునేందుకు ఎన్‌సీసీలో చేరాను. ఐడీఎస్ఎస్‌సీ శిబిరానికి ఎంపికయ్యాను. ఇప్పటివరకు తొమ్మిది క్యాంపుల్లో పాల్గొన్నాను. చదువుతో పాటు ఎన్‌సీసీకి కూడా ప్రాధాన్యం ఇస్తున్నా. అధ్యాపకుల ప్రోత్సాహం బాగుంది.

– ఎ.వి.హేమలత, బీఎస్సీ తృతీయ సంవత్సరం

**అగ్నివీర్ పరీక్షకు..**

ఐడీఎస్ఎస్‌సీ క్యాంపులో షూటింగ్‌లో శిక్షణ పొందే అవకాశం లభించింది. ఇందులో ఇప్పటివరకు ఆరు క్యాంపుల్లో పాల్గొన్నా. మరో రెండింట్లో పాల్గొనే అవకాశం ఉంది. అక్కడ ప్రతిభ కనబరిస్తే మౌలాంకర్ జాతీయ క్యాంపునకు ఎంపికవచ్చు. డిగ్రీ తర్వాత ఆర్మీలోకి వెళ్తాను. ఈ నెలలో జరిగిన అగ్నివీర్ పరీక్షకు హాజరయ్యాను.

– ఎం.రవిశంకర్, బీఎస్సీ ప్రథమ సంవత్సరం

**కర్తవ్యపథ్‌లో పాల్గొన్నా..**

దిల్లీలో జరిగిన ఆర్డీసీ క్యాంపులో పాల్గొనడంతో కర్తవ్యపథ్‌కు ఎంపికయ్యాను. దీంతో డీడీజీ మెడల్ సాధించడంతో పాటు ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరానికి ఎంపికయ్యాను. ఇప్పటి వరకు 12 క్యాంపుల్లో పాల్గొన్నా. పోలీసు లేదా ఆర్మీలో చేరేందుకు ఎన్‌సీసీని ఎంచుకున్నాను.

– ఎ.కవిత, బీఎస్సీ తృతీయ సంవత్సరం

**15 శిబిరాలకు హాజరు..**

ఎన్‌సీసీలో ఇప్పటి వరకు 15 క్యాంపులకు హాజరయ్యాను. థలసైనిక్ క్యాంపులో పాల్గొని జడ్జింగ్ డిస్టెన్స్‌లో ద్వితీయ స్థానం సాధించాను. ఈనెల 15 నుంచి జరిగే ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరానికి ఎంపికయ్యాను. సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేయాలనే ఆలోచన ఉంది.– ఎం.ప్రవీణ్‌కుమార్ దొర, బీఎస్సీ తృతీయ సంవత్సరం

# చేనేత, మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్తు

పుత్తూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేనేత, మరమగ్గ కార్మికులను ఆదుకునే దిశగా అడుగులు వేసింది.. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందించనున్నట్లు మార్చి 16న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు.. ఈ మేరకు అప్పటి నుంచి ఆ శాఖ అధికారులు లబ్ధి పొందే కుటుంబాలను సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ నేపథ్యంలో చేనేత, మరమగ్గ కార్మికులకు ఆగస్టు ఏడో తేదీ నుంచి ఉచిత విద్యుత్తు అమలు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించడంతో ఆ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**అర్హులెవరంటే..**

చిత్తూరు జిల్లాలో పెనుమూరు, నగరి మండలంలోని మాంగాడు, పలమనేరుబీ తిరుపతి జిల్లాలో పుత్తూరు మండలం గొల్లపల్లి, నారాయణవనం, పాలమంగళం ఉత్తరం, దక్షిణం, వరదయ్యపాళెం, సత్యవేడు, వెంకటగిరి, పాపానాయుడుపేట, శ్రీకాళహస్తి, బీఎన్ కండ్రిగ తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. నగరి, పుత్తూరు, పాపానాయుడుపేట తదితర ప్రాంతాల్లో మరమగ్గాలున్నాయి. ఈ మేరకు ఆ శాఖ అధికారులు ఆయా కుటుంబాల విద్యుత్తు బిల్లులు పరిశీలించి అర్హుల జాబితా గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఉ



మ్మడి చిత్తూరు జిల్లాలో ఉచిత విద్యుత్తుకు 1,663 చేనేత కుటుంబాలు అర్హత సాధించాయి. 1,832 మంది మరమగ్గ కార్మికులకు ఈ రాయితీ వర్తించనుంది.

**జిల్లాలో లబ్ధి ఇలా..**

చేనేతలు: 191 మంది

మరమగ్గాలు: 948

**వైకాపా హయాంలో పట్టించుకోక..**

గత వైకాపా ప్రభుత్వం చేనేతలకు ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు. ఏడాదికి రూ.24 వేలు కొందరికే ఇచ్చి చేతులు దులుపుకొంది. తమకు రూ.24 వేలు వర్తింపజేయాలని పలుమార్లు అర్జీలు విన్నవించినా బుట్టదాఖలు చేసింది. ఈ నేపథ్యంలో చేనేతల కుటుంబ పోషణ కష్టసాధ్యమైంది. మార్గదర్శకాల ప్రకారం సర్వే.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వే చేసి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చేనేతలు 1,663 మంది, మరమగ్గాల కార్మికులు 1,832 మంది అర్హత పొందారు. రమేష్, ఏడీ, జిల్లా చేనేత, జౌళిశాఖ, ఉమ్మడి చిత్తూరు జిల్లా

## కలల వారధికి నిధుల వరద

సీతానగరం : గోదావరి వరదల సమయంలో లంక గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పవు. అది గుర్తించిన అప్పటి తెదేపా ప్రభుత్వం 2018-19లో సీతానగరం మండలం ములకల్లంక-బొబ్బిల్లంక గోదావరి నదిపై వంతెన నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరు చేసింది. 18 నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడంతో వైకాపా అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే వైకాపా వంతెన పనులు ప్రారంభించడంతో లంక గ్రామాల ప్రజలు ఎంతో సంబరపడ్డారు. కాలవ్యవధి గడువు 24 నెలలకు పెంచి అయిదేళ్ల వైకాపా పాలనలో ఆరు నెలలు చొప్పున పెంచుకుంటూ పోయారే తప్ప, నిర్మాణం పూర్తి చేయలేదు.

**రూ.4.85 కోట్ల బకాయిలు..**

300 మీటర్ల వంతెన పనులకు గుత్తేదారుడు సుమారు రూ.15 కోట్లు ఖర్చుపెట్టి 40 శాతం పనులు పూర్తి చేశారు. 2022 లోనే గుత్తేదారుకు రూ.4.86 కోట్లు బిల్లులు బకాయిలు పెట్టారు. అప్పట్లోనే గుత్తేదారుడు పనులు చేయడానికి నిరాకరించడంతో సుమారుగా రూ.20 కోట్ల పనులు (పిర్స్, గడ్డర్స్, శ్లాబు) ఆగిపోయాయి. వంతెన నిర్మాణానికి ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకు (ఏఐఐబీ) మంజూరు



చేసిన నిధులు 2024 మార్చి 31తో గడువు ముగిసింది. ఇలా ఉండగా సార్వత్రిక ఎన్నికల వేళ వంతెన పనులకు తెచ్చిన యంత్ర సామగ్రిని తీసుకెళ్లిపోయారు.

**అసెంబ్లీలో చర్చించారు..**

కూటమి అధికారంలోకి వచ్చాక ములకల్లంక, బొబ్బిల్లంక వంతెన పనులు పూర్తిచేసేందుకు రాజానగరం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో పలుసార్లు చర్చించారు. నిధుల గడువు ముగిసిపోవడమే కాకుండా బిల్లుల బకాయిలు, పనులు చేపట్టే సమయంలో నిధులు పెంచాలని విన్నవించారు. దీనిపై అసెంబ్లీలో చర్చించారు. 'వంతెన పనులకు ఏఐఐబీ రూ.45 కోట్లు పెంచుతూ ఆదేశాలు వచ్చాయి. మార్చి 2027 వరకు పనులు చేసేందుకు గడువు పెంచారు. ములకల్లంక, బొబ్బిల్లంక 1,400 మీటర్ల అప్రోచ్ రోడ్డు పూర్తి చేసేందుకు అదనంగా వచ్చిన నిధులతో అంచనాలు సిద్ధం చేశాం. ఈనెలాఖరుకు గుత్తేదారుకు ఇవ్వాల్సిన బిల్లులు మంజూరు అవుతాయి.' డీఈ (పీఆర్) శ్రీనివాసరావు అన్నారు.

## భవన స్వాధీనంలో తాత్సారం!

చిత్తూరు : సర్కారు సొమ్ము అంటే అందరికి అలుసే.. చూసుకుందాం.. ఎవరడుగుతారు.. అడిగితే ఏదోఒకటి చెప్పి కాలం గడుపుతాం అన్న తరహాలో వ్యవసాయ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో భవన నిర్మాణ పనులు పూర్తికాగానే ఆ భవనాలను సంబంధిత శాఖల అధికారులు స్వాధీనం చేసుకోవడం పరిపాటి. ఒకవేళ గుత్తేదారుకు బిల్లులు పెండింగ్ ఉంటే.. సదరు గుత్తేదారులు భవనాన్ని అప్పగించకుండా జాప్యం చేయడం సర్వసాధారణం. అయితే ఇక్కడ బిల్లులతో పనిలేదు.. కేటాయించిన నిధులకు అనుగుణంగా పనులు పూర్తిచేశాం.. భవనాన్ని స్వాధీనం చేసుకోండంటూ పోలీసు హౌసింగ్, వ్యవసాయ శాఖ అధికారులను సదరు గుత్తేదారు ప్రాధేయపడుతున్నా వారు పట్టించుకోక పోవడం గమనార్హం. ఇది ఎక్కడో కాదు.. సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోని జిల్లా వ్యవసాయ శాఖ ప్రయోగశాల(అగ్రి ల్యాబ్) భవనం దుస్థితి.

**రూ.3.68 కోట్లతో నిర్మాణం..**

జిల్లా రైతులకు ఎరువులు, పురుగు మందులు నాణ్యమైనవి అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా కేంద్రంలో గత వైకాపా ప్రభుత్వం జిల్లా స్థాయి అగ్రి ల్యాబ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులను పోలీసు హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. తొలుతగా రూ.2.96 కోట్లతో పనులు చేపట్టారు. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఈ ల్యాబ్ భవన నిర్మాణ పనులు చేపట్టింది. పూర్తిస్థాయిలో నిర్మాణానికి మరో రూ.2 కోట్లు అవసరమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్.. జిల్లా వ్యవసాయ శాఖకు ప్రతిపాదనలు పంపగా దీన్ని తిరస్కరించి అందుబాటులో ఉన్న నిధులతో పనులు పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు రూ.3.68 కోట్లు వెచ్చించి గ్రౌండ్ ఫ్లోర్ వరకు పూర్తిచేశారు.

**నెలలు గడుస్తున్నా..**

పనులు పూర్తయి ఐదు నెలలు కావస్తోందని, వెంటనే భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని గుత్తేదారు విన్నవించారు. దీనిపై హౌసింగ్ అధికారులు సదరు భవనాన్ని స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులకు లేఖ రాయడమే కాక.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ దీన్ని నేటివరకు పట్టించుకోలేదు. ప్రస్తుతం నూతన భవనం అలంకార ప్రాయంగా మారింది. గతంలో ఈ భవనంలో రూ.6 లక్షల విలువచేసే విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. దీన్ని ఇలానే వదిలేస్తే అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. తక్షణమే భవనాన్ని స్వాధీనం చేసుకుని అగ్రి ల్యాబ్ సేవలు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

## రోడ్డే కదా.. పాడైతే మాకేంటి..?

కుప్పం : కుప్పం నియోజకవర్గంలోని గ్రానైట్ క్వారీల నుంచి టన్నుల కొద్దీ బరువైన రాతి దిమ్మెలను ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. రోడ్ల సామర్థ్యం అనుసరించి.. గరిష్ఠంగా 30 టన్నులలోపు బరువును మాత్రమే రవాణా చేయాలి. కానీ ప్రధాన మార్గాలతో పాటు గ్రామీణ రహదారుల్లో.. 40-50 టన్నుల బరువైన రాళ్లను తరలించడంతో రహదారులు దెబ్బతింటున్నాయి.

శాంతిపురం, కుప్పం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో 500 కి.మీ. పైబడి బీటీ రోడ్లున్నాయి. ఇందులో గ్రామీణ, అంతరాష్ట్ర రహదారులే అధికం. స్థానిక క్వారీల నుంచి పొరుగు రాష్ట్రాలకు టన్నుల కొద్దీ గ్రానైట్ రవాణా నిత్యకృత్యంగా మారింది. నిర్దేశిత సామర్థ్యాన్ని మించి రాతి దిమ్మెల తరలింపుతో బీటీ రోడ్లు రూపు కోల్పోతున్నాయి.

కుప్పం-కేజీఎఫ్ అంతరాష్ట్ర డబుల్ రోడ్డు నిర్మాణానికి తెదేపా హయాంలో రూ.30 కోట్లు ఖర్చు చేశారు. ఐదేళ్లకు ఓ దఫా రెన్యువల్ చేస్తున్నారు. రోడ్డు నిర్వహణకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే.. గ్రానైట్ లారీల ధాటికి ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. శాంతిపురం మండలం అప్పయ్య తోపు వద్ద లారీల రాకపోకల తీవ్రతకు రోడ్డు దెబ్బతింది.

రాళ్లబూదుగూరు- కోనేరు కుప్పం మార్గంలో గ్రానైట్ లారీల ధాటికి మూడు రోడ్ల కూడలి వద్ద మలుపులో గుంతలు ఏర్పడ్డాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రూ.కోట్లు కేటాయిస్తున్నా..నియోజకవర్గ సమగ్రాభివృద్ధిలో భాగంగా.. రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు కేటాయిస్తోంది. ఏడాది కాలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.53 కోట్లు, పీఆర్ రహదారులకు రూ.45 కోట్లను మంజూరు చేసింది.

## కృత్రిమ కొరత.. అన్నదాత కలత



అనంతపురం: వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఖరీఫ్ సాగు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పుండుమీద కారం చల్లినట్లుగా కొందరు ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. రాయితీపై ఎరువులను ఆధార్ కార్డు ద్వారా విక్రయించాల్సి ఉంది. వ్యాపారులు ఎక్కడికక్కడ నిల్వలను దాచేసి డిమాండ్ పెరిగిన సమయంలో ధరలు పెంచి అమ్ముతున్నారు. ఎవరికి ఎంత విక్రయించారనే వివరాలు నమోదు చేయడం లేదు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో అధికారులు తనిఖీ చేయగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ మాయం అయినట్లుగా గుర్తించారు.

**బస్తాపై రూ.50 పెంచి..**

హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువలకు నీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో ఎరువులకు డిమాండ్ మొదలవుతుంది. రాయదుర్గం, బొమ్మనహాళ్, కణేకల్లు, గార్లదిన్నె, శింగనమల మండలాల్లో వరి రైతులకు యూరియా, డీఏపీ అధికమొత్తంలో ఎరువులు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో కృత్రిమ కొరత సృష్టించి బస్తాపై రూ.50 నుంచి రూ.150 వరకు పెంచి విక్రయించేందుకు కొందరు వ్యాపారులు ప్రణాళికలు రచిస్తున్నారు. మరికొందరు తమకు కేటాయించిన ఎరువులను రైతులకు కాకుండా కాంప్లెక్స్ ఎరువులు తయారుచేసే పరిశ్రమలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**అలంకారప్రాయంగా ఈ-పాస్ యంత్రాలు**

కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులు అందిస్తోంది. వ్యాపారులు అక్రమాలకు పాల్పడకుండా ఈ-పాస్ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు ఆధార్‌కార్డు నంబరుతో బయోమెట్రిక్ వేయించుకుని ఎరువులు విక్రయించాల్సి ఉంటుంది. జిల్లాలో సగానికి పైగా దుకాణాల్లో ఈ-పాస్ యంత్రాలను మూలనపడేశారు. గోదాముల్లో నిల్వలకు ఈ-పాస్‌లో వివరాలకు పొంతన ఉండటం లేదు. రాయదుర్గంలోని ఓ ఎరువుల దుకాణంలో బుధవారం అధికారులు తనిఖీ చేశారు. అంతకుముందు రోజు 800 బస్తాలు స్టాక్ వచ్చినట్లుగా రికార్డులో ఉంది. గోదాములో 100 బస్తాలు మాత్రమే ఉన్నాయి. ఒక్కరోజులో 700 బస్తాలు ఎక్కడకెళ్లాయని ప్రశ్నించగా.. రైతులకు విక్రయించానంటూ వ్యాపారి బుకాయించాడు. అందుకు సంబంధించిన బిల్లులు మాత్రం లేవు. దీంతో అధికారులు 6ఏ కేసు నమోదు చేసి దుకాణాన్ని సీజ్ చేశారు.

అనంతపురం పరిధిలో ఎరువులు, పురుగుల మందు డీలర్ల సంఘానికి చెందిన ఓ నాయకుడి దుకాణంలో తనిఖీ చేయడానికి అధికారులు వెళ్లారు. సదరు నాయకుడు స్థానిక ప్రజాప్రతినిధికి ఫోన్ చేసి తనిఖీలు జరగకుండా అడ్డుకున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం..** - ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్క్వాడ్ జిల్లాలో తనిఖీలు చేస్తోంది. ఇటీవల రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పరిశీలనలో తేలిన అంశాలపై త్వరలోనే నివేదిక అందజేస్తారు. దాన్ని బట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

## వాస్తవాలు మాయం.. అక్రమాల మయం



విశాఖపట్నం: వీఎంఆర్‌డీఏ అనుమతించిన లేఅవుట్‌లోని భూములనూ అక్రమార్కులు వదల్లేదు. ఈ లేఅవుట్‌కు సమీపంలో 'బృహత్తర ప్రణాళిక రోడ్డు' ప్రతిపాదించడంతో అక్కడున్న ఖాళీ స్థలంపై కన్నేశారు. ఆ భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి పాసుపుస్తకాలు చేయించి దర్జాగా విక్రయించేశారు. ఇదంతా చేసింది ఓ రెవెన్యూ ఉద్యోగి కావడం గమనార్హం. భీమిలి మండలంలో చోటుచేసుకున్న ఈ సంఘటన అధికారులను విస్మయానికి గురి చేసింది.భీమిలి మండలం నేరెళ్లవలసలో సర్వే నంబరు 27లో 2004లో అప్పటి 'వుడా' అనుమతితో 12.85 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి చేశారు. అందులో చాలా మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. 1.5 ఎకరాలు 'ఓపెన్ స్పేస్'గా వదలగా...అందులో ఉద్యానవనాన్ని అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. దీనిని వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళికలోనూ 'గ్రీన్‌బెల్ట్'గానే పేర్కొన్నారు. లేఅవుట్ నిర్వాహకులు సైతం దాన్ని అలాగే అభివృద్ధి చేశారు. 2021లో వీఎంఆర్‌డీఏ కొత్త 'మాస్టర్‌ప్లాన్' తయారు చేసింది. అందులో ఈ లేఅవుట్‌కు దగ్గరగా 70 మీటర్ల రోడ్డును ప్రతిపాదించింది. నాటి వైకాపా ప్రభుత్వంలో కీలక నేత ఇక్కడికి సమీపంలోనే ఆస్తులు కొనుగోలు చేశారు. ఈ పరిణామాలతో ఇక్కడి ఖాళీ స్థలం విలువ భారీగా పెరిగింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.కోట్లలో ఉంటుంది. అప్పటి భీమిలి తహసీల్దార్ కార్యాలయంలోని కొందరు ఉద్యోగుల కన్ను ఆ ఖాళీ స్థలం మీద పడింది. ఓ ఉద్యోగి అతని తల్లి పేరు మీద 80 సెంట్లకు తప్పుడు వివరాలతో పాసుపుస్తకం చేయించేశారు. ఇదంతా నాటి కీలక మండలాధికారి కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపణలున్నాయి. అక్కడితో ఆగకుండా హైదరాబాద్‌లో ఓ నకిలీ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయించేశారు. గతంలో ఈ అంశంపై ఫిర్యాదులు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు.

**పార్కు స్థలాన్ని ధ్వంసం చేసి:** మూడు నెలల కిందట పార్కు స్థలాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో అక్రమార్కులు కచె నిర్మాణానికి ప్రయత్నించారు. ఈ సమయంలో అక్కడున్న ప్రహరీని పగులుగొట్టి కొన్ని షెడ్లను కూల్చేశారు. పార్కు లోపలి స్థలాన్ని తవ్వేశారు. మురుగునీటి కాలువలను ధ్వంసం చేశారు. పార్కును ఆనుకొని జీవీఎంసీ నిర్మించిన తారు రోడ్డును భారీ యంత్రాలతో దర్జాగా తవ్వేశారు. అప్పట్లో భీమిలి పోలీసు స్టేషన్‌లో జీవీఎంసీ అధికారులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇటీవల మళ్లీ కలెక్టర్‌కు ఫిర్యాదు అందగా కేసు నమోదుకు సిఫార్సు చేశారు. బుధవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు ఇదే అంశంపై ఫిర్యాదు రాగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రణాళిక సిద్ధం.. కదలాలి యంత్రాంగం

రాజమహేంద్రవరం : జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్టేషన్ సమగ్ర పునరాభివృద్ధి(రీ-డెవలప్‌మెంట్) ప్రాజెక్టుకు రైల్వే మంత్రిత్వ శాఖ రూ.271.43 కోట్లు మంజూరు చేశారు. పనులు మాత్రం మొదలు కాలేదు. టెండర్ల దశలోనే తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎంపీ పురందేశ్వరి రైల్వే ఉన్నతాధికారులను కలిశారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**కొత్త ప్రతిపాదనలతో..**

అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో తొలుత రూ.250 కోట్లతో పనులకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో గతంలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత సమగ్ర పునరాభివృద్ధి ప్రాజెక్టుకు సంబంధించి కొత్త ప్రతిపాదనలు తెరపైకి వచ్చారు. పశ్చిమ, తూర్పుస్టేషన్లు అభివృద్ధి చేసేలా ఎంపీ పురందేశ్వరి, కూటమి నాయకులు రైల్వే ఉన్నతాధికారులతో చర్చించారు. తిరిగి అంచనాలతో ప్రతిపాదనలు పంపించారు. ఆ మేరకు రైల్వే మంత్రిత్వశాఖ రూ.271.43 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. టెండ్ల ప్రక్రియ మాత్రం మొదలుకాలేదు.

**భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా..**

రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో రోజూ 90కి పైగా ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతుండగా సుమారు 35 వేలమంది ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 2071-2072 నాటికి గంటకు 9,533 మంది, రోజుకు 95,328 మంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తారనే అంచనాతో పూర్తిస్థాయిలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు.




ఆ మేరకు వచ్చే పుష్కరాల నాటికి వసతులు సమకూరాలంటే ఇప్పటి నుంచే పనులు జరగాలి.

**చేయాల్సిన పనులు..**

పశ్చిమ వైపు రైల్వేస్టేషన్ సామర్థ్యం, ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కొత్త జీ౦3 స్టేషన్ భవన నిర్మాణాలు చేపట్టాలి. తూర్పు వైపు అత్యాధునిక సౌకర్యాల కల్పన, వాణిజ్య స్థలాలతో కూడిన జీ౦5 స్టేషన్ భవన నిర్మాణం. పెరిగే ట్రాఫిక్‌కు అనుగుణంగా అదనపు ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు.ప్లాట్‌ఫామ్‌ల అప్‌గ్రేడ్‌లో భాగంగా నిరంతర ఓవర్‌హెడ్ ప్యానెల్స్(సీవోపీలు)తో 17 ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టుల నిర్మాణం.రిటైల్ అవుట్‌లెట్‌లు, తినుబండారాలు అందుబాటులో ఉండేలా 24 మీటర్ల వెడల్పు, 110 మీటర్ల పొడవున ప్లాజా నిర్మాణం. స్టేషన్‌కు ఇరువైపులా ఆరు మీటర్ల వెడల్పుతో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌వోబీ)ల నిర్మాణం.పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధిలో భాగంగా రైల్వేస్టేషన్ వద్ద 300 కార్లను ఉంచే సామర్థ్యంతో నాలుగు పార్కింగ్ స్థలాల అభివృద్ధి. బహుళ-స్థాయి పార్కింగ్ సదుపాయం కల్పించాలి

## ఖరీఫ్‌లో కటకట

పి.గన్నవరం : శివారు ఆయకట్టుకు నీరందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వేసిన చోట్ల నారు మడులు ఎండిపోతున్నాయని నాట్లు వేసేందుకు దమ్ము చేద్దామంటే నీరు అందడం లేదని వాపోతున్నారు. క్లోజర్ పీరియడ్‌లో కొన్ని పిల్లకాలువల్లో పూడిక తీశారు. ప్రధాన పంట కాలువల్లో తీయకపోవడం, బోదెలను బాగు చేయని కారణంగా ఖరీఫ్‌లో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలోని పి.గన్నవరం మండలం నరేంద్రపురం, కుందాలపల్లి, ఉప్పలగుప్తం మండలం పేరాయి చెరువు శివారు ఆదిలక్ష్మీపురం, కూనవరం, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు శివారు రామాలయం పేట, దాసరివారిపేట, ఐచెరువు వంటి శివారు ప్రాంత ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడు తున్నారు.బుధవారం 'న్యూస్‌టుడే' కుందాలపల్లి, నరేంద్రపురం, పప్పుల వారిపాలెంలో పరిశీలించింది. కుందాలపల్లి నుంచి అవిడి వరకు ఉన్న పంట కాలువలో పూడికను పొక్లెయిన్‌తో తీయిస్తున్నామని, ఖర్చులు తామే భరిస్తున్నామని స్థానిక రైతులు తెలిపారు. ఇక్కడ సుమారు 250 ఎకరాల్లో ఇబ్బంది ఉందన్నారు. నరేంద్రపురంలో సొంత డబ్బులు పెట్టుకుని బోదెను బాగు చేయిస్తున్నారు. ఇక్కడ సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందడం లేదని వాపోతున్నారు.

**అంతంతమాత్రంగా నిర్వహణ పనులు**

పంటకాలువల్లో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి తూడు, గుర్రపుడెక్క వంటి పనులు చేసేందుకు ఓఅండ్ఎం నిధులు కేటాయించినప్పటికీ అంతంత మాత్రంగానే చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గన్నవరం ప్రధాన పంటకాలువలో పలుచోట్ల తూడు తొలగించకుండా



తాత్సారం చేస్తున్నారు. ఈ కారణంగా ఇక్కడ ప్రవాహ వేగం తగ్గింది. వర్షాలు లేక..: జూన్ మూడో వారం నుంచి వర్షాలు ఊపందుకోవాలి.జులైలోనూ ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు కురిస్తే శివారు ఆయకట్టుకు సైతం సమస్య లేకుండా ఉండేది. ప్రస్తుతం శివారు ప్రాంతాల్లో సమస్య మరింత పెరిగిందని రైతులు తెలిపారు.

**దమ్ముచేద్దామంటే వీలులేదు**

నేను మూడు ఎకరాల్లో వరిపంట సాగు చేస్తున్నాను. ఖరీఫ్ చేలు దమ్ము చేద్దామంటే నీరులేదు. మా ప్రాంతంలో సుమారు 150 ఎకరాలకు ఈ పరిస్థితి నెలకొంది. మూడు రోజులుగా అంతాకలిసి బోదెలో పూడిక తీయిస్తున్నాం. అధికారులు పరిశీలన చేసి సమస్యను పరిష్కరించాలి.

-కోట నాగభూషణం, రైతు, నరేంద్రపురం

**సొంత సొమ్ముతో బాగుచేస్తున్నాం**

ఓ వైపు సముద్రంలోకి గోదావరి జలాలను వదిలేస్తున్నారు. మాకు మాత్రం నీరు అందడం లేదు. కుందాలపల్లి నుంచి అవిడి వరకు పంటకాలువను సొంత డబ్బులు పెట్టుకుని నాలుగు రోజులుగా బాగుచేయిస్తున్నాం. శివారు ఆయకట్టు బీడును తలపిస్తోంది.ఏం చేయాలో అర్థంకావడంలేదు.

-మారిశెట్టి ధనరాజు, రైతు, కుందాలపల్లి


**సమావేశంలో చర్చిస్తాం..**సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ నెల 18న పి.గన్నవరం లోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. ప్రధాన పంట కాలువల్లో సాగునీరు పుష్కలంగా ఉంది.-కె.వెంకటేశ్వరరావు, ఈఈ,గోదావరి సెంట్రల్ డెల్టా

## పాతవని పక్కదారి

కర్నూలు : జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో గత విద్యా సంవత్సరం ముగింపు నాటికి పది క్వింటాళ్ల బియ్యం మిగిలింది.. ఆ నిల్వలు మాయం చేశారు. ఇలా చాలా పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం ఏప్రిల్ నెల వరకు సరఫరా చేసిన బియ్యం నిల్వలో మిగులు మాయమైనట్లు ఫిర్యాదులందడంతో అధికారులు లెక్కలు తీస్తున్నారు. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం నుంచే సన్నబియ్యంతో భోజనం పెట్టాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలకు 25 కిలోల సన్నబియ్యం ప్యాకెట్లు అందించారు. కర్నూలు జిల్లాకు ప్రతి నెలా 880 టన్నులు, నంద్యాలకు 620 టన్నుల మేర సరఫరా చేస్తున్నారు.

**ఆ సరకంతా ఏమైనట్లు**

పాత నిల్వలను జులై నెలలో వారంలో రెండు, మూడు రోజులపాటు అన్నం వండి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కంగుతిన్నారు. అప్పటికే సగానికి పైగా పాఠశాల



లు, వసతిగృహాలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాల్లో పాత బియ్యం నిల్వలు మాయమయ్యాయి. ఒక్కో పాఠశాల, వసతి గృహంలో కనీసం రెండు, మూడు క్వింటాళ్లు ఉండాలి. ఒక్క క్వింటా లేని పాఠశాలలు, వసతి గృహాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 160-200 మెట్రిక్ టన్నుల పాత బియ్యం నిల్వలను అమ్మేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

**డీలర్లతో ఒప్పందం**

బియ్యం నిల్వలు లేకపోవడంతో ఒకటి, రెండు బస్తాలను చౌక దుకాణాల నుంచి పాఠశాలల్లో తెప్పించి పెట్టారు. జులైలో విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు తనిఖీలకు రాకుంటే మీ బియ్యం మీకే ఇచ్చేస్తామంటూ డీలర్లతో అనధికారిక ఒప్పందాలు చేసుకున్నారు. ఆ మేరకు ఆగమేఘాలపై చౌక దుకాణాలు, ఇతర మార్గాల్లో పాత బియ్యాన్ని కొన్ని పాఠశాలల్లో నిల్వ ఉంచగా.. మరికొన్ని పాఠశాలలు, వసతిగృహాల్లో పాత నిల్వలు లేంటూ అధికారులకు నివేదికలు ఇస్తున్నారు. మరికొందరు ఓ అడుగు ముందుకేసి విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసినప్పటి నుంచి పాత బియ్యంతోనే విద్యార్థులకు భోజనం పెడుతున్నామని కాకి లెక్కలు రాసుకుంటున్నారు. లేని బియ్యం ఉన్నట్లు రికార్డుల్లో రాసుకొని మాయ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## రకుల్ సొగసు చూడ తరమా..!

రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసిన విషయం తెల్సిందే. ఈమె కోసం నెలల తరబడి వెయిట్ చేసిన హీరోలు కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు అంటే అతిశయోక్తి లేదు. అలాంటి స్టార్‌డం దక్కించుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌కి దూరం అయింది. టాలీవుడ్ లో ఆఫర్లు తగ్గడంతో బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసింది. అయితే బాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు దక్కినా లక్ కలిసి రాకపోవడంతో అక్కడ కూడా ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు లేవు. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె జోరు తగ్గడం లేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈమె దే దే ప్యార్ దే 2 సినిమాలో నటిస్తోంది. 2019లో వచ్చిన దే దే ప్యార్ దే సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో సీక్వెల్‌పై అంచనాలు ఉన్నాయి. మొదటి పార్ట్‌లో రకుల్ ప్రీత్ సింగ్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. అంతే కాకుండా రకుల్ అందాన్ని చూపించేందుకు కూడా స్కోప్ దక్కింది. ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్‌కి పెద్దగా క్రేజ్ లేదు. అయినా కూడా రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతూనే ఉంటాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి



ఫిజిక్ ఈమె సొంతం అంటూ ఉంటారు. అందుకే ఈమెను అత్యధికులు అభిమానిస్తూ ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు ఏకంగా 2.5 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈమె %ను% సిటీ షోస్టాపర్స్ అనే డిజిటల్ మ్యాగజైన్ కోసం ఫోటో షూట్ ఇచ్చింది. ఆ ఫోటో షూట్‌లో ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రకుల్ సొగసు చూడ తరమా అన్నట్లుగా ఈ ఫోటోలు ఉన్నాయి. అందమైన రకుల్ ప్రీత్ సింగ్ అంతకు మించిన అందమైన ఔట్ ఫిట్ ధరించి, ఒక పెయిటింగ్ మాదిరిగా ఫోజ్ ఇస్తే ఎలా ఉంటుందో అలాగే ఈ ఫోటోలో ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంతటి అందగత్తెకు టాలీవుడ్‌లో రావాల్సిన ఆఫర్లు రావడం లేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు అంటూ పలువురు సోషల్ మీడియా ద్వారా అసహనం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ అందాల ఆరబోత కెరీర్ ఆరంభంతో పోల్చితే ఏమాత్రం తగ్గలేదని కూడా కొందరు అభిమానులు కామెంట్ చేస్తున్నారు. టాలీవుడ్‌లో 2011లో కేరటం సినిమాతో అడుగు పెట్టిన రకుల్ ప్రీత్ సింగ్‌కి 2013లో వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌తో మంచి గుర్తింపు లభించింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో రకుల్ ప్రీత్ సింగ్ క్రేజ్ అమాతం పెరిగింది. టాలీవుడ్‌లో మహేష్ బాబు, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్, నాగ చైతన్య, రవితేజ, రామ్, మంచు మనోజ్, గోపీచంద్ వంటి స్టార్స్‌తో సినిమాల్లో నటించింది. కోలీవుడ్‌లోనూ ఈమె పలువురు స్టార్ హీరోలకు జోడీగా నటించి మెప్పించింది. అందం విషయంలో ఏమాత్రం తగ్గని ఈ అమ్మడు ముందు ముందు మళ్లీ ఈ అమ్మడు బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## శ్రీలీల రికార్డ్.. ఒకేసారి నాలుగు భాషల్లో..!

కన్నడ మూవీ 'కిస్'తో హీరోయిన్‌గా పరిచయం అయిన శ్రీలీల తెలుగులో 2021లో 'పెళ్లి సందడి' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. తెలుగులో మొదటి సినిమానే ఫ్లాప్ కావడంతో శ్రీలీలను ప్రేక్షకులు, ఇండస్ట్రీ వర్గాల వారు పెద్దగా పట్టించుకోరని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ లక్కీగా శ్రీలీలకు ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కింది. వరుస ఫ్లాప్స్‌లో ఉన్న రవితేజతో శ్రీలీల నటించడంతో చాలా మంది పట్టించుకోలేదు. కానీ ధమాకా సినిమా హిట్ కావడంతో పాటు, ఆ సినిమాలో శ్రీలీల అందంతో పాటు డాన్స్‌తో మెప్పించడంతో అందరి దృష్టిని ఆకర్షించింది. ధమాకాతో శ్రీలీల చేతికి ఏకంగా అర డజను సినిమాలు వచ్చి పడ్డాయి. హీరోయిన్‌గా ఒకే ఏడాదిలో డజనుకు పైగా సినిమాలతో వచ్చి అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఏడాది గ్యాప్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలను చేయడం మాత్రమే కాకుండా పలు సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకోగా, కొన్ని సినిమాలు ఆమెకు నటిగా, డాన్సర్‌గా గుర్తింపును తెచ్చి పెట్టాయి. 2024 చివర్లో వచ్చిన పుష్ప 2 సినిమా శ్రీలీలను పాన్ ఇండియా రేంజ్‌కి చేర్చింది. పుష్ప 2 లో శ్రీలీల కిస్సిక్ సాంగ్‌తో ఒక్కసారిగా బాలీవుడ్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ



ఐటెం సాంగ్ హిందీలో సూపర్ హిట్ కావడంతో శ్రీలీలకు హిందీ సినిమా ఇండస్ట్రీ నుంచి మాత్రమే కాకుండా తమిళ్‌లోనూ మొదటి ఆఫర్‌ను తెచ్చి పెట్టింది అనడంలో సందేహం లేదు. శ్రీలీల మొదటి సినిమా 2019లో చేయగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు, కన్నడ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చింది. ఇప్పుడు తమిళ్, హిందీ సినిమాలను సైతం చేస్తుంది. ఒకేసారి నాలుగు భాషల సినిమాలు చేస్తున్న హీరోయిన్‌గా అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది. ఒకవైపు కన్నడంలో జూనియర్, తెలుగులో మాస్ జాతర, తమిళ్‌లో పరాశక్తి, హిందీలో ఆషికి 3 సినిమాలు చేసి ఒకే సారి నాలుగు భాషల్లో నటించి రికార్డ్‌ను సృష్టించింది. శ్రీలీల హిందీలో నటిస్తున్న ఆషికి 3 ఇంకా విడుదల కాలేదు. అప్పుడే హిందీలో మరో సినిమాకు ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. అది కూడా చిన్నా చితకా హీరో కాకుండా ఏకంగా బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌తో శ్రీలీలకు ఛాన్స్ దక్కింది. ఈ మధ్య కాలంలో బాలీవుడ్ యంగ్ హీరోలు సౌత్ దర్శకులు, హీరోయిన్స్ వెంట పడుతున్నారు. అందులో భాగంగానే బాలీవుడ్ స్టార్ హీరో రణ్వీర్ సింగ్ తెలుగు దర్శకుడు బాబీ దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఆ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన అతి త్వరలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాలో శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేశారని తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో డాకు మహారాజ్ మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే హిందీ సినిమా నుంచి పిలుపు వచ్చింది. త్వరలోనే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. మరో వైపు తమిళ్‌లో పరాశక్తి విడుదల కాకుండానే మరో సినిమాను కూడా ఓకే చేసింది. ఆ సినిమా ప్రకటన త్వరలో రానుంది. మొత్తానికి శ్రీలీల మోస్ట్ బిజీ హీరోయిన్‌గా ఉంది.




## బ్లాక్ అంటే అందుకే ఇష్టం.. సీక్రెట్ రివీల్ చేసిన శృతిహాసన్!



ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతిహాసన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. సింగర్ గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఈమె.. ఆ తర్వాత తనకంటూ ఒక గుర్తింపును సొంతం చేసుకునే ప్రయత్నం చేసింది. అందులో భాగంగానే మొదట పలు చిత్రాలలో హీరోయిన్ గా నటించింది. కానీ పెద్దగా వర్కౌట్ కాలేదు. దాంతో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకుంది. ఇక పవన్ కళ్యాణ్ 'గబ్బర్ సింగ్' సినిమాతో లైమ్ లైట్ లోకి వచ్చిన తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలు ప్రకటిస్తూ బిజీగా మారిపోయింది శృతిహాసన్. సలార్ సినిమాతో పాన్ ఇండియా బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. బాలకృష్ణతో వీరసింహారెడ్డి, చిరంజీవితో వాల్తేరు వీరయ్య సినిమాలు చేసి ఒకే ఏడాది బాక్సాఫీస్ క్వీన్ గా నిలిచింది. దీనికి తోడు ఇప్పుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ' సినిమాలో హీరోయిన్ గా అవకాశం అందుకుంది.

ఈ సినిమా ఆగస్టు 14వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఈ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొన్న ఈమె.. తనకు ఇష్టమైన కలర్ గురించి.. ప్రత్యేకించి ఆ కలర్ ను ఇష్టపడడం వెనుక అసలు కారణాలు చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. నిజానికి శృతిహాసన్ ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసిందంటే చాలు ఆమె ప్రతి ఫోటో దాదాపు నలుపు రంగులోనే ఉంటుంది. సుమారు 90 శాతం ఫోటోలు ఈ బ్లాక్ కలర్ లోనే కనిపిస్తాయి. దీన్ని బట్టి చూస్తే ఈమెకు నలుపు అంటే ఎంత ఇష్టమో అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ నలుపు రంగు దుస్తులు ధరించడం వెనుక అసలు కారణాన్ని చెబుతూ.. బ్లాక్ కలర్ అంటే నాకు చాలా ఇష్టం. ఎందుకంటే మనం ఈ కలర్ వేసుకుంటే ఎంతమందిలో.. ఎక్కడ ఉన్నా చాలా ప్రత్యేకంగా కనిపిస్తాము. ముఖ్యంగా నా స్కిన్ టోన్ కి ఆ రంగు మరింత అద్భుతంగా సూట్ అవుతుంది. వాస్తవానికి నలుపు చాలామంది అశుభంగా పరిగణిస్తారు. కానీ నాకు మాత్రం ఇది ఒక సెంటిమెంట్ గా మారిపోయింది. బ్లాక్ డ్రెస్ వేసుకున్నప్పుడు నాలో ఎక్కడలేని ధైర్యం వస్తుంది. ఇక మిగతా రంగులతో పోల్చుకుంటే బ్లాక్ డ్రెస్ వేసుకున్నప్పుడు నేను మరింత రెట్టింపు ఉత్సాహంగా ఉంటాను. దీనికి తోడు డార్క్ కలర్స్ వేసుకున్నప్పుడు బయటకు వెళ్తే మరకలు పడినా ఎవరికీ సులభంగా కనిపించవు. అందుకే ఒక బెస్ట్ ఛాయిస్ గా నేను బ్లాక్ కలర్ ను ఎంచుకున్నాను" అంటూ సరదాగా చెప్పుకొచ్చింది శృతిహాసన్. ఇకపోతే శృతిహాసన్ స్కిన్ టోన్ కి ఈ కలర్ నిజంగా చాలా అద్భుతంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆమె ధరించే ప్రతి బ్లాక్ డ్రెస్ కూడా ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తాయని చెప్పవచ్చు. ఇక ప్రత్యేక ఆకర్షణగా నలుగురిలో నిలవడానికి ఈ ముద్దుగుమ్మ ఇలా ఈ కలర్ ను ఎంపిక చేసుకున్నానని చెప్పుకొచ్చింది. ఇక బ్లాక్ కలర్ తో పాటు డార్క్ కలర్స్ ఏవైనా సరే తనకు ఇష్టమే అంటూ కూడా చెప్పుకొచ్చింది.

## ప్రభాస్ కామెడీ..వారంతం అదే పనా!




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో 'ది రాజాసాబ్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. డార్లింగ్ 'ఫౌజీ' షూటింగ్ తో పాటు ఏక కాలంలో రాజాసాబ్ చిత్రీకరణకు హాజరవుతున్నారు. ఇప్పటికే రాజాసాబ్ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. సింహభాగం షూటింగ్ పూర్తయింది. తాజాగా కొత్త షెడ్యూల్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. దీనిలో భాగంగా ప్రభాస్ తో పాటు, వీటీవీ గణేష్, ప్రభాస్ సీన్ పై కామెడీ ట్రాక్ తెరకెక్కిస్తున్నారు. ఈ వారంతం వరకూ షూటింగ్ అక్కడే జరుగుతుంది. సినిమాలో ఈ కామెడీ ఎపిసోడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటున్నారు. ప్రభాస్ కామెడీ సైతం పండిచగల నటుడు. కెరీర్ ఆరంభంలో ప్రభాస్ నటించిన చాలా చిత్రాల్లో కామెడీ ట్రాక్ లో నూ కనిపించారు. కాల క్రమంలో భారీ యాక్షన్ థ్రిల్లర్ల వైపు వెళ్లడంతో కామెడీ కి పూర్తిగా దూరమయ్యారు. ఈనేపథ్యంలో మారుతి హారర్ థ్రిల్లర్ కామెడీ కథ వినిపించడంతో డార్లింగ్ మరో ఆలోచన లేకుండా కమిట్ అయ్యారు. తాను పెద్ద పాన్ ఇండియా స్టార్ అయినా మారుతి ఇమేజ్ తో పనిలేకుండా కమిట్ అయ్యారు. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ విషయంలో మారుతి తొలుత కాన్ఫిడెంట్ గా లేకపోవడంతో సినిమా చేయకూడదనుకున్నాడు. కానీ ప్రభాస్ ఒత్తిడి తీసుకురావడంతో కమిట్ అయ్యారు. ఈ విషయాన్ని మారుతినే స్వయంగా ఓ సందర్భంలో రివీల్ చేసిన సంగతి తెలిసిందే. తాజా షెడ్యూల్ అనంతరం పాటల చిత్రీకరణ మొదలవుతుందని సమాచారం. ఇందులో ముగ్గురు భామలు హీరోయిన్లగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. హీరోయిన్ల పాత్రల విషయంలోనూ డార్లింగ్ హస్తముంది. సినిమాలో తొలుత ఒకే హీరోయిన్ అనుకున్నారు. కానీ మరో నాయిక ఉంటే బాగుంటుంద ప్రభాస్ సూచించడంతో? ఇద్దరు కాదు...ముగ్గురని రిద్ధి కుమార్ ని థర్డ్ లీడ్ కి ఎంపిక చేసిన సంగతి తెలిసిందే.

## చీరకే అందాన్ని తెచ్చేలా అనసూయ హొయలు

మొదట టీవీ యాంకర్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు అందుకున్న అనసూయ భరద్వాజ్, తన మల్టీటాలెంట్‌తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినప్పటి నుంచి వరుసగా అభిమానులను అలరిస్తూనే ఉంది. 'క్షణం' సినిమాలో విలక్షణమైన పాత్రతో ఆకట్టుకున్న అనసూయ, 'రంగస్థలం'లో రంగమ్మత్త పాత్రతో మరింత క్రేజ్ సంపాదించింది. యాంకర్‌గా ఉన్నంత వరకు కేవలం గ్లామర్ షోకే పరిమితమవుతుందనుకున్నవారికి అనసూయ నటనతో సమాధానం చెప్పింది. తాజాగా అనసూయ చీరలో చేసిన ఒక ఫోటోషూట్ సోషల్ మీడియాలో దుమ్ము రేపుతోంది. గోధుమ రంగు మరియు ఆకుపచ్చ కలర్ మిక్స్ లో ఉన్న చీర, ఆమె అందాన్ని రెట్టింపు చేసింది. నెమలి ఆకారంలో మెరిసే ఈ డిజైన్ చీరలో అనసూయ చూపించిన ఎక్స్‌ప్రెషన్లు ఫ్యాషన్ వర్గాల్లో ప్రత్యేకంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ



లుక్‌లో ఆమె మెరిసే మేకప్, నాజూకైన ఆభరణాలు, మెరుపులా మెరిసే హెయిర్ స్టైల్ అన్నీ కలిసి పర్ఫెక్ట్ ట్రెడిషనల్ లుక్‌ను ఇచ్చాయి. ఆమె చూపిన గ్లామర్ డోస్‌తో పాటు గౌరవంగా నిలిచే హావభావాలు ఆమెలో ఉన్న వేరైటీని హైలైట్ చేస్తున్నాయి. సాధారణంగా చీరలలో లావణ్యంగా కనిపించటం కొంతమంది యాంకర్లకు కష్టంగా మారినా, అనసూయ మాత్రం తన క్యూట్ లుక్స్ తో మరింత అందాన్ని తెచ్చింది.

ప్రస్తుతం అనసూయ ఫ్లాష్ బ్యాక్ అనే తమిళ సినిమాతో బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఆమె తాజా ఫొటోలు చూస్తుంటే చీరకే ఓ కొత్త జీవం ఇచ్చినట్టుగా అనిపిస్తోంది. ఫ్యాషన్ స్టేట్మెంట్ ఇవ్వడంలో అనసూయకు ప్రత్యేకత ఉందని ఈ లుక్ మరోసారి రుజువు చేసింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు రంగమ్మత్త స్టైల్ రిటర్న్.. అంటూ పాజిటివ్ గా కామెంట్స్ చేస్తున్నారు.

## హీరోయిన్స్ నందు జాన్వీ కపూర్ వేరయ్యా...!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూనే ఉంది. గత ఆరు.. ఏడు ఏళ్లుగా జాన్వీ కపూర్ సినిమాలు చేస్తూనే ఉంది. కానీ ఇప్పటి వరకు అక్కడ హిట్ పడలేదు. నటిగా మంచి మార్కులు దక్కించుకుంటుంది, అందంతో కవ్విస్తుంది, ఆకర్షిస్తుంది. దాంతో జాన్వీ కపూర్‌కి వరుస ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఈమె హిందీ ప్రేక్షకుల ముందుకు హోమ్బౌండ్ సినిమాతో వెళ్లింది. ఆ సినిమా సైతం జాన్వీ కపూర్‌కి మళ్లీ నిరాశను మిగిల్చింది. బాలీవుడ్‌లో ఈమె చేసిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్‌లు అవుతున్నా పారితోషికం విషయంలో తగ్గడం లేదు. పై పెచ్చు సినిమా సినిమాకు పారితోషికం పెంచుతూ వస్తుందట. ప్రస్తుతం హిందీలో రెండు సినిమాలు, తెలుగులో ఒక సినిమాను చేస్తున్న జాన్వీ కపూర్ పారితోషికం గురించి షాకింగ్ వార్తలు ప్రచారం జరుగుతున్నాయి. హిందీ సినిమాలకు నామమాత్రంగా వసూళ్లు చేస్తున్న జాన్వీ కపూర్ టాలీవుడ్ సినిమాలకు మాత్రం షాకింగ్ రేంజ్‌లో డిమాండ్ చేస్తుందట. దేవర సినిమాకు అప్పట్లో రూ.4.5 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్య పారితోషికం తీసుకుందనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు రామ్ చరణ్‌తో బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో నటిస్తున్నందుకు అంతకు మించి పారితోషికం అందుకుందట. దేవర



సినిమా విడుదలకు ముందే ఆ సినిమా కమిట్ అయింది కాబట్టి సరే పారితోషికం ఎక్కువ డిమాండ్ చేసిందని అనుకోవచ్చు. ఎన్టీఆర్ దేవర సినిమా భారీ ఓపెనింగ్స్ అయితే రాబట్టింది కానీ, సూపర్ హిట్ సినిమాల జాబితాలో నిలువలేదు అనేది వాస్తవం. అంతే కాకుండా ఆ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు పెద్దగా ప్రాముఖ్యత లేదు. ఆమె చేసిన చాలా హిందీ సినిమాలతో పోల్చితే దేవర సినిమాలో చేసిన పాత్ర పరిధి చాలా తక్కువగా ఉంది. అయినా కూడా ఆ స్థాయి పారితోషికం ఎలా అందుకుందని చాలా మంది బాలీవుడ్ వర్గాల వారు ముక్కున వేలేసుకున్నారట. జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో చేస్తున్న సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం ఆమె గత చిత్రాల ఫలితాలతో పోల్చితే చాలా ఎక్కువే అని చెప్పాలి. ఇక ఆమె తెలుగు సినిమాలకు తీసుకుంటున్న పారితోషికం మరీ ఎక్కువ అనే టాక్ వినిపిస్తుంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం చేస్తున్న రామ్ చరణ్, బుచ్చిబాబు సినిమా పారితోషికంను మించి మరో తెలుగు సినిమాకు డిమాండ్ చేసిందట. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఆ సినిమాలో నటించేందుకు గాను ఏకంగా రూ.6.5 కోట్ల నుంచి రూ.7 కోట్ల మధ్య పారితోషికంను ఆమె డిమాండ్ చేసిందట. దాంతో నిర్మాతలు, మేకర్స్ అవసరమా అనే ఆలోచనలో ఉన్నారు. మంచి సినిమాలు చేయాలి, మంచి పాత్రలు చేయాలి, హిట్ కొట్టాలి అని కాకుండా జాన్వీ కపూర్ సినిమా సినిమాకు పారితోషికం పెంచుకుంటూ పోవాలి అనే ఆలోచన మంచిది కాదని, అది కెరీర్‌ను నాశనం చేస్తుందని సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. తెలుగులోనూ హిందీ సినిమాలకు తీసుకుంటున్నట్లుగా పారితోషికం తీసుకోవడం ఉత్తమం అని చాలా మంది సూచిస్తున్నారు. జాన్వీ మాత్రం తెలుగు, తమిళ సినిమాలు అనగానే పారితోషికంను ఆకాశమే హద్దు అన్నట్లుగా పెంచి చెబుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536